VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : సోమవారం 20.07.2026

సంపుటి : 09 సంచిక : 41 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



తెలంగాణ రాష్ట్రం ఏ నీళ్లు, నిధులు, నియామకాలు అనే ఆకాంక్షలతో ఏర్పడిందో, వాటిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ పూర్తిగా విస్మరించాయి

# బీమా ఏజెంట్ అంటే పాలసీలు అమ్మేవారు కాదు...

## కుటుంబాలకు భరోసా కల్పించే వ్యక్తి

- LIC ఏజెంట్లు సమాజానికి అందిస్తున్న సేవలు “ అమూల్యమైనవి
- కరోనా వంటి క్లిష్ట సమయంలో LIC ఏజెంట్ల సేవలు మరువ లేనివి
- LIAFI-1964 సికింద్రాబాద్ డివిజన్ త్రైవార్షిక మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు జూలై 19:**

LIAFI-1964 సికింద్రాబాద్ డివిజన్ త్రైవార్షిక మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్.

బీమా ఏజెంట్ అంటే పాలసీలు అమ్మేవారు కాదు... కుటుంబాలకు భరోసా కల్పించే వ్యక్తి

LIC ఏజెంట్లు సమాజానికి అందిస్తున్న సేవలు అమూల్యమైనవి

కరోనా వంటి క్లిష్ట సమయంలో LIC ఏజెంట్ల సేవలు మరువలేనివి

23 శాఖలు, 14 శాటిలైట్ శాఖల ద్వారా వేలాది ఏజెంట్లు ప్రజలకు సేవలందించడం అభినందనీయం

దేశ ఆర్థిక భద్రతలో బీమా రంగం కీలక పాత్ర పోషిస్తోంది

బీమాపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

▶ మిగతా 2లో

# గాంధీభవన్‌కు రావొద్దు.. జనంలో తిరగండి

- కాంగ్రెస్ నేతలకు సీఎం రేవంత్ రెడ్డి హుకుం
- పదవుల కోసం పైరవీలు చేసేవాళ్లకు అపాయింట్ మెంట్ ఇవ్వబోనని స్పష్టీకరణ
- జనంలో తిరగాలని.. ప్రజల సమస్యలు తెలుసుకోవాలని ఆదేశం
- ఆగస్టు 3 వరకు క్షేత్రస్థాయిలోనే ఉండాలని సూచన
- హైదరాబాద్‌లో తిరుగుతూ పదవుల కోసం పైరవీలు చేస్తే సహించేది లేదని హెచ్చరిక
- ఎస్ఐఆర్‌ను సవాల్‌గా తీసుకుని ఓటరు జాబితా ప్రక్రియను విజయవంతం చేయాలని సూచన



- బీఎల్ఓల నివేదికల కంటే బీఎల్ఏల సమాచారానికే ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశం
- ఇన్‌చార్జ్ మంత్రులు జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహించాలని నిర్ణయం
- ఎంపీలు ఢిల్లీలో ఉన్నా నియోజకవర్గాలపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని స్పష్టం

▶ మిగతా 9లో

# భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఘటనపై మంత్రి సీతక్క సీరియస్

**హైదరాబాద్ వెలుతురు జూలై 19:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మనుబోతులగూడెంలో పోడు భూముల వివాదానికి సంబంధించి చోటుచేసుకున్న ఘటనపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఘటనకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో మంత్రి సీతక్క ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అలాగే అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో కూడా చర్చించి పరిస్థితిని సమీక్షించారు. స్థానిక పరిస్థితులను దృష్టిలో



ఉంచుకుని సామరస్యపూర్వకంగా సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

# జమ్ముకశ్మీర్‌లో ప్రకృతి ప్రకోపం

- వరదలు, కొండచరియలు విరిగి 17 మంది మృతి
- మూడు ప్రముఖ ఆధ్యాత్మిక యాత్రలు నిలిపివేత!
- సరిహద్దు జిల్లాలను ముంచెత్తిన భారీ వర్షాలు
- పూంచ్ జిల్లా సురన్ కోట్‌లో దారుణ విషాదం



- ఇల్లు కూలి రెండేళ్ల చిన్నారితో సహా ఐదుగురు దుర్మరణం
- రాజౌరిలో ప్రమాదకర స్థాయికి చేరిన నదుల ప్రవాహం

# ఆషాఢ బోనాల సందర్భంగా సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్...

- రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించిన మంత్రి

**హైదరాబాద్, వెలుతురు జూలై 19:**

ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని రాష్ట్ర రవాణా ,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలు, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని కోరుకున్నట్లు తెలిపారు.

అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాలని, రాష్ట్ర అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా అమ్మవారి కరుణ ఉండాలని



ప్రార్థించినట్లు పేర్కొన్నారు.ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలపై ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి, రైతాంగం ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సమయానికి సమృద్ధిగా వర్షాలు కురవాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.ఆషాఢ మాసంలో జరిగే బోనాల ఉత్సవాలు తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని పేర్కొన్న మంత్రి, బోనాల ఉత్సవాలు జరుగుతున్న రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో మంచి వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించాలని ఆలయ పూజారులకు ,భక్తులకు విజ్ఞప్తి చేశారు. మంచి వర్షాలు కురిసినపుడే రైతాంగమే కాకుండా సబ్బండ వర్గాలు సంతోషంగా ఉంటాయని ఆకాంక్షించారు.

# బోనాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్



**నిజామాబాదు వెలుతురు జూలై 19:**

ఆషాఢ మాసం బోనాల పండుగ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ మహేష్ కుమార్ గౌడ్ ఆదివారం నిజామాబాద్ నగరంలోని అంబేద్కర్ కాలనీ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం మరియు కోటగల్లి శ్రీ కోట మైసమ్మ ఆలయంలను సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ప్రార్థించారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రజల ఐక్యతకు ఈ వేడుకలు నిదర్శనమని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు మహేష్ కుమార్ గౌడ్‌కు ఘన స్వాగతం పలికి అమ్మవారి ఆశీర్వచనంతో తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, కార్పొరేషన్ చైర్మన్లు శేఖర్ గౌడ్, తాహెర్బిన్, కేశ వేణు, కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# యూనివర్సిటీలు ఎందుకు పెట్టారు... వారి లక్ష్యాలు ఏమిటి..?

- బోధనా సిబ్బంది విద్యార్హతలు... ఎంట్రన్స్‌కు ఉన్న నిబంధనలేమిటి?
- ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ప్రశ్నలు
- పూర్తి వివరాలతో అఫిడవిట్ సమర్పించాలని ఆదేశం...
- సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలతో



యూనివర్సిటీల్లో తనిఖీలు

# వర్షపు నీటి ప్రతి చుక్కను ఒడిసిపట్టాలి..

- ఇంకుడు గుంతల నిర్మాణాన్ని తప్పనిసరి చేద్దాం
- ఎల్‌నినోను ఎదుర్కోవాలంటే ప్రజల భాగస్వామ్యమే కీలకం..
- మంత్రి పొన్నం ప్రభాకర్



# పేదోడి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- గ్రామం నుంచి మహానగరం వరకు ప్రతి నిరుపేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పిస్తాం
- క్యూర్ పరిధిలో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం శ్రీకారం
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార & పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు జూలై 19:**

రాష్ట్రం లో పేదవాడి సొంతింటి కల నెరవేరే వరకు ఇందిరమ్మ ఇళ్ల యజ్ఞం నిరంతరంగా కొనసాగుతుందని ఇది ఒకసారి చేపట్టి ముగించే కార్యక్రమం కాదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచారం పౌర



సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు.రాష్ట్రంలో గూడు లేని ప్రతి అర్హులైన నిరుపేద కుటుంబానికి చివరి లబ్ధిదారుని వరకు గౌరవప్రదమైన సొంతింటిని నిర్మించి అందించే వరకు ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని అన్నారు.

▶ మిగతా 2లో





# బీమా ఏజెంట్ అంటే పాలసీలు అమ్మేవారు కాదు...

(మొదటి పేజీ తరువాయి)

బీమా ఏజెంట్ల హక్కులు, సంక్షేమం కోసం నా వంతు కృషి చేస్తాను
ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ సేవ చేస్తున్న ఏజెంట్లకు అభినందనలు
లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ అనేది ఉద్యోగం కాదు... సేవా ధర్మం
LIC దేశ ప్రజల విశ్వాసానికి ప్రతీక... ప్రజా రంగ సంస్థగా మరింత బలోపేతం కావాలి
LIC డిస్ఇన్వెస్ట్‌మెంట్ ఉద్యోగులు, ఏజెంట్లు, పాలసీదారుల్లో ఆందోళన కలిగిస్తోంది
LIC స్వతంత్రత, విశ్వసనీయతను పరిరక్షించే విధానాలే దేశ ప్రయోజనాలకు అనుకూలం
LIC కేవలం బీమా సంస్థ కాదు... దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక
ఏజెంట్ల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తాను

# భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఘటనపై...

(మొదటి పేజీ తరువాయి)

విధి నిర్వహణ పేరుతో అతిగా వ్యవహరించినట్లు తేలితే సంబంధిత సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.తరతరాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూముల విషయంలో అటవీ ఆధారిత ఆదివాసి గిరిజన కుటుంబాల హక్కులను ప్రభుత్వం పరిరక్షిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. అర్హులైన స్థానికులకు చట్టబద్ధంగా హక్కులు కల్పిస్తోందన్నారు.అదే సమయంలో కొత్తగా పోడు భూముల ఆక్రమణలను రాష్ట్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఆదివాసి గిరిజనుల హక్కుల పరిరక్షణతో పాటు అటవీ సంపద సంరక్షణ కూడా ప్రభుత్వ బాధ్యతేనని పేర్కొన్నారు.

# జమ్మూకశ్మీర్‌లో ప్రకృతి ప్రకోపం

- **వందలాది కుటుంబాల తరలింపు, కొట్టుకుపోయిన వాహనాలు**
- **ఢిల్లీ పర్యటనను అర్ధాంతరంగా ముగించుకున్న సీఎం**
- **జమ్మూకు పయనమై సమీక్షకు సిద్ధమైన ముఖ్యమంత్రి**

**జమ్మూ వెలుతురు జూలై 2026:**

జమ్మూకశ్మీర్‌లోని సరిహద్దు ప్రాంతాల్లో ప్రకృతి ఒక్కసారిగా ప్రకోపించింది. ఆదివారం కురిసిన ఎడతెరిపి లేని భారీ వర్షాలు సరిహద్దు జిల్లాలైన పూంచ్, రాజౌరిలలో తీవ్ర విషాదాన్ని, అపార నష్టాన్ని మిగిల్చాయి. భారీ వర్షాల కారణంగా కొండ ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు (ఫ్లాష్ ఫ్లడ్స్) సంభవించడంతో పాటు పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘోర ప్రమాదాల్లో కనీసం 17 మంది ప్రాణాలు కోల్పోగా, మరికొందరు వరద ప్రవాహంలో కొట్టుకుపోయి గల్లంతైనట్లు అధికారిక వర్గాలు ధృవీకరించాయి. అనేక చోట్ల ప్రధాన రహదారులు దెబ్బతినడం, వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో సహాయక చర్యలు చేపట్టడానికి తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి.ఈ ప్రకృతి వైపరీత్యం వల్ల పూంచ్ జిల్లాలోని సురన్‌కోట్ తహసీల్ ప్రాంతం అత్యంత ఘోరంగా నష్టపోయింది. ఇక్కడి లోయర్ ముర్రా గ్రామంలో కురిసిన అకాల వర్షానికి ఓ భారీ కొండచరియ విరిగిపడి నేరుగా ఓ నివాస గృహంపై పడింది. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిది మంది సభ్యులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న రెస్క్యూ సిబ్బంది యుద్ధప్రతిపాదికన రంగంలోకి దిగి మట్టిని తొలగించారు. ఈ క్రమంలో ఒక రెండేళ్ల పసికందుతో సహా ఐదుగురి మృతదేహాలను వెలికితీశారు. ఇదే తహసీల్ పరిధిలోని సంగ్లా గ్రామంలో వరద ఉధృతికి మరో ఇల్లు పూర్తిగా కొట్టుకుపోగా, అందులోని నలుగురు వ్యక్తులు గల్లంతయ్యారు. వీరి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి.రాజౌరి జిల్లాలోనూ శనివారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షాలకు స్థానిక నదులు, వాగులు భయానక రీతిలో ఉప్పొంగాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునగడంతో ప్రమాదంలో ఉన్న వందలాది కుటుంబాలను రెస్క్యూ బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. రాజౌరి పట్టణ పరిధిలోని నది ప్రవాహంలో ఒక గుర్తుతెలియని మహిళ మృతదేహం లభించింది. వరద నీటి వేగానికి రహదారులపై నిలిపిన అనేక వాహనాలు కొట్టుకుపోగా, మరికొన్ని నీటిలో మునిగిపోయాయి. దీనివల్ల రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. గ్రామాలకు కనెక్టివిటీ కట్ అవ్వడంతో పాటు విద్యుత్, తాగునీటి సరఫరా వ్యవస్థలు పూర్తిగా దెబ్బతిన్నాయి.రాష్ట్రంలో నెలకొన్న ఈ అత్యవసర పరిస్థితులపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తక్షణమే స్పందించారు. అధికారిక పనుల నిమిత్తం దేశ రాజధాని న్యూఢిల్లీలో ఉన్న ఆయన, తన పర్యటనను మధ్యలోనే రద్దు చేసుకుని తక్షణమే జమ్మూకు తిరిగి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. వాతావరణ పరిస్థితులు ఆందోళనకరంగా మారినందున అధికారులతో నిరంతరం మాట్లాడుతున్నానని చెప్పారు. ప్రజల ప్రాణాలను కాపాడటమే తమ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యతని, సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని సీఎం భరోసా ఇచ్చారు.జమ్మూకశ్మీర్ విపత్తుపై కేంద్ర ప్రభుత్వం కూడా హై అలర్ట్ అయింది. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ పర్యటనలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదివారం ఢిల్లీ అధికారులతో కలిసి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అనంతరం జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, సీఎం ఒమర్ అబ్దుల్లా ఇద్దరితోనూ ఆయన ఫోన్ లో మాట్లాడి క్షేత్రస్థాయి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుల రక్షణకు, పునరావాస చర్యలకు కేంద్ర ప్రభుత్వం నుండి జాతీయ విపత్తు స్పందన దళాలు సహా అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను తక్షణమే అందిస్తామని హోంమంత్రి హామీ ఇచ్చారు.వాతావరణ శాఖ ఇచ్చిన ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అత్యంత ప్రతిష్టాత్మకమైన అమర్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. యాత్రికుల ప్రాణాలకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు పహల్గాం, బాల్తాల్ బేస్ క్యాంప్ మార్గాల ద్వారా వెళ్లే ప్రయాణాలను ఆపేశారు. అలాగే జమ్మూ నగరంలోని భగవతి నగర్ యాత్రి నివాస్ బేస్ క్యాంప్ నుండి కూడా భక్తులను ముందుకు సాగనివ్వడం లేదు. కొండ మార్గాల్లో వాతావరణం అనుకూలించే వరకు యాత్రికులు ఎక్కడికక్కడే సురక్షితంగా ఉండాలని అధికారులు కోరారు.భారీ వర్షాల ప్రభావం రియాసి జిల్లాపై కూడా తీవ్రంగా పడింది. కొండల పైనుంచి నీరు ప్రవహిస్తుండటంతో ఆ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మాతా వైష్ణోదేవి ఆలయ యాత్రను కూడా తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా యాజమాన్యం ప్రకటించింది. భక్తులు కొండపైకి వెళ్లకుండా కింది భాగంలోనే నిలిపివేశారు. భక్తులెవరూ సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని, కేవలం అధికారిక ప్రకటనలను మాత్రమే ఫాలో అవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో రియాసి జిల్లాలోని మరో ప్రముఖ శివక్షేత్రమైన శివ్‌ఖోరీ గుహాలయ యాత్రను కూడా భద్రతా కారణాల దృష్ట్యా తాత్కాలికంగా ఆపేస్తున్నట్లు స్పష్టం చేశారు.వాతావరణ పరిశోధన కేంద్రం అందించిన తాజా సమాచారం ప్రకారం.. జమ్మూకశ్మీర్ పరిధిలో రాబోయే జులై 23వ తేదీ వరకు వాతావరణం ఇలాగే అనుకూలించకుండా ఉంటుందని, పలుచోట్ల మోస్తరు నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని హెచ్చరించారు.

# పేదోడి సొంతింటి కలను సాకారం...

(మొదటి పేజీ తరువాయి)

పేదల సొంతింటి కలలను సాకారం చేయడమే గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ సంకల్పమని తెలిపారు.క్యూర్ (CURE) పరిధిలో ఇందిరమ్మ ఎల్ఐజీ ఇళ్ల కార్యక్రమాన్ని సోమవారం రాష్ట్ర సచివాలయంలో ప్రారంభించనున్న నేపథ్యంలో ఆదివారం ఉన్నతాధికారులతో మంత్రి గారు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే రాష్ట్రంలో ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి గౌరవప్రదమైన, సౌకర్యవంతమైన సొంత నివాసం కల్పించాలనే సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో 100 శాతం సబ్సిడీతో రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తూ పేదల ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా, ఇప్పటికే సుమారు రెండు లక్షల ఇళ్లు పూర్తై లక్షలాది కుటుంబాలు గృహప్రవేశాలు చేశాయని, మిగిలిన ఇళ్ల నిర్మాణం వేగంగా కొనసాగుతోందన్నారు.గత నెల 2వ తేదీన ఆసిఫాబాద్ జిల్లాలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. రెండో విడతలో హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఇండ్ల మంజూరు ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు.ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాలపై దృష్టి సారించిన ప్రభుత్వం, ఇప్పుడు హైదరాబాద్ నగరంతో పాటు పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదల సొంతింటి కలను కూడా నిజం చేయబోతోందని మంత్రి పేర్కొన్నారు.క్యూర్ పరిధిలో లక్ష ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందన్నారు. తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.సోమవారం ఉదయం 11.30 గంటలకు రాష్ట్ర సచివాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి ఇన్‌చార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, హైదరాబాద్ జిల్లా మంత్రి మహ్మద్ అంతో కలిసి దరఖాస్తు విధానం, అర్హతలు, బ్రోచర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు.పేదల ఇళ్ల కోసం నగరంలో కోట్ల రూపాయల విలువైన అత్యంత కీలక ప్రాంతాలను ప్రభుత్వం గుర్తించిందని, ఆయా ప్రాంతాలలో స్థానిక పరిస్థితులను బట్టి ఒక ఎకరా నుండి ఐదు ఎకరాల వరకు స్థలాలను సేకరించినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వాల మాదిరిగా నగరానికి దూరంగా కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని మంత్రి గారు స్పష్టం చేశారు. కుటుంబాల జీవనోపాధికి, పిల్లల చదువులకు, ఉద్యోగాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళిక రూపొందించామని తెలిపారు.అధునాతన సౌకర్యాలతో బహుళ అంతస్తుల (పది అంతస్తుల వరకు) భవనాల నిర్మాణం చేపట్టి, ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన జీవనం కల్పిస్తామని మంత్రి పేర్కొన్నారు.ప్రతి నియోజకవర్గాన్ని ప్రత్యేక యూనిట్‌గా తీసుకుని అమలు చేస్తున్న ఈ పథకంలో ఆ నియోజకవర్గ ప్రజలు అదే నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లు కలిపి మొత్తం 3.50 లక్షల కొత్త ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని, గత ఏడాది మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లతో కలిపి మొత్తం 8 లక్షలకు పైగా పేద కుటుంబాల జీవితాల్లో సొంతింటి వెలుగులు నింపుతున్న ప్రజా ప్రభుత్వం చరిత్ర సృష్టిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణ రాష్ట్రం ఏ నీళ్లు, నిధులు, నియామకాలు అనే ఆకాంక్షలతో ఏర్పడిందో, వాటిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ పూర్తిగా విస్మరించాయి

**హైదరాబాద్ వెలుతురు జూలై 19:**

తెలంగాణ రాష్ట్రం ఏ నీళ్లు, నిధులు, నియామకాలు అనే ఆకాంక్షలతో ఏర్పడిందో, వాటిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ పూర్తిగా విస్మరించాయని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు,ఈ రెండు పార్టీలు రాజకీయ "బిల్లా రంగా" నాటకాలు ఆడుతున్నాయని ఒకరికి అధికార దాహం, మరొకరికి అవినీతి మోహమని విమర్శించారు.వేల కోట్ల కాళేశ్వరం అవినీతిపై అధికారంలోకి రాగానే చర్యలు తీసుకుంటామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు బీఆర్ఎస్తో కుమ్మక్కైందని ఆరోపించారు. ఒక పార్టీ తిరిగి అధికారంలోకి రావాలని, మరో పార్టీ అవినీతి సొమ్మును కాపాడుకోవాలని తహతహలాడుతుండగా, రైతులకు మాత్రం సాగునీరు అందకుండా పోతోందన్నారు.లక్షల కోట్ల అప్పుల భారంతో తెలంగాణ ప్రజల జీవితాలను అంధకారంలోకి నెట్టారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంపై ₹8.2 లక్షల కోట్ల అప్పుల భారం మోపగా, కాంగ్రెస్ సుమారు 30 నెలల్లోనే ₹4 లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. ఇంత అప్పు చేసినా ఉద్యోగులకు పీఆర్సీ, పీఎఫ్ బకాయిలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు.బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు కలిసి సింగరేణికి సుమారు ₹59,000 కోట్ల బకాయిలు పెట్టాయని, ఫీజు రీయింబర్స్మెంట్ కు ₹12,000 కోట్ల బకాయిలు చెల్లించకుండా విద్యార్థులు, కళాశాలలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు.నాడు కాంగ్రెస్ నిర్వహించిన 'యూత్ డిక్లరేషన్', నేడు బీఆర్ఎస్ నిర్వహిస్తున్న 'యువ సంగ్రామం'— రెండూ నిరుద్యోగుల ఓట్ల కోసం ఆడుతున్న రాజకీయ నాటకాలేనని అన్నారు. ఎన్నికల సమయంలో సరూర్నగర్కు ఢిల్లీ నుంచి ప్రియాంకా గాంధీని తీసుకొచ్చి హామీల వర్షం కురిపించిన కాంగ్రెస్ యువతను మోసం చేసిందని, పదేళ్లు నిరుద్యోగులను మోసం చేసిన బీఆర్ఎస్ ఇప్పుడు అదే సరూర్ నగర్ లో సభ పెట్టి కాంగ్రెస్ను విమర్శించడం హాస్యాస్పదమన్నారు.నిరుద్యోగుల గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు లేదన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగాలు భర్తీ చేయకుండా, పరీక్షలను సక్రమంగా నిర్వహించకుండా, ఒక్కో పరీక్షను మూడుసార్లు నిర్వహించి అభ్యర్థులను కోర్టుల చుట్టూ తిప్పారని విమర్శించారు.ప్రతిభను కాపాడాల్సిన TSPSCని బీఆర్ఎస్ పాలనలో పేపర్ లీకులకు కేరాఫ్ అడ్రస్ మార్చారని మండిపడ్డారు. ఒక పరీక్షకు మూడుసార్లు పరీక్ష నిర్వహించి, నిరుద్యోగుల జీవితాలనే అగ్ని పరీక్షగా మార్చారని ఆరోపించారు.GO 46ను తీసుకొచ్చి ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షలకు సిద్ధమైన గ్రామీణ ప్రాంత యువతకు తీవ్ర అన్యాయం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. ఒకే పరీక్ష నిర్వహించి ప్రాంతాల వారీగా వేర్వేరు కటాఫ్ లు పెట్టి అర్హులైన అభ్యర్థుల అవకాశాలను దెబ్బతీశారని పేర్కొన్నారు. తాము తెచ్చిన GO 46పైన కోర్టుకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులు, ఇప్పుడు అదే జీవోపై మాట్లాడటం ఓట్ల రాజకీయమేనని విమర్శించారు."మోకాళ్లపై హామీల వర్షం–గద్దె నెక్కాక నిరుద్యోగులపై విషం" అన్నట్లుగా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని అన్నారు. GO 46 రద్దు చేస్తామని, అధికారంలోకి వచ్చిన తొలి సంవత్సరంలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగుల ముందు మోకాళ్లపై కూర్చొని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు అదే యువతను ఉద్దేశించి "ఎండ్రిన్ తాగినా ఉద్యోగాలు ఇవ్వను" అనే స్థాయిలో అవమానిస్తున్నారని ధ్వజమెత్తారు.నిరుద్యోగులను మోసం చేసింది బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలేనని స్పష్టం చేశారు. యువత పేరుతో ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన ఈ పార్టీలు, ఇప్పుడు నిరుద్యోగులను రోడ్లపైకి తీసుకొచ్చి సభలు నిర్వహిస్తూ, వారి కోసమే పోరాడుతున్నట్లు నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు.యువత, నిరుద్యోగుల గురించి కేటీఆర్ మాట్లాడితే తెలంగాణ సమాజం నవ్వుకుంటుందని అన్నారు. తెలంగాణ యువత అనుభవిస్తున్న ఆకలి, అప్పులు, అవమానాలు, అన్యాయాలు, అణిచివేతకు పదేళ్ల బీఆర్ఎస్ పాలనే మూల కారణమన్నారు. ఇప్పుడు నిరుద్యోగులకు "పొట్టపొట్ట ఆకలి" ఉందని కేటీఆర్ చెప్పడం దొంగే దొంగ అన్నట్లుగా ఉందన్నారు.కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం గత పన్నెండు సంవత్సరాల్లో రైల్వే, బ్యాంకింగ్, SSC, UPSC, CAPF తదితర విభాగాల్లో 17 లక్షలకు పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేసిందని తెలిపారు. అలాంటి మోదీ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక స్థాయి కేటీఆర్కు లేదన్నారు.ఒకరు "అన్నగా వస్తాను" అంటుంటే, మరొకరు "ఆనాటి రోజులు తీసుకొస్తాను" అంటున్నారని, వాస్తవానికి ఇద్దరూ కలిసి తెలంగాణను 'అన్న కొండ'లా దోచుకున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు బుద్ధి చెప్పి అధికారానికి దూరం చేసినా, బీఆర్ఎస్ నాయకులు తమ వైఫల్యాలను అంగీకరించకుండా బీజేపీపై విమర్శలు చేస్తున్నారని అన్నారు.బీజేపీది అవకాశవాదమా, జాతీయ వాదమా అని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులు ముందుగా తమ రాజకీయ చరిత్రను పరిశీలించుకోవాలని సూచించారు. ఒకప్పుడు ఉత్తర భారతదేశంలో ఔరంగజేబు, దక్షిణాన ఆదిల్షా తోడు దొంగల్లా వ్యవహరించడంతో వారి మధ్య భారతమాత నలిగిపోయిందని గుర్తుచేశారు. అదే విధంగా నేడు బీఆర్ఎస్, కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాల మధ్య తెలంగాణ ప్రజలు నలిగిపోతున్నారని పేర్కొన్నారు.ఔరంగజేబు లాంటి అవకాశవాది కేసీఆర్ అయితే, ఆదిల్షా లాంటి అవకాశవాది ఆయన మిత్రుడు రేవంత్ రెడ్డి అని ఘాటుగా వ్యాఖ్యానించారు. నాడు ఔరంగజేబు, ఆదిల్షా వంటి శక్తుల నుంచి భారతదేశాన్ని ఛత్రపతి శివాజీ రక్షించినట్లే, నేడు నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ తెలంగాణ ప్రజలను బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి రక్షిస్తుందని స్పష్టం చేశారు.రాహుల్ గాంధీ ఇప్పుడు తెలంగాణకు వస్తే అశోక్నగర్, దిల్సుఖ్నగర్ నిరుద్యోగ యువత ఆయనను నిలదీస్తారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ప్రకటించిన యూత్ డిక్లరేషన్, రెండు లక్షల ఉద్యోగాలపై ఆయన సమాధానం చెప్పాల్సిందేనన్నారు.నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవడం, వారిని కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడం బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు వెంటనే మానుకోవాలని హెచ్చరించారు. తెలంగాణ యువత ఇప్పటికే ఎంతో కోల్పోయిందని, ఎన్నికల హామీ ప్రకారం రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని బీజేపీ తరపున ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# వర్షపు నీటి ప్రతి చుక్కను ఒడిసిపట్టాలి..

**కరీంనగర్ వెలుతురు జూలై 19:**



ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ఉద్యమంలా చేపట్టాలని, ఇంటి నిర్మాణ అనుమతులు ఇచ్చే సమయంలో రైన్‌వాటర్ హార్వెస్టింగ్, ఇంకుడు గుంతల నిర్మాణాన్ని తప్పనిసరి (మాండేటరీ) చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు.కరీంనగర్ కలెక్టరేట్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా ఎల్‌నినో సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఇదే సరైన సమయమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకుని ప్రజలందరూ ఇంకుడు గుంతలు నిర్మించేలా యుద్ధ ప్రాతిపదికన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.వర్షపు నీటి ప్రతి చుక్కను భూమిలోకి పంపించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, దీనిని ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి ఉమ్మడి గొంతుకతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు ఆరుతడి, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని మంత్రి కోరారు. ప్రకృతి విపత్తును సమిష్టిగా ఎదుర్కోవాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని అన్నారు.వర్షాలు సమృద్ధిగా కురవాలని ధర్మపురి, కొండగట్టు, కాళేశ్వరం, వేములవాడ దేవాలయాల్లో వరుణ యాగాలు, ప్రత్యేక పూజలు నిర్వహిద్దామని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం రైతులు, ప్రజలను ఆదుకునేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తోందని, ఈ క్లిష్ట పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక నిధులు విడుదల చేసి రాష్ట్రానికి అండగా నిలవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు."ప్రకృతి విపత్తును ఎవరూ ఒంటరిగా ఎదుర్కోలేరు... ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు కలిసి కట్టుగా కదిలితేనే ఎల్‌నినో సవాల్‌ను అధిగమించగలం" అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.



# మల్లారెడ్డి విద్యాసంస్థల అక్రమాలపై ప్రభుత్వం చేపట్టిన సమగ్ర విచారణ హర్షనీయం

- **మరిన్ని ఆధారాలను విచారణ కమిటీకి సమర్పిస్తాను: కోట శ్రీనివాస్ గౌడ్**

**హైదరాబాద్ వెలుతురు జూలై 19:**

మల్లారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులకు చెందిన విద్యా సంస్థలపై నేను చేసిన ఫిర్యాదుల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం, జేఎన్టీయూహెచ్ (JNTUH) అధికారులతో కూడిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి సమగ్ర తనిఖీలు చేపట్టడం స్వాగతించదగిన పరిణామం. కళాశాలలు స్థాపించిన నాటి నుండి భూముల యాజమాన్యం, అనుమతులు, ఆర్థిక లావాదేవీలు, వేతన చెల్లింపులు, బ్యాంకు రికార్డులు, పరిపాలనా వ్యవహారాలు, సిబ్బంది నియామకాలు తదితర అంశాలపై లోతైన విచారణ జరుగుతున్నట్లు సమాచారం అందుతోంది. ఇది సాధారణ అనుబంధ తనిఖీ కాకుండా ప్రత్యేక సమగ్ర విచారణగా కనిపిస్తోంది.నా వద్ద ఉన్న అదనపు పత్రాలు, రికార్డులు, సాక్ష్యాధారాలను సంబంధిత విచారణ కమిటీ సభ్యులను కలిసి అధికారికంగా సమర్పించనున్నాను. నిజాలు వెలుగులోకి రావాలంటే ప్రతి అంశాన్ని నిష్పాక్షికంగా, పారదర్శకంగా పరిశీలించి బాధ్యులపై చట్టప్రకారం కళాశాల గుర్తింపు రద్దు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి.నా వద్ద ఉన్న రికార్డుల ప్రకారం కొన్ని అత్యంత తీవ్రమైన అంశాలు విచారణకు అర్హమైనవిగా కనిపిస్తున్నాయి. ఒక సంస్థకు AICTE అనుమతులు పొందిన భవనంలో మరో సంస్థను నిర్వహించడం, అవసరమైన Change of Site/Location లేదా ఇతర అనుమతులు లేకుండానే కళాశాలలు నడుపుతున్నట్టు ఆధారాలు ఉన్నాయి.

వివిధ ఎడ్యుకేషనల్ సొసైటీల పేర్లతో అనుమతులు పొందిన భవనాలను పరస్పరం వినియోగించడం, ఒకే సర్వే నంబర్లను ఒకటి కంటే ఎక్కువ కళాశాలల అనుమతుల కోసం ఉపయోగించడం, అనుమతులు పొందిన ప్రదేశాలకు భిన్నమైన సర్వే నంబర్లలో కళాశాలలను నిర్వహించడం వంటి అంశాలు సమగ్రంగా విచారించాల్సిన అవసరం ఉంది.గత ప్రభుత్వంలో మంత్రిగా ఉండి అధికారాన్ని అడ్డంపెట్టుకొని అప్పటికే నడుస్తున్న కళాశాల భూములను వాటినే మళ్ళీ ప్రైవేట్ యూనివర్సిటీకి చూపెడుతూ 2020లో ఉమెన్స్ యూనివర్సిటీ కోసం పెట్టుకున్న దరఖాస్తును రాత్రికి రాత్రే మార్చి కో ఎడ్యుకేషన్ గా అప్రూవల్ తెచ్చుకున్నాడు ఈ యూనివర్సిటీ కి చూపెట్టిన భూములు కూడా సంబందిత సొసైటీ పేరు మీద కాకుండా స్వంత పేర్ల మీద పెట్టుకున్నాడు ప్రైవేట్ యూనివర్సిటీ నిబంధనల ప్రకారం సొసైటీ పేరు మీద తప్పా స్వంత పేర్ల మీద భూ హక్కులు ఉండకూడదు.మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్‌కు సంబంధించి భూముల యాజమాన్యం, భూ వినియోగ మార్పిడి (Land Conversion), వ్యవసాయ భూములపై కళాశాల నిర్మాణం, ప్రభుత్వ వ్యవసాయ ప్రయోజనాల వినియోగం, అలాగే AICTEకు సమర్పించిన పత్రాలు మరియు వాస్తవ నిర్వహణ మధ్య ఉన్న వ్యత్యాసాలపై కూడా నా వద్ద ఆధారాలు ఉన్నాయి. అలాగే MRCET సహా మరికొన్ని కళాశాలల్లో AICTE అనుమతులు పొందిన సర్వే నంబర్లకు భిన్నంగా ప్రస్తుతం కార్యకలాపాలు సాగుతున్నాయనే అంశాన్ని అధికారులు భౌతికంగా, రికార్డుల పరంగా పరిశీలించాలి.విద్యను వ్యాపారంగా మార్చి చట్టాలను ఉల్లంఘించడం, ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కడం, విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే విధంగా వ్యవహరించడం అత్యంత తీవ్రమైన విషయం. రాజకీయ హోదా, ఆర్థిక ప్రభావం ఎంత ఉన్నా చట్టం ముందు అందరూ సమానులే. ఈ విచారణలో ఎవరైనా తప్పు చేసినట్లు తేలితే AICTE నిబంధనలు మరియు వర్తించే చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.ప్రస్తుతం జరుగుతున్న తనిఖీల సందర్భంగా కొందరు అధికారులు ఇప్పటికీ కొన్ని కళాశాలలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఒక మాజీ రిజిస్ట్రార్ కళాశాల ప్రతినిధులతో చేసినట్లు ప్రచారంలో ఉన్న వ్యాఖ్యలపై కూడా, జేఎన్టీయూహెచ్ నిష్పాక్షిక విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాలి. విచారణ విశ్వసనీయతను దెబ్బతీసే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదు.విద్యార్థుల భవిష్యత్తు, ప్రజా ప్రయోజనాలు మరియు విద్యా వ్యవస్థ ప్రతిష్ఠను కాపాడటమే నా పోరాట లక్ష్యం. అక్రమాలపై నా పోరాటం కొనసాగుతుంది. మరిన్ని కీలక ఆధారాలను విచారణ కమిటీకి అధికారికంగా సమర్పిస్తాను.



మీ...
**కోట శ్రీనివాస్ గౌడ్ (PhD )**
**ఉస్మానియా యూనివర్సిటీ,TPCC రాష్ట్ర నాయకులు,సెల్ : 9701677456**

# పుష్కరాల లోపే భద్రాద్రి వైభవం!

- **వచ్చే గోదావరి పుష్కరాల నాటికి పునరుద్ధరణ పనులు పూర్తి కావాలి**
- **15 రోజుల ముందే సిద్ధం చేయండి : అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం**
- **రూ.351 కోట్లతో పనులు.. రూ.75 కోట్లతో భూసేకరణ**
- **పర్యవేక్షణకు ప్రత్యేక అధికారి.. పది రోజులకోసారి సమీక్ష చేస్తామని వెల్లడి**

**భద్రాచలం వెలుతురు జూలై 19:**

రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థాన ప్రాచీన వైభవానికి ప్రతీకగా నిలిచేలా పునరుద్ధరణ పనులను వచ్చే గోదావరి పుష్కరాల నాటికి వంద శాతం పూర్తి చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. పుష్కరాల ప్రారంభానికి 15 రోజుల ముందే క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఆదివారం ఆయన భద్రాద్రి రామయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో సాగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సబ్ కలెక్టర్ కార్యాలయంలో దేవాదాయ, ఇంజినీరింగ్ అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. "రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వచ్చిన మొదటి శ్రీరామనవమి పర్వదినాన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా భద్రాద్రి పునరుద్ధరణకు నాంది పలికాం. ఇందుకోసం ప్రభుత్వం రూ.351 కోట్లు మంజూరు చేసింది. ఆలయ



విస్తరణ, అభివృద్ధికి అత్యంత కీలకమైన భూసేకరణ ప్రక్రియ కోసం ఇప్పటికే రూ.75 కోట్లు వెచ్చించాం" అని వివరించారు.

### ఆగమశాస్త్రం ప్రకారం.. అదనపు కార్మికులతో!

భద్రాద్రి క్షేత్ర ఆధ్యాత్మిక, చారిత్రక విశిష్టత చెక్కుచెదరకుండా, నిపుణులైన శిల్పులతో, అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలని మంత్రి సూచించారు. "పురాతన గోపురాలు, కట్టడాల సహజత్వానికి భంగం కలగకుండా ఆగమశాస్త్రాల ప్రకారం పనులు జరగాలి. పనుల్లో వేగం పెంచేందుకు అవసరమైన చోట ప్రస్తుత సిబ్బంది కంటే 25 శాతం అదనంగా కార్మికులను నియమించాలి. నిరంతరం నిపుణులు, బాధ్యతాయుతమైన అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి పర్యవేక్షించాలి" అని ఆదేశించారు. ఒకవైపు పనులు పూర్తయిన తర్వాతే మరోవైపు పనులు ప్రారంభించాలని, ఎక్కువ పని ఉన్న ఉత్తర భాగంలో పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. డ్రాయింగ్‌లు, సాంకేతిక అనుమతుల్లో జాప్యానికి తావులేకుండా శాఖల మధ్య సమన్వయం ఉండాలన్నారు.

### పది రోజులకోసారి క్షేత్రస్థాయి సమీక్ష

ఆలయ పనుల పర్యవేక్షణ కోసం ఇంజినీరింగ్ శాఖ



నుంచి ప్రత్యేక అధికారిని వెంటనే నియమించాలని దేవాదాయ కమిషనర్ హనుమంతరావును మంత్రి టెలిఫోన్ ద్వారా ఆదేశించారు. కమిషనర్ ప్రతి 10 రోజులకోసారి స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రగతిని పరిశీలించాలన్నారు. పనులు జరుగుతున్న సమయంలో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పుష్కరాల నేపథ్యంలో గోదావరి పరివాహక ప్రాంతంలో భక్తుల విజ్ఞప్తుల మేరకు నూతన స్నాన ఘట్టాల నిర్మాణం, యాత్రికుల వసతుల విస్తరణ చేపట్టనున్నట్లు తెలిపారు.తొలుత సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్ వద్ద మంత్రికి కలెక్టర్ అంకిత్ మొక్క అందించి స్వాగతం పలికారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి ఈవో దామోదరరావు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అంతరాలయంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం మంత్రికి వేదాశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం, పినపాక ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీఓ రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, గ్రామ సర్పంచ్ పూనెం దొర, ఆర్కిటెక్ట్ మూర్తి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఉప్పర్‌పల్లి, హైదర్‌గూడ డివిజన్ లో ఘనంగా సాగుతున్న ఓటు హక్కు అవగాహన సదస్సు

- **19వ రోజుకు చేరిన మహాయజ్ఞం**

**హైదరాబాద్ వెలుతురు జూలై 19:**

దేశ భవిష్యత్తును మార్చే శక్తి ఓటు హక్కుకు మాత్రమే ఉందని, ప్రతి ఒక్కరూ తమ ఓటును కాపాడుకోవాలని భారతీయ జనతా పార్టీ సేవా సైనికులు పిలుపునిచ్చారు. ఉప్పర్‌పల్లి మరియు హైదర్‌గూడ డివిజన్ల పరిధిలో ఓటు హక్కు ప్రాధాన్యతపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు, కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక్ష సమీక్ష (SIR) ప్రక్రియలో భాగంగా చేపట్టిన ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఆదివారం నాటికి విజయవంతంగా 19వ రోజుకు చేరుకుంది.బిజెపి సీనియర్ నాయకులు బొక్క బాల్ రెడ్డి గారి అద్భుత సారథ్యంలో, ఆయన ముందుండి నడిపిస్తున్న ఈ మహాయజ్ఞంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలైన గోనే శ్రీకాంత్ రెడ్డి, పవన్ పల్లుచెరువు, నరేందర్, భూపాల్ ముదిరాజ్, కర్ణాకర్, రాజశేఖర్, మనోజ్, చిన్న మనోజ్, పెద్ద మనోజ్ మరియు అనేకమంది బీజేపీ కార్యకర్తలు, బీఎల్ఓలు (BLO) భాగస్వాములై అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ముందుకు తీసుకెళ్తున్నారు.

### వన్ నేషన్ - వన్ ఓట్ కోసం అలుపెరుగని కృషి:

ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ముందుకు తీసుకెళ్తున్న "వన్ నేషన్ – వన్ ఓట్" (ఒకే దేశం – ఒకే ఎన్నిక) విధానం దేశ ప్రగతికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడానికి, నకిలీ ఓట్లను అరికట్టడానికి మరియు ఓటు హక్కును సురక్షితం చేయడానికి డివిజన్ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. దేశ రక్షణలో, ధర్మ రక్షణలో ప్రతి ఒక్కరి



ఓటు అత్యంత కీలకమని, అర్హులైన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.

### మీ కోసమే... మా ప్రత్యేక హెల్ప్‌లైన్ సేవలు:

ఇంకా ఎవరైనా ఓటరు నమోదు లేదా సవరణ ఫారమ్‌లు తీసుకోకపోతే... కాలనీ ప్రెసిడెంట్లు, సెక్రటరీలు, విల్లాస్ మరియు గేటెడ్ కమ్యూనిటీల ప్రతినిధులు మా హెల్ప్‌లైన్ నెంబర్లకు ఫోన్ చేస్తే మా కార్యకర్తలే మీ వద్దకు వచ్చి ఫారమ్‌లు ఇస్తారు, వాటిని నింపి, తిరిగి తామే సబ్మిట్ చేస్తారు. ఆగస్టు 3వ తేదీ వరకు సమయం ఉన్నందున ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దు. మీ సేవ కోసం ప్రతిరోజూ ఉదయం 9:00 నుండి రాత్రి 9:00 గంటల వరకు ఉప్పర్‌పల్లి బీజేపీ ఆఫీస్ నందు సేవా సైనికులు అందుబాటులో ఉంటారు.

**భారత్ మాతాకీ జై! జై శ్రీరామ్!**

సహాయం కోసం సంప్రదించాల్సిన హెల్ప్‌డెస్క్ నంబర్లు:
90000 89911,8885559911
సదా మీ సేవలో, భారతీయ జనతా పార్టీ సేవా సైనికులు & కార్యకర్తలు
ఉప్పర్‌పల్లి – హైదర్‌గూడ డివిజన్.

# ఐక్యంగా ఉందాం – అభివృద్ధిని అందుకుందాం: డాక్టర్ బండి సాయన్న గౌడ్

- **మహబూబ్ నగర్ జిల్లా గోపా నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక**
- **సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన గోపా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బండి సాయన్న గౌడ్**
- **మహబూబ్ నగర్ జిల్లాలో 5 వేల సభ్యత్వాలే లక్ష్యమని ప్రకటించిన నూతన కమిటీ**
- **గౌడ్ మేధావుల ఐక్య వేదికగా "గోపా"**

**మహబూబ్ నగర్, వెలుతురు జూలై 19:**

గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో గోపా మహబూబ్ నగర్ జిల్లా నూతన కార్యవర్గాన్ని సభ్యులందరి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సమావేశానికి అధ్యక్షత వహించిన నాయిని బాగన్న గౌడ్ మాట్లాడుతూ, రాజకీయాలకు అతీతంగా గౌడ్ సమాజాన్ని ఒకే వేదికపైకి తీసుకువస్తున్న ఏకైక సంస్థ గోపా అని పేర్కొన్నారు. సమాజంలో వివిధ కుల, ఉద్యోగ, సేవా సంఘాలు ఉన్నప్పటికీ, అవసరమైన సందర్భాల్లో అందరూ ఐక్యంగా పనిచేస్తేనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న గోపా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బండి సాయన్న గౌడ్ మాట్లాడుతూ, గౌడ్ సమాజ అభ్యున్నతికి అధికారులు, ఉద్యోగులు, ప్రొఫెషనల్స్, యువత ఒకే వేదికపైకి వచ్చి సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని కోరారు. విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, సామాజిక చైతన్యం, రాజకీయ భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో




గోపా కీలక పాత్ర పోషిస్తోందన్నారు.గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు గౌడ్ యువత, విద్యార్థులు, ఉద్యోగులను సంఘటితం చేసి సమాజాభివృద్ధికి కృషి చేయాలని, ప్రస్తుతం ఉన్న ప్రజాప్రతినిధులను గౌరవిస్తూ కొత్త నాయకత్వాన్ని కూడా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ, ఆర్థిక, పారిశ్రామిక రంగాల్లో గౌడ్ సమాజం మరింత ముందుకు సాగేందుకు గోపా ఒక బలమైన వేదికగా నిలుస్తుందని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి అభినందనలు తెలిపారు.గోపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, మహిళలు, యువతను పెద్ద ఎత్తున సభ్యులుగా చేర్చుకోవాలని, రాజకీయ నాయకులు లేదా కుల పెద్దలను వ్యక్తిగతంగా విమర్శించకుండా సమాజ ఐక్యతే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారులు, ప్రొఫెషనల్స్‌ను సంఘటితం చేస్తూ గౌడ్ జాతి ఐక్యత కోసం గోపా కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో గోపా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యల్మకంటి మీరయ్య గౌడ్, గజ్జగౌని మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, మహబూబ్ నగర్ జిల్లాలో 5 వేల సభ్యత్వాలను నమోదు చేయడం తమ ప్రధాన లక్ష్యమని ప్రకటించారు.

### నూతన జిల్లా కమిటీ

జిల్లా అధ్యక్షుడు: నాయిని బాగన్న గౌడ్
ప్రధాన కార్యదర్శి: కౌండిన్య రాజశేఖర్ గౌడ్
కోశాధికారి: పబ్బ శశిధర్ గౌడ్
ఉపాధ్యక్షులు: సి. సత్యనారాయణ గౌడ్, డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్, గుముడాల గోవర్దన్ గౌడ్ లు

గోపా సిద్ధాంతాలను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లి, గౌడ్ సమాజ ఐక్యత, అభివృద్ధి కోసం నూతన కమిటీ సమిష్టిగా కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ సమగ్ర కార్యాచరణ సిద్ధం

- **మంత్రి సీతక్క ఆదేశాలతో ఉపాధి కల్పన, జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం**
- **సోమవారం నాడు అన్ని జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు**
- **గ్రామీణ ప్రాంతాల్లో నీటి భద్రత, జీవనోపాధి పరిరక్షణే లక్ష్యం**

**హైదరాబాద్, వెలుతురు జూలై 19:**



ఎల్‌నినో ప్రభావంతో సంభవించే పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ వి.బి.జి. రామ్–జీ (VB G RAM G) కింద ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోంది. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పించడంతో పాటు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, కరువు నివారణ చర్యలను రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించింది. మంత్రి సీతక్క ఆదేశాలతో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ సోమవారం నాడు అన్ని జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనుంది. దీనికి సంబంధించి ఆదివారం నాడు పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ సిఎస్ దాన కిషోర్, శాఖ ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఈ ఆర్థిక సంవత్సరంలో మార్చి 31 నాటికి మొత్తం 12 కోట్ల పనిదినాలు కల్పించడాన్ని లక్ష్యంగా నిర్ణయించగా, జూలై నుంచి అక్టోబర్ వరకు తొలి దశలో 4.5 కోట్ల పనిదినాలు సృష్టించేందుకు ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం రోజుకు సుమారు 2.5 లక్షల మంది కూలీలకు ఉపాధి లభిస్తుండగా, మరో 2.5 లక్షల పనిదినాలను అదనంగా కల్పించి రోజుకు 5 లక్షల మందికి ఉపాధి అందించేందుకు జిల్లా యంత్రాంగాన్ని సమాయత్తం చేశారు.ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు వచ్చే మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో నీటి సంరక్షణ పనులు చేపట్టనున్నారు. ఇందులో 9.60 లక్షల ఇంకుడు గుంతలు, 25 వేల పంట కుంటలు, 5 వేల ఊట కుంటలు, 5 వేల బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు చేపట్టనున్నారు. అలాగే వనమహోత్సవం, గ్రామ పంచాయతీ భవనాలు, వీఓ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ పనులను కూడా వేగవంతం చేయనున్నారు.తెలంగాణ జలసిరి కార్యక్రమం కింద ప్రతి గ్రామంలో గృహాల వద్ద సోక్‌పిట్లు, రైతుల కోసం పంట కుంటలు, వర్షపు నీటిని నిల్వ చేసే పర్కొలేషన్ ట్యాంకులు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలాల పెంపు, నీటి వనరుల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు.ఈ కార్యక్రమం సమర్థవంతమైన అమలుకు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ పంచాయతీ స్థాయి వరకు అధికారులకు, సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే శిక్షణలు నిర్వహించారు. అవసరమైతే మరిన్ని శిక్షణలు నిర్వహించాలని, ప్రతి గ్రామంలో పనులు ప్రారంభమయ్యేలా జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని మంత్రి సీతక్క ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

గ్రామీణ ప్రాంతాల్లో కరువు ప్రభావాన్ని తగ్గిస్తూ, ప్రజలకు ఉపాధి భద్రతతో పాటు నీటి భద్రతను కల్పించడమే ఈ ప్రత్యేక కార్యాచరణ ప్రధాన లక్ష్యమని శాఖ వెల్లడించింది.

# మజిలీ మూడు నాళ్లే.. మిగిలేది మంచితనమే!

ప్రతిరోజూ ఉదయాన్నే తూర్పు దిక్కున భానుడు తన నవకిరణాలతో లోకాన్ని మేల్కొలుపుతాడు. పసిడి కాంతులు వెదజల్లుతూ, సమస్త జీవకోటికి సరికొత్త చైతన్యాన్ని ప్రసాదిస్తూ, మధ్యాహ్న సమయానికి జగత్తుకు వెలుగునిస్తూ నెత్తిమీదకు వస్తాడు. మళ్ళీ సాయంత్రానికి పడమటి దిక్కున ఎర్రని రంగులను అద్దుకుంటూ నెమ్మదిగా అస్తమిస్తాడు. అదే సూర్యుడు రేపు ఉదయం మళ్ళీ తప్పకుండా వస్తాడు కదా అనే నమ్మకంతోనే మనమంతా ప్రశాంతంగా నిద్రిస్తాం. కానీ లోతుగా ఆలోచిస్తే, ఆకాశంలో ఏదీ శాశ్వతం కాదు. వచ్చిన ప్రతిదీ వెళ్ళిపోవలసిందే. ఇది కేవలం ప్రకృతి నియమమే కాదు, సృష్టి యొక్క అంతిమ సత్యం. చందమామ విషయంలోనూ ఇదే పరిణామం కనిపిస్తుంది. రాత్రి వేళ ఆకాశంలో నిండుగా వెలిగి, లోకానికి చల్లని వెన్నెలను పంచిన శశి, తెల్లవారు జామున మసకబారిపోతుంది. మరుసటి రోజు సంధ్యా సమయానికి తన పాత రూపాన్ని పూర్తిగా కోల్పోతుంది. ఈ విధంగా నిరంతరం మారుతున్న ప్రకృతి శక్తులు మానవాళికి ఒక అత్యద్భుతమైన జీవిత సత్యాన్ని బోధిస్తున్నాయి. ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతంగా నిలిచి ఉండదని నిరూపిస్తున్నాయి.మన పెద్దలు తరత రాలుగా చెబుతూ వస్తున్న మాటల్లో ఎంతో లోతైన వేదాంతార్థం దాగి ఉంది. తెల్లవారితే ఈ మజిలీ మూడు నాళ్ళే అనే సామెత మన మనుగడలోని తాత్కాలిక స్వభావాన్ని కళ్ళకు కడుతుంది. మనం ఈ భూమ్మీదకు వచ్చింది శాశ్వత నివాసం ఏర్పరచుకోవడానికి కాదు. ఒక ప్రయాణికుడు సుదీర్ఘ ప్రయాణంలో అలసట తీర్చు కోవడానికి దారిలో ఉన్న ఒక సత్రంలో ఆగి, కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని, తెల్లవారగానే తన ప్రయాణాన్ని మళ్ళీ ఎలా కొనసాగిస్తాడో, మన జీవితం కూడా ఈ అనంత విశ్వంలో ఒక చిన్న తాత్కాలిక విడిది మాత్రమే. పుట్టుక, బాల్యం, యవ్వనం, గృహస్థాశ్రమం, వృద్ధాప్యం, చివరకు మరణం అనే ఈ దశలన్నీ దాటుకుంటూ సాగే ఈ ప్రయాణం ఎంత చిన్నదో, ఎంత అశాశ్వతమైనదో గ్రహించడం ఎంతో ముఖ్యం. కాలం అనే మహా సముద్రంలో మానవ జీవితం కేవలం ఒక చిన్న నీటి బుడగ వంటిది. అది ఎప్పుడు పుడుతుందో, ఎప్పుడు లయమవుతుందో ఎవరికీ తెలియదు. ఈ కఠినమైన యదార్థాన్ని మనస్ఫూర్తిగా అంగీకరించి నప్పుడే మనిషిలో నిజమైన వివేకం, అంతర్గత పరిపక్వత అలవడతాయి.అయితే, జీవితం అశాశ్వతం అనే సత్యాన్ని గ్రహించడం అంటే భయపడిపోవాలని కాదు, లేదా జీవితంపై విరక్తి పెంచుకుని నిరాశాపూరితంగా బతకాలని అస్సలు కాదు. దీని వెనుక ఉన్న అసలైన ఉద్దేశం ఏమిటంటే, మన చేతుల్లో ఉన్న ఈ పరిమిత కాలాన్ని ఎంత అర్థవంతంగా మరియు సద్వినియోగం చేసుకోవాలో తెలుసుకోవడం. సూర్యుడు ప్రతిరోజూ ఉదయించినప్పటి నుండి అస్తమించే వరకు ఏమాత్రం అలసట లేకుండా తన బాధ్యతలను నిర్వర్తిస్తూనే ఉంటాడు. నిస్వార్థంగా లోకానికి వెలుగును ప్రసాదిస్తాడు, సకల జీవుల మనుగడకు అవసరమైన శక్తిని అందిస్తాడు. అలాగే, మనం కూడా మనకు లభించిన ఈ కొద్దిపాటి ఆయుష్షులో ఇతరులకు మేలు చేసే పనులు చేయాలి. ఎదుటివారి కష్టాలలో తోడుగా నిలిచి సహాయపడాలి, సమాజంలో ప్రేమాభిమానాలను పంచాలి, ఉన్నతమైన జ్ఞానాన్ని సముపార్జించాలి. మనం చనిపోయిన తర్వాత మన వెంట వచ్చేది ఏమీ లేదు. కేవలం మనం చేసిన మంచి పనులు, సంపాదించుకున్న కీర్తి మాత్రమే చరిత్ర పుటలలో నిలిచి పోతాయి. సంపదలు, కీర్తి ప్రతిష్టలు, అధికారాలు అన్నీ తాత్కాలికమే అన్న నిజాన్ని మనం మరువరాదు.భారతీయ సనాతన తత్వశాస్త్రం మొదటి నుండి ఈ అనిత్యత్వాన్ని గురించే మానవజాతిని హెచ్చరిస్తూ వచ్చింది. ఈ మానవ శరీరం కేవలం మట్టి పాత్ర వంటిది, అది ఎప్పుడైనా పగిలిపోవచ్చు, కానీ లోపల ఉన్న ఆత్మ మాత్రమే శాశ్వతమైనది అని ఉపనిషత్తులు ఘోషిస్తున్నాయి. ఈ పరమ సత్యాన్ని గమనించినప్పుడు మనిషి ఆలోచనా విధానంలో విప్లవాత్మకమైన మార్పు వస్తుంది. తన మనసులోని అహంకారం, స్వార్థం తగ్గిపోతాయి. భౌతిక వస్తువులపై ఉన్న మితిమీరిన మమకారం నెమ్మదిగా సడలుతుంది. తద్వారా జీవితం పట్ల ఒక స్పష్టమైన, ప్రశాంతమైన అవగాహన ఏర్పడుతుంది. డబ్బు, పేరు ప్రఖ్యాతులు, పెద్ద పెద్ద భవనాలు, బంధుత్వాలు ఇవన్నీ ఈ జీవిత ప్రయాణంలో కేవలం తాత్కాలికంగా లభించిన తోడు మాత్రమే. వీటిపై మితిమీరిన ఆశను, వ్యామోహాన్ని పెంచుకోవడం వల్ల మనిషి చివరకు తీరని దుఃఖంలో మునిగిపోతాడు. అందుకే మన సంస్కృతి వైరాగ్య భావనను ఎంతో గొప్పగా వర్ణించింది. వైరాగ్యం అంటే సంసారాన్ని వదిలేసి అడవులకు వెళ్ళిపోవడం కాదు, ఈ సంసారంలోనే ఉంటూ, సుఖదుఃఖాలకు లొంగకుండా తామరాకుపై నీటిబొట్టులా జీవించడం అని గ్రహించాలి.ప్రస్తుత కాలంలో మనిషి ఆధునిక సాంకేతిక విప్లవంతో పరుగుల జీవితాన్ని గడుపుతున్నాడు. తనే శాశ్వతంగా ఇక్కడ ఉండిపోతాననే ఒక భ్రమలో బతుకుతున్నాడు. అధికారం కోసం, విపరీతమైన డబ్బు కోసం రాత్రింబగళ్ళు శ్రమిస్తూ, కనీసం తన కుటుంబ సభ్యులతో గడపడానికి సమయం లేనంతగా బిజీ అయిపోయాడు. తన ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ, మనసులోని మానవత్వపు విలువలను కోల్పోతున్నాడు. పక్కవారితో పోల్చుకుంటూ అసూయ, ద్వేషం, క్రోధం వంటి చెడు గుణాలతో తన మనసును కలుషితం చేసుకుంటున్నాడు. తనకు లభించిన ఈ అద్భుతమైన జీవిత కాలాన్ని అనవసరమైన గొడవలకు, అశాంతికి బలి చేస్తున్నాడు. ఒకవేళ ప్రతి మనిషి కూడా సూర్యచంద్రుల ఉదాహరణను రోజూ ఒక్కసారి మననం చేసుకుంటే, తన ప్రాణం ఎంతో క్షణ భంగురమైనదని గుర్తిస్తే, సమాజంలో నేరాలు, ద్వేషాలు చాలా వరకు తగ్గిపోతాయి. అప్పుడు మనిషి స్వార్థాన్ని విడిచిపెట్టి, తోటి మానవుల పట్ల ప్రేమ, కరుణ, సహనం మరియు సేవాభావంతో జీవించడానికి ప్రయత్నిస్తాడు. సమాజంలో శాంతిభద్రతలు వెల్లివిరుస్తాయి.మన పూర్వీకులు ఈ పరమార్థాన్ని కేవలం ఉపన్యాసాలలోనే కాకుండా, సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యేలా ఎన్నో నీతి పద్యాలలో, తత్వ కీర్తనలలో నిక్షిప్తం చేశారు. ఆకాశాన సూర్యుడు శాశ్వతంగా ఉండడు, సంధ్య వేళకు చందమామ రూపం కూడా మారుతుంది అనే వాక్యాలు కేవలం కవితాత్మక ప్రకృతి వర్ణనలు మాత్రమే కావు. అవి మానవ జీవిత సారాన్ని ఎంతో సరళంగా వివరించే దివ్యమైన సందేశాలు. ఈ భూమ్మీద మన జీవితం కేవలం మూడు రోజుల ముచ్చట అని గ్రహించినప్పుడు, మనం గడిపే ప్రతి క్షణాన్ని పరమ పవిత్రంగా, విలువైనదిగా భావించాలి. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ప్రేమతో, ఆదరణతో చూసుకోవాలి. మన పిల్లలకు మంచి సంస్కారాలు, మానవీయ విలువలు నేర్పించాలి. స్నేహితులతో, బంధువులతో ఉన్న సంబంధాలను మరింత దృఢంగా మార్చుకోవాలి. మన చుట్టూ ఉన్న పేద ప్రజలకు, అవసరంలో ఉన్న వారికి సహాయం చేయడం ద్వారా సామాజిక బాధ్యతను నెరవేర్చాలి. ఎందుకంటే రేపటి రోజున ఏం జరుగుతుందో, అసలు మనం ఉంటామో లేదో ఎవరూ ఊహించలేరు. ముగింపుగా చెప్పాలంటే, మానవ జీవితం అనేది ఒక అందమైన సుదీర్ఘ ప్రయాణం, ఇందులో గమ్యం మాత్రమే స్థిరమైనది. ఈ ప్రయాణ మార్గంలో మనం వేసే ప్రతి అడుగూ ఎంతో అర్థవంతంగా, ఇతరులకు మార్గదర్శకంగా ఉండాలి. ప్రతిరోజూ సాయంత్రం వేళ సూర్యుడు పూర్తిగా అస్తమించే ముందు లోకానికి ఆహ్లాదకరమైన ఎరుపు రంగు కాంతిని ఇచ్చినట్లు, చందమామ ఆకాశం నుండి వెళ్ళిపోయే ముందు చల్లని వెన్నెలను ప్రసాదించినట్లు, మనం కూడా మన జీవితకాలంలో మంచితనాన్ని, స్వచ్ఛమైన ప్రేమను, జ్ఞానాన్ని సమాజానికి కానుకగా అందించి వెళ్ళాలి. అప్పుడే మనం జీవించిన జీవితానికి నిజమైన సార్థకత, పరమార్థం లభిస్తాయి. ఆ సూర్యచంద్రుల అనిత్యత్వ ప్రయాణమే మనకు అమూల్యమైన, శాశ్వతమైన జీవన పాఠాన్ని బోధిస్తోంది. ఈ నిజాన్ని తెలుసుకుని, మన అహంకారాన్ని పక్కన పెట్టి, ప్రతి రోజూ సంతోషంగా బతుకుదాం, ఇతరులను బతకనిద్దాం. అందరం కలిసి లోక కళ్యాణానికి తోడ్పడుతూ మన ఉనికిని సార్థకం చేసుకుందాం.





డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

# భూమి రైతుకు దక్కితేనే గ్రామీణ భారతానికి భరోసా

వ్యవసాయం భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని దశాబ్దాలుగా చెబుతున్నాం. రైతే దేశానికి అన్నదాత అని ప్రతి వేదికపై ప్రశంసిస్తున్నాం. కానీ ఈ మాటలకు భిన్నంగా గ్రామీణ వాస్తవం మాత్రం మరొక కథ చెబుతోంది. భూమిని సాగు చేసే చేతుల్లో భూమి లేదు. భూమిని చెమటతో సారవంతం చేసే కుటుంబాలకు యాజమాన్య హక్కు లేదు. భూమిని కోల్పోయిన రైతు కూలీగా మారుతున్నాడు. కౌలు రైతు ప్రభుత్వ గుర్తింపు కోసం ఎదురుచూస్తున్నాడు. వ్యవసాయాన్ని నిలబెట్టే మహిళకు భూమిపై హక్కు లేదు. ఇదే నేటి భారత గ్రామీణ వ్యవస్థలోని అతిపెద్ద వైరుధ్యం.స్వాతంత్ర్యం వచ్చినప్పుడు భారతదేశం ముందు నిలిచిన ప్రధాన సవాలు భూస్వామ్య వ్యవస్థను నిర్మూలించడం. బ్రిటిష్ పాలకులు జమీందారీ, జాగిర్దారీ, ఇనాందారీ వ్యవస్థలను ప్రోత్సహించి కొద్దిమంది చేతుల్లో వేలాది ఎకరాల భూమిని కేంద్రీకరించారు. రైతు శ్రమించాడు, కానీ పంటపై హక్కు భూస్వామిదే. ఈ దోపిడీకి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, పశ్చిమ బెంగాల్‌లో తెభాగా ఉద్యమం, దేశవ్యాప్తంగా సాగిన రైతు ఉద్యమాలు భూమి కోసం జరిగిన చారిత్రక పోరాటాలుగా నిలిచాయి. ఆ ఉద్యమాల స్ఫూర్తితో స్వాతంత్ర్యం అనంతరం జమీందారీ వ్యవస్థను రద్దు చేశారు. భూ పరిమితి చట్టాలను తీసుకువచ్చారు. మిగులు భూములను స్వాధీనం చేసుకుని భూమిలేని రైతులకు పంపిణీ చేయాలని నిర్ణయించారు. కానీ ఆశయాల స్థాయిలో కనిపించిన ఆ సంకల్పం అమలు దశలో బలహీనపడింది.

చట్టాల కంటే చట్టాలను తప్పించుకునే మార్గాలే వేగంగా పెరిగాయి. బినామీ పేర్లు, కుటుంబ సభ్యుల పేర్లకు భూముల బదిలీ, కోర్టు కేసులు, అధికార యంత్రాంగ నిర్లక్ష్యం, రాజకీయ ఒత్తిళ్లు భూసంస్కరణలను కాగితాలకే పరిమితం చేశాయి. మిగులు భూమిలో కొంత మాత్రమే ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చింది. అందులోనూ పేదలకు పంపిణీ అయిన భూమి చాలా స్వల్పం. ఫలితంగా భూమి యాజమాన్య నిర్మాణంలో ఆశించిన మార్పు రాలేదు.

నేడు దేశంలో చిన్న, సన్నకారు రైతులే అధిక సంఖ్యలో ఉన్నారు. రెండు హెక్టార్లలోపు భూమి కలిగిన రైతులు 84 శాతానికి పైగా ఉన్నప్పటికీ, వారి చేతిలో ఉన్న సాగుభూమి మొత్తం విస్తీర్ణంలో సగానికి కూడా చేరదు. మరోవైపు కొద్దిమంది పెద్ద భూస్వాములు, ధనిక రైతులు విస్తారమైన భూమిని నియంత్రిస్తున్నారు. భూమి పంపిణీలోని ఈ అసమానత గ్రామీణ పేదరికానికి మూలకారణం. భూమి లేకపోతే రైతుకు బ్యాంకు రుణం దొరకదు. సాగుకు పెట్టుబడి పెట్టలేడు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు కూడా పూర్తిగా అందవు. చివరకు అదే రైతు తన గ్రామంలోనే వ్యవసాయ కూలీగా మారాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

హరిత విప్లవం భారతదేశాన్ని ఆహార ధాన్యాలలో స్వయం సమృద్ధి వైపు నడిపించినా, అది సమానత్వాన్ని తీసుకురాలేదు. నీటిపారుదల, యాంత్రీకరణ, అధిక దిగుబడి విత్తనాలు, రసాయన ఎరువులు ప్రధానంగా పెద్ద రైతులకే అందుబాటులోకి వచ్చాయి. చిన్న రైతు పెట్టుబడి లేక, మార్కెట్ శక్తి లేక, సాంకేతిక పరిజ్ఞానం లేక వెనుకబడ్డాడు. ఉత్పత్తి పెరిగింది కానీ ఆదాయం సమానంగా పెరగలేదు. అసమానతలు మరింత పెరిగాయి.

1991 తర్వాత నయా ఉదారవాద ఆర్థిక విధానాలు వ్యవసాయ రంగాన్ని మరో మలుపు తిప్పాయి. భూమి క్రమంగా జీవనాధారం నుంచి పెట్టుబడి వస్తువుగా మారింది. పారిశ్రామికీకరణ, ప్రత్యేక ఆర్థిక మండలులు, గనులు, రియల్ ఎస్టేట్, జాతీయ రహదారులు, పట్టణ విస్తరణ పేరుతో లక్షల ఎకరాల సాగుభూమి ఇతర అవసరాలకు మళ్లింది. రైతు తన భూమిని అమ్ముకున్నా శాశ్వత ఉపాధి దొరకలేదు. కొద్ది కాలానికే ఆ డబ్బు ఖర్చై, భూమి కూడా పోయి, జీవనోపాధి కూడా కోల్పోయే పరిస్థితి ఏర్పడింది.వ్యవసాయం నేడు పెట్టుబడులపై ఆధారపడే రంగంగా మారింది. విత్తనాల నుంచి కోత వరకు ప్రతి దశలో ఖర్చు పెరిగింది. డీజిల్, విద్యుత్, ఎరువులు, పురుగుమందులు, కూలీల వ్యయం అన్నీ పెరుగుతున్నాయి. కానీ పంటలకు గిట్టుబాటు ధర మాత్రం అందడం లేదు. కనీస మద్దతు ధర అన్ని పంటలకు చట్టబద్ధ హామీ కాకపోవడం వల్ల రైతు మార్కెట్ దళారుల చేతుల్లో చిక్కుకుంటున్నాడు. వాతావరణ మార్పులు, అసమయ వర్షాలు, కరువు, వరదలు వ్యవసాయాన్ని మరింత అనిశ్చితంగా మార్చాయి. ఈ పరిస్థితుల్లో రైతు అప్పుల ఊబిలో కూరుకుపోవడం సహజ పరిణామంగా మారింది.ఇంకా ఆందోళనకరమైన విషయం కౌలు రైతుల పరిస్థితి. దేశంలోని అనేక ప్రాంతాల్లో కౌలు రైతులే వాస్తవంగా సాగు చేస్తున్నారు. అయినప్పటికీ భూమి యాజమాన్యం లేక ప్రభుత్వ పథకాల నుంచి వారు దూరమవుతున్నారు. పంట బీమా, రుణమాఫీ, సబ్సిడీలు, పెట్టుబడి సాయం, నష్టపరిహారం వంటి ప్రయోజనాలు భూమి యజమానికి చేరుతున్నాయి. సాగు చేసిన రైతు మాత్రం అప్పులతో మిగిలిపోతున్నాడు. ఇది వ్యవసాయ విధానాల్లోని ప్రధాన లోపం.మహిళల పాత్ర కూడా ప్రత్యేకంగా గుర్తించాల్సిందే. గ్రామీణ వ్యవసాయ పనుల్లో మహిళల శ్రమ అత్యధికం. కానీ భూమిపై యాజమాన్యం మాత్రం చాలా తక్కువ. మహిళల పేరపై భూమి నమోదు పెరిగితే కుటుంబ ఆర్థిక భద్రతతో పాటు వ్యవసాయ పెట్టుబడులు, రుణాలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు కూడా విస్తరిస్తాయి. మహిళల భూ హక్కులు గ్రామీణ సమానత్వానికి అత్యంత కీలకమైన అంశం.తెలంగాణ రాష్ట్రానికి భూమి సమస్యతో ప్రత్యేక చరిత్ర ఉంది. నిజాం పాలనలోని భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ పోరాటం భారత చరిత్రలో మైలురాయిగా నిలిచింది. ఆ పోరాటం భూమి కోసం మాత్రమే కాదు; ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం కూడా సాగింది. అయినప్పటికీ నేటికీ అసైన్డ్ భూములు, పోడు భూములు, గిరిజన భూ హక్కులు, కౌలు రైతుల సమస్యలు పూర్తిగా పరిష్కారం కాలేదు. ఇది భూసంస్కరణల అసంపూర్తి ప్రయాణానికి నిదర్శనం.దేశంలో రైతుల సంఖ్య తగ్గుతుండటం కూడా ఆందోళన కలిగించే అంశం. వ్యవసాయం లాభసాటిగా లేకపోవడం, అప్పుల భారం, ప్రత్యామ్నాయ ఉపాధి కోసం వలసలు పెరగడం వల్ల చిన్న రైతులు క్రమంగా భూమిని కోల్పోతున్నారు. వారి స్థానంలో పెద్ద భూస్వాములు, రియల్ ఎస్టేట్ సంస్థలు, కార్పొరేట్ పెట్టుబడిదారులు భూమిని స్వాధీనం చేసుకుంటున్నారు. ఇది భవిష్యత్తులో గ్రామీణ అసమానతలను మరింత పెంచే ప్రమాదం ఉంది.ఈ నేపథ్యంలో భూసంస్కరణలను మరోసారి జాతీయ ప్రాధాన్య అంశంగా తీసుకురావాలి. మిగులు భూములు, ఆక్రమిత ప్రభుత్వ భూములు, చట్టపరమైన వివాదాలు లేని భూములను గుర్తించి భూమిలేని కుటుంబాలకు పంపిణీ చేయాలి. కౌలు రైతులకు చట్టబద్ధ గుర్తింపు ఇవ్వాలి. మహిళలకు సంయుక్త లేదా స్వంత భూ యాజమాన్యాన్ని ప్రోత్సహించాలి. చిన్న రైతులకు సాగునీరు, పంట బీమా, తక్కువ వడ్డీ రుణాలు, నిల్వ గోదాములు, మార్కెటింగ్ సదుపాయాలు, కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ కల్పించాలి. భూ రికార్డులను పారదర్శకంగా మార్చి భూ ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలి.గ్రామీణ అభివృద్ధి అంటే కేవలం రహదారులు, భవనాలు నిర్మించడం కాదు. భూమిలేని కుటుంబానికి భూమి ఇవ్వడం, రైతుకు గిట్టుబాటు ధర కల్పించడం, సాగును లాభసాటిగా మార్చడం, యువత వ్యవసాయాన్ని వృత్తిగా కొనసాగించే పరిస్థితులను సృష్టించడం కూడా అభివృద్ధే. రైతు బలపడితేనే గ్రామం బలపడుతుంది. గ్రామం బలపడితేనే దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉంటుంది.భూమి అనేది కొద్దిమందికి సంపదను పోగు చేసే సాధనంగా కాకుండా, కోట్లాది రైతు కుటుంబాలకు జీవన హక్కుగా మారాలి. భూసంస్కరణల అసలు స్ఫూర్తి అదే. భూమిని సాగు చేసే చేతుల్లోనే భూమి ఉండే రోజు వచ్చినప్పుడే స్వాతంత్ర్య భారతదేశం సామాజిక న్యాయ లక్ష్యాన్ని నిజంగా చేరుకున్నట్లవుతుంది. భూమి రైతుకు దక్కడం అనేది కేవలం ఆర్థిక సంస్కరణ కాదు; అది ప్రజాస్వామ్యానికి, సామాజిక సమానత్వానికి, దేశ ఆహార భద్రతకు అత్యంత అవసరమైన జాతీయ కర్తవ్యం.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

# జన్వాడలో వాటర్ ట్యాంకర్ల బీభత్సం..

- భారీ ప్రమాదం తప్పినా మేల్కొనని అధికారులు
- మామిడి చెట్టు అడ్డుగా నిలవడంతో తప్పిన పెను విషాదం

**శంకర్ పల్లి, వెలుతురు జులై 19 :**

శంకర్ పల్లి, మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలోని జన్వాడ ఎక్స్‌రోడ్‌లో అతి వేగంగా దూసుకొచ్చిన వాటర్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. అదుపుతప్పిన ట్యాంకర్ రోడ్డుపైకి దూసుకెళ్లి రోడ్డు పక్కనున్న మామిడి చెట్టును ఢీకొని ఆగింది. చెట్టు అడ్డుగా నిలవడంతో భారీ ప్రాణనష్టం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. లేదంటే మరింత ఘోర ప్రమాదం జరిగి ఉండేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ట్యాంకర్ కింద ఒక బైక్ చిక్కుకుపోగా, బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రుడిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు.







### వరుస ప్రమాదాలు... అయినా చర్యలు శూన్యం

గత కొంతకాలంగా జన్వాడ, మోకిల పరిసర ప్రాంతాల్లో వాటర్ ట్యాంకర్ల కారణంగా వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధిక వేగంతో నిబంధనలను ఉల్లంఘిస్తూ ట్యాంకర్లు సంచరిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

### రెవెన్యూ, పోలీసు శాఖల బాధ్యత ఎక్కడ?

స్థానికుల అభిప్రాయం ప్రకారం, అక్రమంగా భూగర్భ జలాల వినియోగం, రవాణాపై సంబంధిత రెవెన్యూ అధికారులు చట్టప్రకారం పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. అలాగే అధిక వేగంతో నడిచే ట్యాంకర్లపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఎండలు.. తగ్గుతున్న నీటి వనరులు.. పెరుగుతున్న జల దోపిడి ఆరోపణలు

ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదై, చెరువులు ఎండిపోవడం, భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అక్రమంగా నీటి తరలింపుపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

ఈ అంశంపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితి వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని స్థానికులు అంటున్నారు.

### ఒక్క జన్వాడ రెవెన్యూ పరిధిలోనే 50కి పైగా ట్యాంకర్ల అడ్డాలు?

స్థానికుల సమాచారం ప్రకారం, జన్వాడ రెవెన్యూ పరిధిలోనే 50కి పైగా వాటర్ ట్యాంకర్ల అడ్డాలు నిర్వహించబడుతున్నాయని చెబుతున్నారు. వీటి కార్యకలాపాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించి, అవసరమైతే అనుమతులు, నీటి మూలాలు, రవాణా విధానాలపై విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

### ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోవాలి

ఒక ప్రమాదం తప్పిందని ఊరుకోవద్దని, మరొకసారి ఇలాంటి ఘటనలో అమాయక ప్రాణాలు బలయ్యే పరిస్థితి రాకముందే అధికారులు మేల్కొనాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అక్రమ జల రవాణాపై సమగ్ర విచారణ, నిబంధనలు ఉల్లంఘిస్తున్న ట్యాంకర్లపై చర్యలు, అలాగే అధిక వేగంతో వాహనాలు నడిపే డ్రైవర్లపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మరకత లింగేశ్వర స్వామికి హంపి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య విరూపాక్ష విద్యారణ్య భారతి ప్రత్యేక పూజలు

**శంకర్‌పల్లి, వెలుతురు జులై 19:**



శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామంలో వెలసిన 11వ శతాబ్దానికి చెందిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత లింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం హంపి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య విరూపాక్ష విద్యారణ్య భారతి.. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. అనంతరం పీఠాధిపతి మాట్లాడుతూ ఆకుపచ్చ గల శివలింగానికి ఒక్కసారి అభిషేకం చేస్తే వెయ్యిరెట్ల ఫలితం దక్కుతుందని సూచించారు. పీఠాధిపతిని భక్తులు దర్శనం చేసుకొని ఆశీర్వచనం తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కడకంచి కుమార్ యాదవ్, ఉపాధ్యక్షుడు నర్సింలు, క్యాషియర్ ప్రశాంత్ గౌడ్, సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, పెంటయ్య, వెంకటేష్, భీమ్ రెడ్డి, అంజయ్య, అనంతయ్య, దేవేందర్ రెడ్డి, సర్పంచ్ మల్లికార్జున్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, రమేష్, అనంతరెడ్డి, ముకుందం, జనార్ధన్, సదానందం గౌడ్, దర్శన్ గౌడ్, శేఖర్, గోపాల్ రెడ్డి, హన్మంతు, విద్యాసాగర్, శేఖర్ రెడ్డి, సుధీర్ గౌడ్, అర్చకులు ఫణీంద్ర, సాయిశివ, ప్రమోద్, వీరేశం, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వివేకానంద నగర్ SIR ఓటరు మ్యాపింగ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 19:**




282 డివిజన్ చింతల్ పరిధిలోని వివేకానంద నగర్ లో స్థానిక డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్ బిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటరు అవగాహన కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరైయ్యారు. స్థానిక ఓటర్లతో మాట్లాడుతూ SIR కార్యక్రమం ఉద్దేశ్యం, ఓటరు వివరాల మ్యాపింగ్ ప్రాముఖ్యత, ప్రతి అర్హుడైన ఓటరు తన వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రజలు ఈకార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఓటరు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదై ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు SIR కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు (BLOలు) తోపాటు కూన రాఘవేంద్ర గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు పృధ్వి, అరుణ్, రాజేష్, సాయికుమార్, పుండరీక, జగన్ గౌడ్ నవీన్, సరిత నరసింహ, గుండప్ప తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా తపాస్ ఇబ్రహీంపట్నం మండల శాఖ ఆధ్వర్యంలో అభ్యత్వ అభినయన్

**ఇబ్రహీంపట్నం వెలుతురు జూలై 19:**

ఇబ్రహీంపట్నం తపస్ ఉపాధ్యాయసంఘం మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తపస్ స భ్యత్వ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లాప్రధానకార్యదర్శి పూజరి రమేశ ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యారంగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పిఆర్ సి6డిఎలు పెండింగ్ బిల్స్ పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేశారు గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు సమస్యల న్యాయపరమైన సమస్యలు పరిష్కారం కోసం ఉద్యమం చేయక తప్పని పరిస్థితి ఉంది అని పి ఆర్సిరిపోర్టు వెంటనే తెప్పించుకుని 51శాతంఫిట్మెంట్ ప్రకటన చేయాలి ఉద్యోగఉపాధ్యాయపె న్షనర్ లకు సంబంధించి ఈకుబెర్ లో పేరుకుపోయిన పెన్షనర్స్.తో సహా అందరికి పెండింగ్ బిల్లు లను పూర్తిగా చెల్లించాలి భవిష్యత్ లో ఏ బిల్లు పెండింగ్ లో లేకుండా చూ డాలి6డిఏల ప్రకట న విషయంలో గానికదలిక లేదు ఒక్కొక్కఉద్యోగి ఉపాధ్యాయులు ఆర్థికంగా విషయంలో తీవ్రం గానష్టపో తున్నారు డిఎలు వెంటనే ప్రకటించాలి పెన్షనర్స్ బెనిఫిట్స్ కోసం ఎదురు చూస్తున్నా రు జాప్యంచేయకుండా వారివి క్లియర్ చేయించాలి.కేజీబీవీ ఎస్ ఎస్ ఏ ఉద్యోగులు మహిళా ఉపాధ్యాయుల సిబ్బంది సమ్మెకాలపు జీతం చెల్లిస్తూ ఎంటిఎస్ అమలు చేయాలిమోడల్ స్కూల్ 010పద్దు విషయంలో సత్వరంనిర్ణయం తీసుకోవాలి ప్రభుత్వంతీసు కొచ్చిన190జీవో అమలు మిగతా డిపార్ట్మెంట్లో పూర్తిచేసినట్లు విద్యాశాఖ ఇంకా కూడా పెండింగ్ లో పెట్టి దిఅప్పీ ల్ చేసుకున్న అందరికి ఉత్తర్వులు ఇవ్వాలి ముఖ్యమంత్రి గారు ఇచ్చిన హామీ మేరకు2003 డీ ఎస్సీ వారికి ఓపిఎస్అమలు చేయాలి సుప్రీంకోర్టులో ప్రభుత్వం ఎస్ఎల్పివెనక్కి తీసుకోవాలి మ్యానిఫెస్టో ఉన్నా సి.పి ఎస్ రద్దు అంశంను పరిష్కారం కోసం ప్రత్యేకంగా చొరవచూపి అంద రికి పాత పెన్షన్ అమలు చేయాలిఅన్నిరకాల గురుకుల ఆశ్రమ ఎయిడెడ్ పాఠశాలల సమస్య లతో పాటు అక్కడ పనిచేసే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక కమిటీని ని యమించి సమస్యపరిష్కారానికి చొరవ చూపా లిఇన్సర్వీస్ ఉపాధ్యాయులకు 40 శాతం మా ర్కులు అర్హతగా నిర్ణయం చేయాలి.2008 డీఎస్సీ కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులర్ చే యాలి ఆర్థికఆర్థికేతర విషయాలపై కూడా ప్రభుత్వం ఉపాధ్యాయులను తీవ్రంగా విస్మరిస్తుంది జూన్ రెండు నుంచి హెల్త్ కార్డులు అమలు చేస్తామని చెప్పి మే నెల శాలరీ లో వాటా కోత వి ధించడం జరిగింది.ట్రస్ట్ ఏర్పాటు అసంబద్ధంగా ఉంది. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ లో ఉన్న అ న్ని సంఘాలు ట్రస్ట్ లో ఉండాలి మార్గదర్శకాలు పూర్తి అయిన తర్వాతే వాటా కట్ చేయాలి ప్రభుత్వ పా ఠశాలల మౌలికవసతులు కల్పన జూలై మొదటి వారం లోనే గ్రాంట్స్ రిలీజ్ చే యాలి ఉపాధ్యాయుల వార్షిక ప్రమోషన్ ట్రాన్స్ఫర్ క్యాలెండర్ను విడుదల చేయాలి ఈ విష యాలపై సంబంధిత అధికారులకు.ఎన్ని ప్రాతినిధ్యాలు చేసిన ప్రయోజనంలేదుతమరి ద్వారా సమస్యల పరిష్కారంకు చొరవ చూపాలి సమస్యల పరిష్కారం కోసం జిల్లా స్థాయిలో ధర్నాకా ర్యక్రమం చేపట్టి ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ గారి ద్వారా రాష్ట్ర ప్ర భుత్వానికి మెమోరాండం ద్వారా ఈ సమస్యలు తెలియజేస్తున్నాము సమస్యల పరిష్కారం కోసం జూలై 14 న జిల్లా కేంద్రంలో పెద్ద సంఖ్యలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగిం దిఇప్పటికి కూడ చొరవ చూపకపోతే ఆగస్టు1రోజు రాష్ట్ర మహాధర్నాచేపట్టనున్నట్లు తెలిపా రుఈ కార్యక్రమంలో తపస్ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షప్రధాన కార్యదర్శులు వడ్ల రాజేంద ర్ రాపోల్ ప్రవీణ్ కుమార్ జిల్లా కార్యదర్శి పట్నం కృష్ణ.మండల బాధ్యులు శ్రీనివాస్ ఉదయ్ కుమార్ పొట్టి మహేష్ లలిత.కృష్ణ వేణి,సురేఖ తదితరులు పాల్గొన్నారు.




## శ్రీశ్రీశ్రీ మిద్దె మైసమ్మ తల్లి బోనాల జాతర కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ

**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి జూలై 19:**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ దుండిగల్ డివిజన్ దుండిగల్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ మిద్దె మైసమ్మ తల్లి బోనాల జాతర కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ గారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మైసమ్మ తల్లి బోనాలా జాతర కార్యక్రమంలో పాల్గొనటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు జక్కుల కృష్ణా యాదవ్, అమరం గోపాల్ రెడ్డి, జక్కుల శ్రీనివాస్ యాదవ్, ఆనంద్ కుమార్, మాజీ ఎంపీటీసీ నరేందర్, దుండిగల్ సర్కిల్ జనరల్ సెక్రటరీ కొల్తూర్ మల్లేష్ ముదిరాజ్, ప్యాక్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, ప్యాక్స్ డైరెక్టర్ ఈ శ్రీనివాస్, వార్డు ప్రెసిడెంట్ నర్సింగ్ గౌడ్, ఆలయ కమిటీ మరియు కుమ్మరి మండల సంఘం అధ్యక్షులు విరేష్ ముదిరాజ్, సభ్యులు రాజు, సత్యనారాయణ, కృష్ణా, రమేష్, శ్రీశైలం, నాగరాజు, నందమ్, మరియు నాయకులు ఎల్లయ్య గౌడ్, ధార మహేష్, స్థానికులు ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## వాసవి లేఔట్ ZPH స్కూల్‌లో SIR2026 మెగా హెల్ప్ డెస్క్ క్యాంపును ప్రారంభించిన కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 19:**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 276వ డివిజన్ ప్రగతి నగర్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వరరెడ్డి (తాతిరెడ్డి) అధ్యక్షతన వాసవి లేఔట్ ZPH స్కూల్‌లో ఏర్పాటు చేసిన SIR-2026 మెగా హెల్ప్ డెస్క్ క్యాంపును కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... SIR-2026 ప్రక్రియపై ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించడం, అవసరమైన సమాచారం అందించడం, నమోదు ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలకు సహాయం చేయడం కోసం ఈ మెగా హెల్ప్ డెస్క్ క్యాంపును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.SIR-2026 కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రతి అర్హులైన ఓటరికి సహాయం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కాంగ్రెస్ పార్టీ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నాగోల్ ఎక్స్ రోడ్‌లో 'స్వాదు స్పైసి' రెస్టారెంట్ ప్రారంభం

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మధు యాష్కీ గౌడ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం

**ఎల్బీనగర్, వెలుతురు జూలై 19:**




నాగోల్ ఎక్స్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'స్వాదు స్పైసి' రెస్టారెంట్‌ను ఆదివారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మధు యాష్కీ గౌడ్ ఘనంగా ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఆయన నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేసి, వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా రెస్టారెంట్ నిర్వాహకులు ప్రసాద్, జగన్, సూర్యప్రకాశ్ మాట్లాడుతూ, "Flavor, Taste, Please Don't..." అనే నినాదంతో రెస్టారెంట్‌ను ప్రారంభించామని తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన స్పైసీ వంటకాలతో పాటు నార్త్ ఇండియన్, చైనీస్, సౌత్ ఇండియన్ రుచులను పరిశుభ్రమైన వాతావరణంలో, అందుబాటు ధరల్లో అందిస్తామని పేర్కొన్నారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో కస్టమర్లు పాల్గొని రెస్టారెంట్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవాలి: భూపతిరెడ్డి




**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 19:**

ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవాలని మాజీ టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి నర్సిరెడ్డి భూపతిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం.కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో SIR (ఓటరు సవరణ ప్రక్రియ) ఆయన పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న SIR (ఓటరు సవరణ ప్రక్రియ)లో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రగతినగర్ డివిజన్ (276), దుండిగల్ డివిజన్ (296) మరియు నిజాంపేట్ డివిజన్(273)లో డివిజన్ అధ్యక్షుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెల్ప్ డెస్క్ లను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... SIR ప్రక్రియలో భాగంగా బిఎల్ఓలు, బిఎల్ఏలు ఇంటింటికీ వెళ్లి ఏనుమరేషన్ ఫార్మ్స్ అందచేసి తిరిగి వాటిలో ఉన్న వివరాలు పూర్తిస్థాయిలో నింపి తిరిగి సంబంధిత అధికారులకు అందచేయాలని తెలిపారు. అదే విధంగా డివిజన్ అధ్యక్షులు మరిన్ని హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసి ఎన్నికల సంఘం ఇచ్చిన గడువు లోపు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, ప్రగతినగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వరరెడ్డి, దుండిగల్ డివిజన్ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్, నిజాంపేట్ డివిజన్ అధ్యక్షులు కోటపాటి మురళి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముత్యం రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కడియాల ఇందిరా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సూరారం సిఐ బాలరాజుని కలసిన గుబ్బల లక్ష్మీనారాయణ

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 19:**



సూరారం పోలీస్ స్టేషన్ S.H.O బాధ్యతలు స్వీకరించిన సీఐ బాలరాజును బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, మాజీ ప్రెసిడెంట్ ఆలూరు వెంకటశేష చారి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ... ఈ ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం మీరందరూ భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో వేణు చారి, సింహాచలం, ఎంఎన్ కె. కుమార్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సాంస్కృతిక సేన జిల్లా అధ్యక్షుడిగా దుడ్డు రాహుల్ నియామకం

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 19:**




మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సాంస్కృతిక సేన జిల్లా అధ్యక్షుడిగా దుడ్డు రాహుల్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొదమగుండ్ల అమృతయ్య, జిల్లా ఉపాధ్యక్షుడిగా పోచంపల్లి బాలరాజును నియమించారు.ఈసందర్భంగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. అనంతరం నూతనంగా నియమితులైన నాయకులకు శుభాకాంక్షలు తెలియజేసి, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కబేలాను పునరుద్ధరించాలి సిపిఎం డిమాండ్




**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 19:**

సిపిఎం పట్టణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు కందుల హనుమంతు డిమాండ్. ఆదివారం రామన్నపేట పట్టణ కమిటీ సమావేశం బాబు చారి అధ్యక్షతన జరిగిన సమావేశం.లో కందుల హనుమంతు సిపిఎం పట్టణ కార్యదర్శి మునుకుట్ల లెనిన్ మాట్లాడుతూ గ్రామంలో మేకలను గొర్రెలను ఎవరి ఇంటి ముందు వారు కోయడం ద్వారా వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయడం వలన దుర్గంధం వెదజల్లుతున్నందున ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని మేకల, గొర్రెల మాంసాన్ని ఒకే చోట కోసేందుకు కబేలాను పునరుద్ధరించేందుకు మాంసం మార్కెట్ ఏర్పాటు చేయాలని అధికారులు ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఒకే చోట కోయడం ద్వారా గ్రామ పంచాయితీ ముద్ర వేసిన మేకల గొర్లను మాంసాన్ని విక్రయించాలని ప్రజల ఆరోగ్యాలు కాపాడాలనివారు కోరారు. ఈ కార్యక్రమాల్లో మండల కమిటీ సభ్యులు గొరిగే స్వాములు సీనియర్ నాయకులు ఆముద ఆంజనేయులు, పల్లె సత్యం, నకిరేకంటి సురేష్ బాబు, చారి, పల్లె లింగస్వామి,అప్పం సంతోష్, బొల్లా వెంకన్న, కడారి రాములు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షనిగా లయన్ డాక్టర్ పనకంటి. భాస్కరరావు

**కార్యదర్శిగా లయన్ ఎండి ఉస్మాన్**




రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 19: ట్రెజరర్ గా లయన్ నరేందర్ రెడ్డి గంట్ల ఎన్నిక లయన్స్ క్లబ్ ఆఫ్ రామన్నపేట 23 వ వ్యవస్థాపక దినోత్సవం జెపి గార్డెన్లో ఏర్పాటు చేయనైనది. 2026– 27 లైన్ స్టిక్ ఇయర్ కు నూతన అధ్యక్షులుగా లయన్ డాక్టర్ భాస్కరరావు పనగంటి .కార్యదర్శిగా లయన్ ఎండి ఉస్మాన్, ట్రెజరర్ లయన్ నరేందర్ రెడ్డి గంట్ల నూతనంగా ఎన్నుకోవడం జరిగింది. వీరినీ లయన్స్ క్లబ్ రామన్నపేట సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఎన్నుకున్నారు. ఈ వ్యవస్థాపక దినోత్సవానికి ముఖ్యఅతిథిగా పూర్వ గవర్నర్ లయన్ మదన్మోహన్ రేపాల వ్యవస్థాపక దినోత్సవ కార్యవర్గానికి ప్రమాణస్వీకరానికి అతిథిగా లయన్ రఘుపతి నేతి, నిమ్మల పిచ్చయ్య, అలుగువెల్లి కరుణాకర్ రెడ్డి, కర్నాటి రమేష్, సంజీవరెడ్డి, రవీందర్ రావు, జింకల ప్రభాకర్, చాటర్ ప్రెసిడెంట్ లయన్ కృష్ణారెడ్డి, యాపాల సిద్ధప్ప, నరసింహారెడ్డి, గాలయ్య బిక్షం రెడ్డి,సురేందర్ రావు, శంకర్, అనంతరెడ్డి, అనువర్ణాదేవి, సూర్యనారాయణ తదితరులు పాల్గొనడం జరిగింది.

## సిరిపురం గ్రామంలో మురుగు నీటిని శుద్ధి చేసే ప్లాంటు ప్రారంభం

- ముఖ్యఅతిథిగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం.

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 19:**



తేదీ (20-07-2026) సోమవారం రోజున సిరిపురం గ్రామంలో ఐఐసిటీ వారు నిర్మించిన మురుగునీటిని శుద్ధి చేసే ప్లాంటును ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం చేతుల మీదుగా ఉదయం 8:30 ని:లకు ప్రారంభోత్సవ కార్యక్రమం చేయబడుతుంది. కావున సిరిపురం గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు అలాగే రామన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్పంచులు అందరు సరైన సమయానికి పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నాము. ఇట్లు పున్న జగన్మోహన్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు.

## జగదీశ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన పాల్వాయి స్రవంతి

**మునుగోడు,జూలై 19(వెలుతురు):**



ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రగతి ప్రదాత,మాజీ మంత్రివర్యులు, ప్రస్తుత సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి ఆదివారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.అనంతరం ఆయన సంపూర్ణ ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిన్నారి పుట్టినరోజు సందర్భంగా ఆశీర్వదించిన సిపిఐ నాయకులు తీర్పారి వెంకటేశ్వర్లు, ఈదులకంటి కైలాసం

**మునుగోడు వెలుతురు జూలై 19:**



మునుగోడు మండలం ఎలగలగూడెం గ్రామానికి చెందిన సిపిఐ గ్రామ శాఖ సహాయ కార్యదర్శి కట్కూరు వెంకన్న చిన్న కుమారుడు కట్కూరి శ్రీకృష్ణ భార్గవి దంపతుల కుమారుడి బర్త్డే కార్యక్రమంలో పాల్గొని చిన్నారి బాలుడ్ని ఆశీర్వదిస్తున్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తీర్పారి వెంకటేశ్వర్లు మండల కార్యవర్గ సభ్యులు ఈదులకంటి కైలాసం యువజన నాయకులు కట్కూరి లింగస్వామిలు ఉన్నారు.

## పీవీ సింధుకు మంత్రి వాకిటి శ్రీహరి అభినందనలు

**హైదరాబాద్, వెలుతురు జూలై 19, 2026:**



జపాన్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక జపాన్ ఓపెన్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మహిళల సింగిల్స్ విభాగంలో విజేతగా నిలిచి భారత త్రివర్ణ పతాకాన్ని అంతర్జాతీయ వేదికపై మరోసారి రెపరెపలాడించిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఫైనల్లో జపాన్ స్టార్ షట్లర్ అకానే యమగుచిని వరుస గేముల్లో ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకోవడం దేశానికి గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. పీవీ సింధి విజయం ఆమె అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమకు నిదర్శనమని అన్నారు.ప్రపంచ బ్యాడ్మింటన్‌లో భారత ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన పీవీ సింధు.. దేశ యువతకు, ముఖ్యంగా క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమైన ఆదర్శమని మంత్రి కొనియాడారు. ఆమె సాధించిన ఈ విజయం భారత క్రీడా రంగానికి మరింత ఉత్సాహాన్ని, స్ఫూర్తిని అందిస్తుందని అన్నారు.భవిష్యత్తులో జరగనున్న అంతర్జాతీయ పోటీల్లోనూ పీవీ సింధు ఇదే విజయపరంపరను కొనసాగిస్తూ మరెన్నో టైటిళ్లు సాధించి భారతదేశానికి మరిన్ని కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు.

## ఆగస్టు 10న కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలపై జైలు భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లేశం
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 19:**




కేంద్ర బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, కూలీ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆగస్టు 10న నిర్వహించనున్న జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లేశం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య పిలుపునిచ్చారు.స్థానిక సిపిఎం కార్యాలయంలో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సదస్సులో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను బలహీనపరుస్తూ, నాలుగు లేబర్ కోడ్‌ల ద్వారా కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు.రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో,వ్యవసాయానికి అవసరమైన మద్దతు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. గ్రామీణ పేదలకు ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించడం లేదని వీబీజీరామ్ గా పేరు మార్చి నిర్వీర్యం చేస్తుందని, కూలి రేట్లు పెంచడం వంటి డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం, నిరుద్యోగాన్ని పెంచే విధానాలు అమలు చేయడం, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలను నిర్లక్ష్యం చేయడం ప్రజా వ్యతిరేక పాలనకు నిదర్శనమని విమర్శించారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆగస్టు 10న జరిగే జైలు భరో కార్యక్రమంలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, యువజనులు, మహిళలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగే సోములు, సహాయ కార్యదర్శి నకిరకంటి రాము, జిల్లా కమిటి సభ్యులు బొడ్డుపల్లి వెంకటేశం, రైతు సంఘం మండల కార్యదర్శి గన్నేబోయిన విజయభాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మేడి ముకుంద. గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల బిక్షం,గీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బావండ్లపల్లి బాలరాజు,ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్స్ జిల్లా నాయకులు అప్పం సురేందర్, పల్లె సత్యనారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు వంగాల మారయ్య, నాయకులు ఆవనగంటి నగేష్,నాగటి లక్ష్మణ్, చెన్ను స్వామి, ఉంద్రాతి నర్సింహా, ఆవనగంటి రవి తదితరులు పాల్గొన్నారు.

## భూ రీసర్వేను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

- రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- శ్రీనివాసగుట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి
- సమగ్ర సమీక్షా సమావేశంలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**సారపాక వెలుతురు జూలై 19:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చేపడుతున్న భూముల రీ–సర్వే ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం సారపాకలోని ఐటీసీ గెస్ట్ హౌస్‌లో జిల్లాలో భూముల రీ–సర్వే ప్రగతి, అటవీ–రెవెన్యూ భూ సమస్యలు, పోడు భూముల అంశం, పాల్వంచ శ్రీనివాసగుట్ట అభివృద్ధిపై ఆయన అధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. జిల్లాలో సర్వే పనులు మరింత వేగంగా ముందుకు సాగాలని, ఎక్కడా జాప్యానికి తావులేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రస్తుతం 14 గ్రామాల్లో పనులు కొనసాగుతుండగా, ఐదు గ్రామాల్లో సర్వే పూర్తయిందని అధికారులు వివరించారు. మిగిలిన గ్రామాల్లోనూ నిర్దేశిత కాలవ్యవధిలోగా పనులు పూర్తి చేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో సర్వేయర్లు, రోవర్ పరికరాల కొరత రాకుండా అవసరమైన చోట అదనపు వనరులను సమకూర్చుకోవాలని ఆదేశించారు.

### సమన్వయంతోనే భూ సమస్యల పరిష్కారం

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న అటవీ–రెవెన్యూ భూ సమస్యలను సామరస్యపూర్వకంగా, చట్టబద్ధంగా పరిష్కరించేందుకు రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖలు పరస్పర సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని మంత్రి సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రతి నెలా సమీక్షా సమావేశాల ద్వారా పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కొత్తగా పోడు సాగు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటూనే.. గతంలో పోడు సాగు చేస్తున్న వారి సమస్యలను ప్రభుత్వ విధానాల ప్రకారం, మానవీయ కోణంలో పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు.

### శ్రీనివాసగుట్టకు పర్యాటక శోభ

పాల్వంచలోని శ్రీనివాసగుట్ట ప్రాంతాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. గుట్టపై వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు సులభంగా చేరుకునేలా రహదారి నిర్మాణానికి తగిన ప్రతిపాదనలు రూపొందించాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, ఐటీడీఏ పీఓ రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యా చందన, డీఆర్ఓ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి పథకం పేరుమీద మహిళలకు నెలకు 2500 రూపాయలు ఇవ్వాలి

- మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బండి జంగమ్మ.

**మోత్కూర్, జులై 19,వెలుతురు న్యూస్ :**



మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని కే.ఆర్.భవన్ లో యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మోత్కూరు మండల మహిళా సమాఖ్య నాల్గవ మండల మహాసభలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బండి జంగమ్మ పాల్గొని మహిళా సమాఖ్య జెండా ఎగరవేశారు.తదనంతరం మహాసభలో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం మహాలక్ష్మి పథకం కింద ,మహిళకు ప్రతి నెల 2500 రూపాయలు ఇవ్వాలని, ఎల్పిజి గ్యాస్ సిలిండర్ 500 రూపాయలకే ఇవ్వాలని, అర్హులైన మహిళలందరికీ పెన్షన్స్, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, ఇందిరమ్మ కానుక పథకం కింద తులం బంగారం వెంటనే ఇవ్వాలని,ఒంటరి మహిళలకు ₹4,000 పెన్షన్ ఇవ్వాలని, మహిళలపై జరుగుతున్న అరాచకాలను అరికట్టాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు గుర్రం రాజమణి సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి సిపిఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్ పాల్గొన్నారు.

## జాతీయస్థాయిలో సత్తా చాటిన మోత్కూరు జడ్పీ హెచ్ఎస్ విద్యార్థి

- సీయూఈటీలో ప్రతిభతో ఢిల్లీలోని హిందూ కాలేజీలో ప్రవేశం

**మోత్కూర్, జూలై 19, వెలుతురు న్యూస్ :**



మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన విద్యార్థి బుంగపట్ల అర్జున్ జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి ఢిల్లీలోని ప్రతిష్టాత్మక హిందూ కాలేజీలో ప్రవేశం పొందాడు. మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థి ఈ ఘనత సాధించడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. పాఠశాల పూర్వ ఉపాధ్యాయుడు బందరపు దుర్గాప్రసాద్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ, మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన బుంగపట్ల ప్రభాకర్ సుమలత దంపతుల కుమారుడు బుంగపట్ల అర్జున్ 2023–24 విద్యా సంవత్సరంలో మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాడని తెలిపారు. <

అనంతరం నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి, 2026 మే నెలలో నిర్వహించిన కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్ (CUET)లో 79.1 శాతం స్కోరు సాధించి, ఢిల్లీలోని ప్రతిష్టాత్మక హిందూ కాలేజీలో బి.ఏ. డిగ్రీ కోర్సులో ప్రవేశం పొందినట్లు వెల్లడించారు.గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమని, ఇతర విద్యార్థులకు అర్జున్ ఆదర్శంగా నిలుస్తాడని దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. లక్ష్యసాధనకు కృషి, పట్టుదల ఉంటే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా దేశంలోని అత్యున్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు సాధించగలరని ఆయన అన్నారు. ఈ సందర్భంగా అర్జున్‌ను అతని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు, అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## వనస్థలిపురంలో "యాడ్స్ కా అడ్డా డిజిటల్స్" ప్రారంభం అత్యాధునిక పద్ధతిలో ప్రింటింగ్ సేవలు అందిస్తాం: నిర్వాహకులు

**ఎల్బీనగర్, వెలుతురు జూలై 19:**







వనస్థలిపురంలో "యాడ్స్ కా అడ్డా డిజిటల్స్" సంస్థ శనివారం ఘనంగా ప్రారంభమైంది.ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకుడు ముత్యాల అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఫ్లెక్సీ ప్రింటింగ్, ప్రకటనల రూపకల్పన, విజిటింగ్ కార్డులు, వివాహ ఆహ్వాన పత్రికలు, రాజకీయ నాయకుల ప్రచార సామగ్రి తదితర ప్రింటింగ్ సేవలను అత్యాధునిక సాంకేతికతతో వినియోగదారులకు అందిస్తామని తెలిపారు.మరో నిర్వాహకుడు గజినేష్ చౌహాన్ మాట్లాడుతూ, దూర ప్రాంతాల వినియోగదారుల సౌకర్యార్థం కొరియర్ సేవను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాణ్యమైన ప్రింటింగ్ సేవలను అందుబాటు ధరల్లో అందించడం తమ సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, మాజీ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, జిట్టా రాజశేఖర్ రెడ్డి, నందికంటి భాస్కర్, యువ అకాడమీ కరస్పాండెంట్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. వ్యాపారవేత్తలు, కస్టమర్లు హాజరై సంస్థ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# జహీరాబాద్‌లో ఉచిత చెత్త సేకరణ చేపట్టాలి


- **ప్రైవేటు వ్యవస్థను రద్దు చేసి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సేవలు అందించాలి...**
- **36వ వార్డు కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్**

**జహీరాబాద్ వెలుతురు, జూలై 19:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని నివాస గృహాల నుంచి ఉచితంగా చెత్త సేకరణ చేపట్టాలని 36వ వార్డు కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్ మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తుల ద్వారా చెత్త సేకరణ జరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆరోపించారు.ఆదివారం సాయంత్రం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, చెత్త సేకరణ వాహన నిర్వాహకులు ప్రజల నుంచి ఇష్టారీతిన డబ్బులు వసూలు చేస్తున్నారని, డబ్బులు చెల్లించని వారి నుంచి చెత్తను సేకరించకుండా అవమానకరంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఈ కారణంగా తరచూ ప్రజలకు, చెత్త సేకరణ వాహన నిర్వాహకులకు మధ్య వాగ్వివాదాలు జరుగుతున్నాయని తెలిపారు.డబ్బులు చెల్లించని ఇళ్ల నుంచి చెత్త సేకరించకపోవడంతో పలువురు నివాసితులు రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో, మురుగునీటి కాలువల్లో చెత్తను వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో పట్టణంలో పారిశుద్ధ్య సమస్యలు తీవ్రమవుతున్నాయని, దుర్వాసన వ్యాపించడంతో పాటు దోమల బెడద పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.మున్సిపాలిటీకి ప్రజలు ఆస్తి పన్ను, నీటి పన్ను తదితర పన్నులను సక్రమంగా చెల్లిస్తున్నప్పటికీ, వారికి పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని విమర్శించారు. మున్సిపాలిటీకి ఇప్పటికే వివిధ మార్గాల్లో ఆదాయం వస్తున్న నేపథ్యంలో చెత్త సేకరణ పేరుతో అదనంగా డబ్బులు వసూలు చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు.వెంటనే ప్రైవేటు చెత్త సేకరణ విధానాన్ని రద్దు చేసి, మున్సిపాలిటీ ఆధ్వర్యంలోనే ప్రతి ఇంటి నుంచి ఉచితంగా చెత్త సేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనివల్ల స్వచ్ఛ భారత్, స్వచ్ఛ తెలంగాణ లక్ష్యాలకు అనుగుణంగా పరిశుభ్రమైన జహీరాబాద్‌ను నిర్మించవచ్చని అభిప్రాయపడ్డారు.జహీరాబాద్ పట్టణ పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణ కోసం ఈ డిమాండ్‌కు పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, సామాజిక సంస్థలు, ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని 36వ వార్డు కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలి





- **ఎమ్మెల్యే కొణింటి మాణిక్‌రావు..**

**జహీరాబాద్ వెలుతురు జూలై 19:**

సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని మన్నాపూర్, జాంబౌర్ బౌడి తండా, మిర్జంపల్లి తండా, మొగుడంపల్లి మండల కేంద్రంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జహీరాబాద్ ఎమ్మెల్యే కొణింటి మాణిక్‌రావు సమీక్షించారు. ఈ సందర్భంగా మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు సంజీవ్ రెడ్డి, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, ఝరాసంగం మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశంతో కలిసి ఆయా బూత్‌లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఓటు అత్యంత విలువైనదని, ప్రతి వార్డు, గ్రామంలోని బూత్ పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని సూచించారు. బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు)తో సమన్వయం చేసుకుని ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, అలాగే బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) ప్రతి ఓటరికి అవసరమైన సహకారం అందించి ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గోపాల్, సురేష్, ఈశ్వర్ రెడ్డి, సంజీవ్ పవార్, తిమోతి, దేవిదాస్ జాదవ్, నాగిశెట్టి, ఈశ్వర్, అంజన్న, సంజు రాథోడ్, రాంశెట్టి, లింబాజీ, చందర్, అర్జున్ కృపాకర్, రాములు, షికారి గోపాల్, జెట్ట్యప్ప, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల స్కాలర్‌షిప్ నిధులు పెంచాలి

- **బీఆర్ఎస్ నాయకుడు షేక్ సోహైల్...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 19:**



విద్యార్థులకు అందిస్తున్న స్కాలర్‌షిప్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెంచాలని, విద్యాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఝరాసంగం మండలం బీఆర్ఎస్ నాయకుడు షేక్ సోహైల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని స్కాలర్‌షిప్‌లను పెంచి వారికి అండగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లకు పైగా గడిచినా ఇప్పటికీ స్కాలర్‌షిప్ నిధులను పెంచకుండా గతంలో ఉన్న మొత్తాలనే కొనసాగించడం విద్యార్థులకు నిరాశ కలిగిస్తోందని విమర్శించారు.విద్యార్థులపై పెరుగుతున్న విద్యా వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని స్కాలర్‌షిప్ మొత్తాలను పెంచడంతో పాటు ప్రభుత్వ విద్యాలయాల్లో మౌలిక వసతులు, ఇతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# వర్షాలు సమృద్ధిగా కురవాలని గద్దపాకలో కప్పతల్లికి పూజలు, ప్రత్యేక జలాభిషేకాలు

**శంకరపట్నం వెలుతురు జూలై 19:**



శంకరపట్నం మండలంలోని గద్దపాక గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకుంటూ గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరుణ దేవుని కరుణ కోసం గ్రామస్తులంతా ఏకమై ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.గ్రామస్తులు తమ సంప్రదాయ పద్ధతిలో 'కప్పతల్లి'ని ఆడిస్తూ, 'వరద పాశం' పోసి వరుణ దేవుడిని ప్రార్థించారు. వర్షాల కోసం వేడుకుంటూ ఈ ప్రత్యేక పూజలు నిర్వహించిన గ్రామంలోని హనుమాన్ దేవాలయం, భూలక్ష్మి, మహాలక్ష్మి, పోచమ్మ తల్లి ఆలయాల్లోని విగ్రహాలకు ప్రత్యేక జలాభిషేకాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొయ్యడ పరుశరాములు, గ్రామ పెద్దలు, అలివేలు సుమ్మిరెడ్డి. గుర్రాల లక్ష్మారెడ్డి, గుర్రాల తిరుపతిరెడ్డి,వార్డు సభ్యులు శంకర్ రెడ్డి, జక్కుల సరూప బాకారపు వేణు, మునిగంటి వేణు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# పేదింటి బిడ్డలకు అండగా శాంతి ఫౌండేషన్

- **చింతలగట్టులో నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ....**
- **ఆర్థిక సహాయం అందించిన భీమ్ ఆర్మీ రాష్ట్ర చీఫ్ సిద్దు రావణ్...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 19:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహిర్ మండలం చింతలగట్టు గ్రామపంచాయతీ పరిధిలో శాంతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీతో పాటు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో శాంతి ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ సిద్ధు రావణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.కార్యక్రమానికి ముందు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన సిద్ధు రావణ్, అనంతరం దర్గా, చర్చిని సందర్శించి ప్రార్థనలు చేశారు. అలాగే పోచమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్ని మతాలు, అన్ని వర్గాల ప్రజలను గౌరవించడం సమాజ ఐక్యతకు ప్రతీక అని ఆయన పేర్కొన్నారు.గ్రామంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, తన తల్లి శాంతమ్మ జ్ఞాపకార్థం స్థాపించిన శాంతి ఫౌండేషన్ ద్వారా పేదలకు సేవ చేయడమే తన లక్ష్యమని తెలిపారు. కన్నతల్లి ఆశయాలను నెరవేర్చడంలోనే నిజమైన విజయం ఉందని, మనం ఇతరులకు చేసే మేలు తిరిగి సమాజం నుంచి మనకే వస్తుందని అన్నారు.దానం చేసే చేతులే సమాజానికి నిజమైన సంపద అని, పేదింటి బిడ్డలకు అండగా నిలవాలనే సంకల్పంతో శాంతి ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడంతో పాటు రోజువారీ అవసరాల కోసం ఆర్థిక సహాయం కూడా అందజేశారు.కార్యక్రమంలో స్థానిక కళాకారులు డప్పుల వాయిద్యాలతో, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకోగా, గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విద్యాసాగర్, ఉపసర్పంచ్ ఖలీల్ భాషా, వార్డు సభ్యులు, గ్రామ యువకులు, గ్రామస్తులు, భీమ్ ఆర్మీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం సిద్ధు రావణ్‌ను గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు ఘనంగా సన్మానించారు.

# మొగుడంపల్లిలో బీఆర్ఎస్‌లోకి 150 మంది చేరికలు

- **చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే కొణింటి మాణిక్‌రావు....**

**జహీరాబాద్ వెలుతురు జూలై 19:**





కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప మిగిలిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొణింటి మాణిక్‌రావు ఆరోపించారు.సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలం ఔరంగ్‌నగర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీలో భారీగా చేరికలు జరిగాయి. గ్రామ సర్పంచ్ జావీద్ పటేల్, ఉపసర్పంచ్ శేఖర్, వార్డు సభ్యులు అల్తాఫ్, దేవప్ప, విఠల్, మల్లప్పతో పాటు పలువురు గ్రామ నాయకులు, సుమారు 150 మంది గ్రామస్థులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి జహీరాబాద్ ఎమ్మెల్యే కొణింటి మాణిక్‌రావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఘనంగా ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, ఝరాసంగం మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశం పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణింటి మాణిక్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను నమ్మి ప్రజలు అధికారంలోకి తీసుకొచ్చారని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, దళితబంధు, కేసీఆర్ కిట్, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రైతు బీమా వంటి అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అండగా నిలిచామని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాలను నిర్వీర్యం చేసి పేదల సంక్షేమాన్ని దెబ్బతీస్తోందని విమర్శించారు.రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి మాట తప్పిందని, సాగునీటి సమస్యలు, ఉచిత విద్యుత్ సరఫరాలో ఇబ్బందులతో రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని మండిపడ్డారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయని, స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయకపోవడంతో సర్పంచులు, ప్రజాప్రతినిధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడేందుకే నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గోపాల్, సురేష్, ఈశ్వర్‌రెడ్డి, సంజీవ్ పవార్, తిమోతి, సిద్ధప్ప, దేవిదాస్ జాదవ్, నాగిశెట్టి, అంజన్న, సంజు రాథోడ్, రాంశెట్టి, లింబాజీ, పాండురంగరెడ్డి, చందర్, అర్జున్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బుల్లెట్ ట్రైన్ అంశంపై కేంద్ర మంత్రులను కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరాం

- **ఎమ్మెల్యే కొణింటి మాణిక్‌రావు...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 19:**




సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హైదరాబాద్–ముంబై ప్రతిపాదిత బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుపై ఎమ్మెల్యే కొణింటి మాణిక్‌రావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాజ్యసభలో బీఆర్ఎస్ పార్లమెంటరీ నాయకుడు ఎంపీ రవిచంద్ర ద్వారా కేంద్ర రైల్వే మంత్రి, ఇతర కేంద్ర మంత్రులను కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరినట్లు తెలిపారు.

జూలై 20 నుంచి ఆగస్టు 5 వరకు జరిగే పార్లమెంట్ సమావేశాల సమయంలో వారికి అనుకూలమైన సమయంలో భేటీ అయ్యే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.జహీరాబాద్ ప్రాంత ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులతో కలిసి కేంద్ర మంత్రులను కలిసి హైదరాబాద్–ముంబై ప్రతిపాదిత బుల్లెట్ ట్రైన్‌ను జహీరాబాద్ మీదుగా మళ్లించాల్సిన అవసరాన్ని వివరించి, ఈ ప్రాంత అభివృద్ధికి కలిగే ప్రయోజనాలను తెలియజేస్తూ వినతిపత్రం సమర్పించనున్నట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండప్ప, మాజీ మున్సిపల్ చైర్మన్ తంజీం, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు సంజీవ్ రెడ్డి, కోహీర్ మండల పార్టీ అధ్యక్షుడు నర్సింలు, హోతి–బి గ్రామ సర్పంచ్ మచ్చేందర్, కౌన్సిలర్లు దీపక్, విశ్వేశ్వర్, రాజు, నాయకులు సంజు పవార్, ఫయాజ్, శివకుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ అభివృద్ధి, తాగునీటి భద్రత, రైతుల సంక్షేమంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేసిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

- **ఎల్ఎండీకి అదనపు నీటి విడుదల, అమృత్ 2.0 పనుల వేగవంతం, రైతులకు ఫసల్ బీమా అమలు, సీఎం అష్యూరెన్స్ నిధుల విడుదల కోరిన మేయర్**

**కరీంనగర్ వెలుతురు జూలై 19:**






కరీంనగర్ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, నగరాభివృద్ధి, తాగునీటి భద్రత, రైతుల సంక్షేమం మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత & జౌళి శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారికి కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రత్యేక వినతిపత్రాన్ని అందజేశారు.జిల్లా సమీక్ష సమావేశం అనంతరం మంత్రి గారిని కలిసి కరీంనగర్ నగరంతో పాటు నియోజకవర్గ ప్రజల అవసరాలను వివరించిన మేయర్, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తగ్గిపోవడంతో ఎల్ఎండీ జలాశయంలో నీటి నిల్వలు ఆందోళనకరంగా ఉన్నాయని తెలిపారు. కరీంనగర్ నగరంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు తాగునీటి కొరత తలెత్తకుండా ఉండేందుకు ఎస్ఆర్ఎస్‌పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టుల నుంచి అదనంగా 2 టీఎంసీల నీటిని విడుదల చేసి ఎల్ఎండీని నింపేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి గారిని కోరారు.అమృత్ 2.0 పథకం కింద నగరంలో చేపడుతున్న తాగునీటి ట్యాంకుల నిర్మాణ పనులు అత్యంత నెమ్మదిగా సాగుతున్నాయని పేర్కొంటూ, ప్రజలకు త్వరగా ప్రయోజనం చేకూరేలా పనులను వేగవంతం చేయడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలో రైతులకు ఫసల్ బీమా యోజన ను సమర్థవంతంగా అమలు చేయాలని, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి గారిని కోరారు.ఈ సందర్భంగా కరీంనగర్ నగర అభివృద్ధి కోసం గతంలో ముఖ్యమంత్రి హామీ (CM Assurance) కింద మంజూరైన రూ.132 కోట్లలో ఇప్పటివరకు రూ.34 కోట్లు మాత్రమే విడుదలయ్యాయని, మిగిలిన రూ.98 కోట్ల నిధులు విడుదల కాకపోవడంతో రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, వరద నివారణ పనులు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అభివృద్ధి పనులు నిధుల కొరత కారణంగా పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి గారి దృష్టికి తీసుకెళ్లారు.అదేవిధంగా, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇటీవల విలీనమైన 8 గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం అదనంగా రూ.200 కోట్ల సీఎం అష్యూరెన్స్ నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం ద్వారా కోరారు. ఈ గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పైప్‌లైన్లు, వీధి దీపాలు, అంతర్గత రహదారులు, పారిశుద్ధ్య వ్యవస్థ, పార్కులు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు అవసరమని వివరించారు.వేగంగా విస్తరిస్తున్న కరీంనగర్ నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక సహాయం అందించి, నగర సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని కూడా మంత్రి గారిని విజ్ఞప్తి చేశారు.వినతిపత్రాన్ని సానుకూలంగా పరిశీలించి, మిగిలిన సీఎం అష్యూరెన్స్ నిధుల విడుదలతో పాటు అదనపు నిధుల మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి గారు హామీ ఇచ్చినట్లు మేయర్ తెలిపారు.కరీంనగర్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజలకు తాగునీటి భద్రత, రైతుల సంక్షేమం మరియు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల వేగవంతమైన అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి నాగేశ్వరరావు గారు, దుద్దిల్ల శ్రీధర్ బాబు గారు, పొన్నం ప్రభాకర్ గారు, అట్లూరి లక్ష్మణ్ కుమార్ గారు, ఎమ్మెల్యేలు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

# 1998లో స్థాపించిన అగ్రసేన్ బ్యాంక్ 27 ఏళ్లుగా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంది

- హైదరాబాద్‌లో ప్రారంభమైన బ్యాంక్ నేడు ఆదర్శ సహకార బ్యాంకుగా ఎదిగింది
- బ్యాంక్ ఛైర్మన్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, సిబ్బందికి అభినందనలు
- అగ్రసేన్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ వార్షిక సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

**నిజామాబాదు వెలుతురు జూలై 19:**

అగ్రసేన్ కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ వార్షిక సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్,టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ అగ్రసేన్ కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ AGMలో పాల్గొనడం ఆనందంగా ఉంది.1998లో స్థాపించిన అగ్రసేన్ బ్యాంక్ 27 ఏళ్లుగా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంది.హైదరాబాద్‌లో ప్రారంభమైన బ్యాంక్ నేడు ఆదర్శ సహకార బ్యాంకుగా ఎదిగింది.బ్యాంక్ ఛైర్మన్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, సిబ్బందికి అభినందనలు.10 వేలకుపైగా వాటాదారుల





విశ్వాసం బ్యాంక్ పారదర్శక పాలనకు నిదర్శనం.అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన బ్యాంకింగ్ సేవలు అందించడం అభినందనీయం.CBS ద్వారా ఆధునిక డిజిటల్ బ్యాంకింగ్ సేవలు అందించడం శుభపరిణామం.ప్రస్తుతం 10 శాఖలతో సేవలు... మరిన్ని శాఖలు ప్రారంభించాలని ఆకాంక్ష.సహకార బ్యాంకులు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలుగా నిలుస్తున్నాయి.చిన్న వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలకు సహకార బ్యాంకులే ప్రధాన అండ.తెలంగాణలో పెట్టుబడులు, పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నాం.డిజిటల్ సేవలు, పారదర్శకత, ప్రజల విశ్వాసమే బ్యాంకుల విజయానికి మూలధనం.యువ పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లు, మహిళా వ్యాపారవేత్తలకు మరింత ప్రోత్సాహం అవసరం.సమాజ సేవ, ఆర్థిక క్రమశిక్షణతో అగ్రసేన్ బ్యాంక్ మరిన్ని విజయాలు సాధించాలి.దేశంలోనే అత్యుత్తమ సహకార బ్యాంకుల్లో అగ్రసేన్ బ్యాంక్ ఒకటిగా ఎదగాలని ఆకాంక్ష .

## షష్టిపూర్తి మహోత్సవం జరుపుకున్న సీనియర్ పాత్రికేయులు, డబ్ల్యూ జే ఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ రావికంటి శ్రీనివాస్ గారికి డబ్ల్యూజేఐ తెలంగాణ రాష్ట్ర శాఖ ఘనమైన అభినందనలు తెలియజేస్తుంది




**హైదరాబాద్ వెలుతురు జూలై 19:**

భారతీయ సనాతన సంప్రదాయంలో షష్టిపూర్తి (60వ జన్మదిన మహోత్సవం) అనేది అత్యంత పవిత్రమైన జీవన ఘట్టం. అరవై సంవత్సరాల జీవిత ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసి, దాంపత్య జీవితానికి పునరంకితం అవుతూ, ఆరోగ్యం, ఆయురారోగ్యం, ఐశ్వర్యం, ఆధ్యాత్మిక వికాసం, కుటుంబ శ్రేయస్సు కోసం వేదోక్తంగా నిర్వహించే ఈ మహోత్సవం నూతన జీవనయాత్రకు శ్రీకారం చుడుతుందని శాస్త్రాలు పేర్కొంటాయి. ఈ మహోత్సవంలో దంపతులను సమాన గౌరవంతో సత్కరించడం ద్వారా వారి జీవిత భాగస్వామ్యానికి, కుటుంబ నిర్మాణంలో వారి పాత్రకు సముచితమైన గుర్తింపు లభిస్తుంది.ఈ పవిత్రమైన షష్టిపూర్తి మహోత్సవాన్ని పురస్కరించుకుని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మఖన్‌లాల్ చతుర్వేది జాతీయ జర్నలిజం & కమ్యూనికేషన్ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు, సీనియర్ పాత్రికేయులు శ్రీ రావికంటి శ్రీనివాస్ గారికి డబ్ల్యూజేఐ తెలంగాణ రాష్ట్ర శాఖ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తోంది.మూడు దశాబ్దాలకు పైగా, దాదాపు 34 సంవత్సరాలుగా జర్నలిజాన్ని ఒక తపస్సుగా భావిస్తూ, ప్రముఖ ఈనాడు సంస్థలో విశిష్ట సేవలు అందించిన శ్రీ రావికంటి శ్రీనివాస్ గారు తన వృత్తి జీవితంలో అనేక ఉత్తమ పాత్రికేయ పురస్కారాలు అందుకున్నారు. నిష్పాక్షికత, విలువలు, ప్రజాహితం, వృత్తి నిబద్ధతకు ప్రతీకగా నిలుస్తూ యువ పాత్రికేయులకు ఆదర్శంగా నిలిచారు.జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి గౌరవం, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తూ, వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విశేష సేవలందిస్తున్నారు. అలాగే మఖన్‌లాల్ చతుర్వేది జర్నలిజం విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులుగా జర్నలిజం విద్యా ప్రమాణాల పెంపు, విలువల ఆధారిత పాత్రికేయత, మీడియా రంగ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను పాలకమండలిలో ప్రస్తావిస్తూ నిర్మాణాత్మక సూచనలు చేయడం ద్వారా తన ప్రత్యేక ముద్రను చాటుకున్నారు.ఈ విజయవంతమైన ప్రయాణంలో ఆయనకు అండగా నిలిచి, ప్రతి అడుగులో తోడుగా ఉన్న వారి సతీమణి గారి సేవలను, సహకారాన్ని ఈ సందర్భంగా డబ్ల్యూజేఐ తెలంగాణ రాష్ట్ర శాఖ ప్రత్యేకంగా అభినందిస్తోంది. కుటుంబ సహకారం లేకుండా ఏ వ్యక్తి ప్రజాజీవితంలో ఇంతటి ఉన్నత స్థానాన్ని చేరుకోవడం సాధ్యం కాదని పేర్కొంటూ, ఈ దంపతులకు ఆయురారోగ్యాలు, ఆనందం, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షిస్తోంది.ఈ సందర్భంగా డబ్ల్యూజేఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, సీనియర్ పాత్రికేయులు శ్రీ రాణా రాజు భయ్యా గారు, బాలకృష్ణ గారు రాష్ట్ర నాయకులు శ్రీ కామర్స్ బాలసుబ్రహ్మణ్యం గారు, శ్రీ కప్పర ప్రసాద్, డబ్ల్యూ జె సభ్యులు శ్రీ రావికంటి శ్రీనివాస్ గారిని సాదరంగా కలసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం కుటుంబ సభ్యుల సమక్షంలో ఆత్మీయ వాతావరణంలో జరిగింది.రాబోయే రోజుల్లో వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శ్రీ రావికంటి శ్రీనివాస్ గారిని మరింత ఘనంగా సన్మానించి, జర్నలిజం పట్ల ఆయన చూపుతున్న అంకితభావం, విలువల కోసం సాగిస్తున్న నిరంతర పోరాటాన్ని ఇప్పుడున్న రాబోవు జర్నలిస్టులకు ఆదర్శంగా నిలిపే కార్యక్రమాలు నిర్వహించే విధంగా సమిష్టి నిర్ణయం తీసుకొని ముందుకెళ్లాలని డబ్ల్యూజేఐ తెలంగాణ రాష్ట్ర శాఖ భావిస్తుంది.ఈ షష్టిపూర్తి మహోత్సవం సందర్భంగా శ్రీ రావికంటి శ్రీనివాస్ గారికి, వారి సతీమణి గారికి, కుటుంబ సభ్యులందరికీ భగవంతుడు దీర్ఘాయుష్షు, ఆయురారోగ్యాలు, సుఖశాంతులు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ, మరింత నూతన ఉత్సాహంతో, రెట్టింపు ఆత్మవిశ్వాసంతో జర్నలిజం, జర్నలిస్టుల సంక్షేమం కోసం ఆయన సేవలు నిరంతరం కొనసాగాలని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర శాఖ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తోంది.

## నేటి నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో బీసీల సమస్యలపై చర్చించాలి



- బీసీ ప్రధానిగా ఉన్న బీసీ సమస్యలు నెరవేరడం లేదు.
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్

**హైదరాబాద్ వెలుతురు జూలై 19:**

నేటి నుంచి (జూలై 20) ఆగస్టు 13 వరకు జరిగే వర్షాకాల సమావేశాల్లో బీసీల గురించి చర్చించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాలు కేవలం కొన్ని వర్గాల సమస్యల గురించి ప్రస్తావిస్తున్నాయని దేశంలో 60 శాతం పైగా ఉన్న బీసీల గురించి ప్రస్తావించకపోవడం బాధాకరం అన్నారు. చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ స్థాయిలో బీసీ కుల గణన చేయాలని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు ఒక బీసీ ప్రధానిగా నరేంద్ర మోడీ ఉన్న బీసీల సమస్యలు నెరవేరడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు రాంబాబు యాదవ్ రమేష్ ముదిరాజ్ సోమయ్య కిరణ్ అనిత మాధవి నాగమణి వంశీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## సైబరాబాద్ లో వీకెండ్–స్పెషల్ డ్రంక్ & డ్రైవ్..237 మందిపై కేసులు



**సైబరాబాద్ వెలుతురు జూలై 19:**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ ADCP అడ్మిన్, జి నరేందర్ తెలిపారు.ఈ డ్రైవ్‌లో భాగంగా 237 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.205 ద్విచక్ర వాహనదారులు,04 ఆటోలు,28 కార్లు, 00 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి.బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే —–219 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, –05 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, –13 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు.వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరు పర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు.మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత –2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది.గత వారం (13.07.2026 – 18.07.2026) లో 309 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి.05 మందికి జరిమానా, జైలు శిక్ష, 01 మందికి జరిమానా, సోషల్ సర్వీస్,303 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

## ఎస్ ఐఆర్ పై జరిగిన జూమ్ సమావేశంలో పాల్గొన్న మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్ వెలుతురు జూలై 19:**

ఎస్.ఐ.ఆర్ పైన టీపీసీసీ అధ్వర్యంలో జరిగిన జూమ్ సమావేశంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొని,ప్రస్తుతం జరుగుతున్న S.I.R ప్రక్రియ,బిఎల్ఏ ల అప్రమత్తత, ఇంచార్జీల సమన్వయం,బాధ్యుల పర్యవేక్షణ వంటి వాటిపై పలు సూచనలు చేశారు. ఈ జూమ్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డీప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ "సర్" పట్ల పూర్తి అప్రమత్తంగా ఉండాలని పలు కీలక అంశాలు ప్రస్తావించారు.పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీ లు, నియోజక వర్గ ఇంచార్జ్ లు, sir కో ఆర్డినెటర్స్ పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు.

# విద్యార్థుల సురక్షిత రవాణాకు సైబరాబాద్ పోలీసుల వినూత్న ముందడుగు





- స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్ (SMP)లో భాగంగా క్యాంపస్ కంప్లయెన్స్ వర్క్‌షాప్ - స్టూడెంట్ పోర్టల్ ప్రారంభం

**సైబరాబాద్ వెలుతురు జూలై 19:**

విద్యార్థులు ఇంటి నుంచి విద్యాసంస్థలకు, తిరిగి సురక్షితంగా ఇంటికి చేరుకునేలా సమగ్ర, క్రమబద్ధమైన మరియు సురక్షిత రవాణా వ్యవస్థను రూపొందించేందుకు సైబరాబాద్ పోలీసులు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్ (Student Mobility Programme – SMP)లో భాగంగా ఈ రోజు ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ, గచ్చిబౌలి లో క్యాంపస్ కంప్లయెన్స్ వర్క్‌షాప్ను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థలు మరియు ప్రభుత్వ శాఖలను ఒకే డిజిటల్ వేదికపై అనుసంధానించే స్టూడెంట్ పోర్టల్ను కూడా ప్రారంభించారు.ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, మాట్లాడుతూ, విద్యార్థుల భద్రత ప్రతి ఒక్కరి ఉమ్మడి బాధ్యత అని అన్నారు. విద్యార్థులు ఇంటి నుంచి పాఠశాలకు, తిరిగి ఇంటికి చేరుకునే మొత్తం ప్రయాణం సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్ కేవలం ట్రాఫిక్ నిర్వహణ కార్యక్రమం మాత్రమే కాకుండా, విద్యార్థుల ప్రాణ భద్రతకు సంబంధించిన సమగ్ర కార్యక్రమమని తెలిపారు. విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, రవాణా నిర్వాహకులు, పోలీస్, రవాణా శాఖ, విద్యాశాఖ, TGSRTC తదితర అన్ని భాగస్వామ్య సంస్థలు సమన్వయంతో పనిచేస్తేనే విద్యార్థులకు సురక్షితమైన రవాణా వ్యవస్థను అందించగలమని చెప్పారు. ప్రతి విద్యాసంస్థ విద్యార్థుల రవాణాకు సంబంధించిన ప్రామాణిక విధానాలు (SOPలు) తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు.సైబరాబాద్ లోని 520కు పైగా విద్యాసంస్థల్లో సమగ్ర సర్వే, 750కు పైగా విద్యాసంస్థల ప్రతినిధులతో సంప్రదింపులు, అలాగే 500కు పైగా విద్యార్థులతో విజయవంతంగా నిర్వహించిన పైలట్ ప్రాజెక్ట్ అనంతరం ఈ క్యాంపస్ కంప్లయెన్స్ వర్క్‌షాప్‌ను నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

ఈ అధ్యయనాల ఆధారంగా విద్యార్థుల ప్రయాణంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారాలను రూపొందించేందుకు స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్ రూపుదిద్దుకున్నట్లు వివరించారు.

వర్క్‌షాప్‌లో "సేఫ్ స్టూడెంట్ మొబిలిటీ కారిడార్స్" ఏర్పాటు, విద్యార్థుల రవాణా భద్రత, విద్యాసంస్థల పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనల అమలు, పాఠశాలలు–తల్లిదండ్రులు–రవాణా నిర్వాహకులు–పోలీస్–RTA/RTO–రవాణా శాఖ–విద్యాశాఖ–TGSRTC మధ్య సమర్థవంతమైన సమన్వయం, ప్రామాణిక విధానాలు (SOPలు), బాధ్యతాయుత నిర్వహణ, ఉత్తమ కార్యాచరణ విధానాల అమలుపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా ప్రారంభించిన స్టూడెంట్ పోర్టల్ ద్వారా విద్యాసంస్థలు మరియు ప్రభుత్వ శాఖలు ఒకే డిజిటల్ వేదికపై అనుసంధానమై విద్యార్థుల రవాణా భద్రత, సమస్యల పరిష్కారం, సమాచార మార్పిడి, సేవల సమన్వయం మరియు పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం కల్పించబడుతుందని అధికారులు తెలిపారు.స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్ ద్వారా సురక్షితమైన, క్రమబద్ధమైన, జవాబుదారీతనం కలిగిన విద్యార్థుల రవాణా వ్యవస్థను ఏర్పాటు చేసి, సైబరాబాద్‌ను దేశానికి ఆదర్శవంతమైన స్టూడెంట్ మొబిలిటీ మోడల్‌గా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్, డీసీపీ కూకట్‌పల్లి శ్రీమతి రితిరాజ్, డీసీపీ ట్రాఫిక్ ఎస్. రవికుమార్, గ్రేటర్ హైదరాబాద్ TGSRTC ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ. శ్రీధర్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ శ్యామ్, సంగమిత్ర స్కూల్ కరస్పాండెంట్ శ్రీమతి అరుంధతి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, విద్యాసంస్థల ప్రతినిధులు, రవాణా నిర్వాహకులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీభవన్ కు రావొద్దు.. జనంలో తిరగండి

- **అలంపూర్, ఆర్మూర్, ఆసిఫాబాద్, బహదూర్‌పూర్ పనితీరుపై తీవ్ర అసంతృప్తి**
- **52 నియోజకవర్గాల్లో మంచి పనితీరు.. 21 చోట్ల అసంతృప్తికర పరిస్థితి**
- **జూలై 30న అసెంబ్లీ వారీగా మరోసారి సమగ్ర సమీక్ష నిర్వహిస్తామని వెల్లడి**
- **ఉత్తమంగా పనిచేసే 100 మంది బీఎల్‌ఏలకు రాహుల్ గాంధీని కలిసే అవకాశం**

**హైదరాబాద్, వెలుతురు జూలై 2026:**

హైదరాబాద్‌లో కాదు... ప్రజల మధ్య ఉండండి.. గాంధీభవన్‌కు రావద్దు.." అంటూ కాంగ్రెస్ శ్రేణులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన సందేశం ఇచ్చారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే లక్ష్యంగా రేపటి నుంచి ఆగస్టు 3 వరకు ప్రతి నాయకుడు నియోజకవర్గంలోనే ఉండాలని ఆదేశించారు. పనితీరు బాగోలేని నియోజకవర్గాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూనే, పదవుల కోసం పైరవీలు చేసే నేతలకు తలుపులు మూసేయాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంతో పాటు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీ శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. రేపటి (జూలై 20) నుంచి ఆగస్టు 3 వరకు పార్టీ నాయకులంతా పూర్తిగా క్షేత్రస్థాయిలోనే ఉండాలని, ఈ వ్యవధిలో గాంధీభవన్‌కు రావొద్దని ఆదేశించారు. ఆదివారం కాంగ్రెస్ నేతలతో నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆయన ఈ మేరకు కఠిన ఆదేశాలు జారీ చేశారు.నాయకులంతా ఎన్నికల ప్రచారం తరహాలో గ్రామాలు, వార్డులు, బూత్‌లలో విస్తృతంగా పర్యటించాలని సీఎం సూచించారు. కొందరు నాయకులు హైదరాబాద్‌లోనే ఉండి పార్టీ పనులను నిర్లక్ష్యం చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్ చుట్టూ తిరుగుతూ పదవుల కోసం పైరవీలు చేయడం ఇకపై సహించబోమని హెచ్చరించారు. చైర్మన్ పదవులు, పార్టీ పోస్టుల కోసం గాంధీభవన్ చుట్టూ తిరిగే వారికి అపాయింట్‌మెంట్లు ఇవ్వొద్దని పార్టీ నాయకత్వానికి స్పష్టం చేశారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) గడువును ఆగస్టు 3 వరకు పొడిగించిన నేపథ్యంలో దానిని కాంగ్రెస్ పార్టీకి అవకాశంగా మలచుకోవాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ ఆధ్వర్యంలో 489 సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. పనితీరు వెనుకబడిన నియోజకవర్గాల్లో నాయకులు వెంటనే చురుగ్గా పని చేయాలని ఆదేశించారు.సోమవారం నుంచి పది మంది ఇన్‌చార్జ్ మంత్రులు అన్ని జిల్లాల్లో ఎస్ఐఆర్‌పై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తారని తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న ఎంపీలు కూడా తమకు అప్పగించిన నియోజకవర్గాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తున్న ప్రాంతాల్లో ఎంపీలు ఆశించిన స్థాయిలో పనిచేయకపోతే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.బీఎల్‌ఓల నివేదికల కంటే పార్టీ నియమించిన బీఎల్‌ఏల నివేదికలనే ప్రధానంగా పరిగణించాలని సీఎం స్పష్టం చేశారు. బీఎల్‌ఓల సమాచారంపై మాత్రమే ఆధారపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. బీఎల్‌ఏలను సమర్థంగా వినియోగించుకోవాలని, మంత్రులు,



ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు, కార్పొరేషన్ చైర్మన్లు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. బీఎల్‌ఏ, బీఎల్‌ఓ నివేదికలను గాంధీభవన్ బృందం నిరంతరం పరిశీలించాలని చెప్పారు.ఎస్ఐఆర్ కార్యక్రమంపై ఇన్‌చార్జ్ మంత్రులదే పూర్తి బాధ్యత అని తేల్చిచెప్పిన సీఎం, ఈ నెల 30న అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా మరోసారి సమగ్ర సమీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమన్వయ బాధ్యతలను మరింత సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. అత్యుత్తమంగా పనిచేసే 100 మంది బీఎల్‌ఏలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసి ఫొటో దిగే అవకాశం కల్పిస్తామని తెలిపారు.సమావేశంలో నియోజకవర్గాల పనితీరుపై సమగ్ర నివేదికను కూడా సీఎం పరిశీలించారు. అలంపూర్, ఆర్మూర్, ఆసిఫాబాద్, బహదూర్‌పూర్ నియోజకవర్గాల్లో పార్టీ కార్యకలాపాలు అత్యంత బలహీనంగా ఉన్నాయని నివేదికలో తేలడంతో సంబంధిత ఇన్‌చార్జీలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు 52 నియోజకవర్గాల్లో పనితీరు బాగుందని, 42 నియోజకవర్గాల్లో మధ్యస్థంగా ఉందని, 21 నియోజకవర్గాల్లో ఇంకా మెరుగుదల అవసరమని పేర్కొన్నారు. పనితీరు సరిగా లేని నాయకులపై అవసరమైతే కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి వెనుకాడబోమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# అఖిలపక్ష సమావేశం నుంచి విపక్షాల వాకౌట్

- **టీఎంసీ తిరుగుబాటు ఎంపీలకు ఆహ్వానంపై నిరసన..**
- **పార్లమెంట్ సమావేశాల ముందే రాజకీయ వేడి**
- **రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం**
- **కాంగ్రెస్, టీఎంసీ, ఎస్పీ, డీఎంకే సహా ఇండియా కూటమి పార్టీల వాకౌట్**
- **తిరుగుబాటు ఎంపీలకు ఆహ్వానంపై టీఎంసీ తీవ్ర అభ్యంతరం**
- **రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకే వాకౌట్ చేశామని విపక్షాల స్పష్టీకరణ**
- **పార్లమెంట్ సమావేశాల విజయవంతానికి సహకరించాలని కేంద్రం విజ్ఞప్తి**
- **తెలుగు రాష్ట్రాల నుంచి పలు పార్టీల ఎంపీలు హాజరు**

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 2026:**

సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదివారం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం), నేషనల్ కాన్ఫరెన్స్, శివసేన (యూబీటీ), ఆమ్ ఆద్మీ పార్టీతో పాటు ఇతర విపక్ష పార్టీలు సమావేశం నుంచి వాకౌట్ చేశాయి.టీఎంసీకి చెందిన 20 మంది తిరుగుబాటు ఎంపీలకు అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానం పంపడాన్ని నిరసిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు విపక్షాలు వెల్లడించాయి. టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా




మాట్లాడుతూ.. తిరుగుబాటు ఎంపీల విలీనాన్ని లోక్‌సభ స్పీకర్ ఇప్పటి వరకు ఆమోదించలేదని చెప్పారు. టేబుల్ ఆఫీస్ అధికారిక జాబితాలో టీఎంసీ బలం ఇప్పటికీ 28 మంది సభ్యులుగానే ఉందని పేర్కొన్నారు. 91వ రాజ్యాంగ సవరణ ప్రకారం ప్రత్యేక కూటమిగా గుర్తింపు పొందే పరిస్థితి లేదని ఆమె వివరించారు.కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ప్రమోద్ తివారీ మాట్లాడుతూ.. స్పీకర్ తుది నిర్ణయం తీసుకోకముందే టీఎంసీ సభ్యుల సంఖ్యను తగ్గించి చూపడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకే విపక్షాలు సమావేశం నుంచి వాకౌట్ చేశాయని తెలిపారు.మరోవైపు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సజావుగా, ఫలవంతంగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కేంద్ర ప్రభుత్వం కోరింది. ప్రజలకు సంబంధించిన కీలక అంశాలపై సభల్లో నిర్మాణాత్మక చర్చలు జరగాలని కేంద్ర మంత్రులు అభిప్రాయపడ్డారు.ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జేపీ నడ్డా, అర్జున్ రామ్ మేఘవాల్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి తెలుగుదేశం పార్టీకి చెందిన లావు శ్రీకృష్ణదేవరాయలు, జనసేనకు చెందిన బాలశౌరి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మిథున్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, బీఆర్ఎస్‌కు చెందిన వద్దిరాజు రవిచంద్ర పాల్గొన్నారు. రేపటి నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో పలు కీలక బిల్లులు, జాతీయ అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది.

# విశాఖలో ఘోర రోడ్డు ప్రమాదం..

- **లారీని ఢీకొన్న కారు**
- **నలుగురు అక్కడికక్కడే మృతి.. ఒకరికి తీవ్ర గాయాలు**
- **శుభకార్యానికి వెళ్తుండగా విషాదం.. మృతుల్లో 11 ఏళ్ల బాలుడు**
- **క్షతగాత్రుడికి మెరుగైన వైద్యం అందించాలని హోంమంత్రి అనిత ఆదేశం**

**విశాఖపట్నం వెలుతురు జూలై 2026:**



విశాఖపట్నం జిల్లా పెందుర్తి–ఆనందపురం జాతీయ రహదారిపై గండిగుండ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళ్తున్న కారు ముందుగా వెళ్తున్న లారీని ఢీకొనడంతో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడగా, ఆయనను భీమిలి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా ఈపూరు మండలం ఇనుమెళ్ల గ్రామానికి చెందిన పాలగాని రామాంజినేయులు, షేక్ మీరావలి, మందపాటి చంద్రశేఖర్, ఆయన కుమారుడు మందపాటి భవానీశంకర్, నరసరావుపేటకు చెందిన కారు డ్రైవర్ శ్రీను కలిసి శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో జరిగే ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు కారులో బయలుదేరారు.ఆనందపురం సమీపంలోని గండిగుండ వద్దకు చేరుకున్న సమయంలో కారు ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో అదుపుతప్పి ముందుగా వెళ్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో కారులోని నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు.ఈ ప్రమాదంలో పాలగాని రామాంజినేయులు (51), షేక్ మీరావలి (56), మందపాటి భవానీశంకర్ (11), కారు డ్రైవర్ శ్రీను ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన మందపాటి చంద్రశేఖర్‌ను స్థానికులు, పోలీసులు వెంటనే భీమిలి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు చికిత్స కొనసాగుతోంది. చంద్రశేఖర్ పల్నాడు జిల్లా నరసరావుపేటలోని అమూల్య నర్సింగ్ హోమ్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం.ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి

గండిగుండ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందడంపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై విశాఖ జిల్లా అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన చంద్రశేఖర్‌కు అత్యుత్తమ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# అనకాపల్లి నుంచి అయోధ్య, కాశీకి ప్రత్యేక రైలు

- **జెండా ఊపి ప్రారంభించిన ఎంపీ సీఎం రమేష్**
- **20 బోగీల్లో 1,500 మంది భక్తులతో తొలి యాత్ర ప్రారంభం**
- **ఎన్నికల హామీ మేరకే ఈ కార్యక్రమం చేపట్టామని వెల్లడి**
- **ప్రధాని మోదీ సూచనతో అయోధ్యతో పాటు కాశీ దర్శనం**
- **త్వరలో మరో ప్రత్యేక రైలును కూడా నడుపుతామని ప్రకటన**

**అనకాపల్లి వెలుతురు జూలై 2026:**

అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల కోసం అయోధ్య, కాశీ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక రైలును ఆదివారం ఉదయం ప్రారంభించారు. రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో ఎమ్మెల్యేలతో కలిసి జెండా ఊపి రైలును ప్రారంభించారు. భక్తులు జై శ్రీరామ్ నినాదాల మధ్య ఉత్సాహంగా యాత్రను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చే క్రమంలోనే ఈ ప్రత్యేక రైలును అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు అయోధ్యలో శ్రీరామ జన్మభూమి, కాశీలో కాశీ విశ్వనాథుడి దర్శనం కల్పించడం తమ లక్ష్యమన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచన మేరకు అయోధ్యతో పాటు కాశీని కూడా యాత్రలో చేర్చినట్లు వెల్లడించారు.20 బోగీలతో కూడిన ఈ ప్రత్యేక రైలులో సుమారు 1,500 మంది భక్తులు ప్రయాణిస్తున్నారని తెలిపారు. ఈ యాత్ర ఐదు రోజుల పాటు కొనసాగుతుందని, భక్తులు సురక్షితంగా, సౌకర్యవంతంగా దర్శనాలు చేసుకునేలా అన్ని



ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ప్రయాణంలో భోజనం, తాగునీరు, వైద్య సదుపాయాలు, భద్రతతో పాటు అవసరమైన ఇతర సౌకర్యాలను కూడా కల్పించినట్లు పేర్కొన్నారు.ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, త్వరలోనే మరో ప్రత్యేక రైలును కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎంపీ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తారని చెప్పారు.అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని సీఎం రమేష్ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రహదారులు, రైల్వే, పారిశ్రామిక, ఆధ్యాత్మిక రంగాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేష్‌బాబు, కేఎస్ఎన్ రాజు, కార్పొరేషన్ చైర్మన్లు, కూటమి నాయకులు, రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వాంగ్‌చుక్‌ను ప్రైవేట్ ఆసుపత్రికి

- **తరలించేందుకు అవకాశం ఇవ్వండి**
- **హైకోర్టును ఆశ్రయించిన భార్య గీతాంజలి ఆంగ్మో**
- **సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో పోలీసులు మోహరించారని ఆరోపణ**
- **వ్యక్తిగత వైద్యులు, న్యాయవాదులను కలిసే అవకాశం ఇవ్వాలని పిటిషన్**
- **ఆసుపత్రిలోనే నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారని భార్య వెల్లడి**
- **భారీ పోలీసు బందోబస్తు మధ్య చికిత్స కొనసాగుతోందని ఆందోళన**

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 2026:**




పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి ఆంగ్మో ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన భర్తను వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తరలించేందుకు అనుమతి ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఆయనను అక్రమంగా నిర్బంధించారని ఆరోపించారు. అలాగే, ఆయనకు చికిత్స అందించిన వ్యక్తిగత వైద్యులు, న్యాయవాదులను కలిసే అవకాశం కల్పించాలని కోర్టును కోరారు.21 రోజులుగా కొనసాగుతున్న నిరాహార దీక్షా శిబిరం నుంచి పోలీసులు శనివారం సోనమ్ వాంగ్‌చుక్‌ను సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించిన విషయం తెలిసిందే. అయితే ఆసుపత్రిలోనే ఆయన నిరాహార దీక్షను కొనసాగిస్తున్నారని గీతాంజలి ఆంగ్మో తెలిపారు. చికిత్స విషయంలో ఆసుపత్రి యాజమాన్యం పారదర్శకంగా వ్యవహరించడం లేదని, అందుతున్న వైద్య సేవలపై తమకు అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. దీంతో సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిపై తమకు నమ్మకం కోల్పోయిందన్నారు.వాంగ్‌చుక్‌ను డిశ్చార్జ్ చేసి, తమకు నచ్చిన ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాలని కోరినా అధికారులు నిరాకరించారని ఆమె తెలిపారు. అలాగే, ఆయనను వ్యక్తిగత వైద్యులు, న్యాయవాదులు కలిసేందుకు కూడా అనుమతి ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇది ఆయన హక్కులకు భంగం కలిగించడమేనని పిటిషన్‌లో పేర్కొన్నారు.ఆసుపత్రిలో తనపై కూడా పలు ఆంక్షలు విధించారని గీతాంజలి ఆంగ్మో తెలిపారు. వంద మందికి పైగా పోలీసులు ఆసుపత్రిలో మోహరించి ఉన్నారని, వాంగ్‌చుక్ చికిత్స పొందుతున్న అంతస్తులోనే సుమారు 30 మంది పోలీసు సిబ్బంది ఉన్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో తన భర్త ఆరోగ్య పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తరలించేలా ఆదేశాలు ఇవ్వాలని ఢిల్లీ హైకోర్టును ఆమె కోరారు.

# బూతు మాటలు అశ్లీలం కాదు..

- సుప్రీం కోర్టు సంచలన తీర్పు
- పోక్సో చట్టం దుర్వినియోగంపై ఆందోళన

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 2026:**



దేశంలో మాట్లాడే మాటలు, వాడే పదజాలానికి సంబంధించిన చట్టపరమైన నిబంధనలపై భారత సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) ఒక అత్యంత కీలకమైన, చారిత్రాత్మకమైన తీర్పును వెలువరించింది. సమాజంలో ఎవరైనా వ్యక్తి ఇతరులపై బూతు మాటలు ఉపయోగించినా, తీవ్రంగా దూషించినా లేదా అసభ్య పదజాలం వాడినప్పటికీ.. ఆ మాటలు కేవలం సభ్యత లేనివిగా ఉన్నంత మాత్రాన వాటిని చట్టప్రకారం 'అశ్లీలత' నేరం కిందకు తీసుకురావడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సమాజంలో ఇటువంటి మాటలు ఎంత అభ్యంతరకరంగా అనిపించినప్పటికీ, వాటికి చట్టంలోని అశ్లీలత సెక్షన్లు వర్తించవని కోర్టు తేల్చి చెప్పింది.భారత శిక్షా స్మృతి (ఐపీసీ)లోని సెక్షన్ 294 కింద ఒక కింది కోర్టు (ట్రయల్ కోర్టు) తనకు విధించిన శిక్షను, ఆ తర్వాత హైకోర్టు సమర్థించడాన్ని సవాల్ చేస్తూ ఒక వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టుకు చెందిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సమగ్రంగా విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులు స్పందిస్తూ.. కేవలం కోపంతో తిట్టడం లేదా సమాజం అసభ్యకరంగా భావించే పదజాలం వాడడం మాత్రమే ఐపీసీ సెక్షన్ 294 కింద అశ్లీలత అనే పెద్ద నేరంగా రూపాంతరం చెందదని తమ తీర్పులో అత్యంత స్పష్టంగా పేర్కొన్నారు.ఒక వ్యక్తి మాట్లాడిన మాటలను లేదా వాడిన పదాన్ని చట్టప్రకారం అశ్లీలమైనదిగా ముద్ర వేయాలంటే దానికి కొన్ని ఖచ్చితమైన చట్టపరమైన ప్రమాణాలు ఉండాలని ధర్మాసనం వివరించింది. సదరు మాటలు విన్నవారిలో లేదా చూసినవారిలో కామ ప్రకోపాన్ని కలిగించేవిగా, వారిలో కామవాంఛలను తీవ్రంగా రేకెత్తించేవిగా ఉండాలని తెలిపింది. అంతేకాకుండా, సమాజంలోని పౌరుల మనస్సులను పూర్తిగా భ్రష్టు పట్టించేలా, వారి ఆలోచనలను చెడగొట్టేలా ఆ పదజాలం ఉంటేనే దానిని అశ్లీలత అనాలన్నారు. ప్రస్తుత ఫిర్యాదులో పేర్కొన్న దూషణల ఆరోపణలన్నీ నిజమేనని భావించినప్పటికీ, అవి కామవాంఛలను రేకెత్తించేవి కావు కాబట్టి వాటిని ఐపీసీ సెక్షన్ 294(బి) పరిధిలోకి తేవడం కుదరదన్నారు.ఈ కేసులో మరో ప్రధానమైన చట్టపరమైన లోపాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం ఎత్తిచూపింది. నిందితుడు వాడినట్లు చెబుతున్న బూతు మాటలు లేదా అసభ్య పదజాలం వల్ల సదరు బహిరంగ ప్రదేశంలో ఉన్న ఇతర సాధారణ ప్రజలకు గానీ, లేదా ముఖ్యంగా ఫిర్యాదుదారునికి గానీ తీవ్రమైన మానసిక అసౌకర్యం, ఇబ్బంది లేదా ఆందోళన కలిగిందనే విషయం కోర్టులో ఎక్కడా సాక్ష్యాధారాలతో రుజువు కాలేదని న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఐపీసీ సెక్షన్ 294(బి) కింద ఒకరిని దోషిగా తేల్చడానికి ఈ 'ఇబ్బంది కలగడం' అనే నిబంధన అత్యంత కీలకమైనదని, ఇది లేనప్పుడు సదరు సెక్షన్ కింద నేరం జరిగినట్లు పరిగణించడం చట్టవిరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది.ఈ వివాదం యొక్క నేపథ్యాన్ని పరిశీలిస్తే.. తమిళనాడు రాష్ట్రంలో 2017వ సంవత్సరం ఆగస్టు నెలలో ఒక వ్యవసాయ భూమికి సంబంధించిన యాజమాన్య హక్కుల విషయంలో తీవ్రమైన గొడవ జరిగింది. ఆ సమయంలో పిటిషనర్ అయిన వ్యక్తికి, అతడి స్వంత బావమరిదికి మధ్య తీవ్రమైన వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత, అదే భూమి విషయమై పిటిషనర్ తన మేనల్లుడితో మళ్లీ గొడవకు దిగాడు. ఈ గొడవ పెద్దదవుతున్న క్రమంలో బావమరిది మధ్యలో వచ్చి జోక్యం చేసుకున్నాడు. ఆ సమయంలో తీవ్ర ఆగ్రహానికి లోనైన పిటిషనర్ తన బావమరిదిని అసభ్య పదజాలంతో పాటు కులం పేరుతో దూషించాడనేది ప్రధాన ఆరోపణ.ఈ గొడవపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు కోర్టుకు చేరింది. దీనిపై విచారణ జరిపిన ట్రయల్ కోర్టు పిటిషనర్‌ను ఐపీసీ సెక్షన్ 294(బి) (అశ్లీలత), సెక్షన్ 326 (తీవ్రంగా గాయపరచడం), సెక్షన్ 506(ii) (క్రిమినల్ బెదిరింపు)తో పాటు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద దోషిగా తేల్చి శిక్ష విధించింది. దీనిని సవాల్ చేస్తూ పిటిషనర్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా.. హైకోర్టు అతనికి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద ఉన్న ఆరోపణల నుండి విముక్తి కల్పించి, నిర్దోషిగా విడుదల చేసింది. కానీ ఐపీసీ సెక్షన్ల కింద పడిన శిక్షలను మాత్రం అలాగే సమర్థించింది. ఈ నేపథ్యంలోనే సదరు పిటిషనర్ పూర్తి న్యాయం కోసం సుప్రీంకోర్టు తలుపు తట్టాడు.ఇదే సమయంలో సుప్రీంకోర్టు మరో కేసు విచారణ సందర్భంగా దేశంలో తీవ్ర దుర్వినియోగమవుతున్న పోక్సో చట్టంపై అత్యంత సంచలన వ్యాఖ్యలు చేసింది. యుక్త వయసులో ఉన్న ఒక అమ్మాయి, అబ్బాయి పరస్పరం ఇష్టపడి, ప్రేమించుకుని, తమ సమ్మతితో కలిసి ఇళ్లను వదిలి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నప్పుడు, వారిని ఒక రాష్ట్ర ప్రభుత్వం లేదా పోలీస్ వ్యవస్థ ఎలా అడ్డుకోగలదని న్యాయస్థానం నిలదీసింది. పిల్లలపై జరిగే లైంగిక దాడులు, క్రూరమైన లైంగిక దోపిడీలను అరికట్టడం కోసం పార్లమెంట్ తీసుకొచ్చిన ఈ అత్యంత కఠినమైన చట్టాన్ని, సమాజంలో జరిగే ప్రతి సాధారణ ప్రేమ వ్యవహారానికి వర్తింపజేస్తూ బూటకపు కేసులు పెట్టడం ఎంతవరకు సరైనదని ప్రశ్నించింది.సుప్రీంకోర్టుకు చెందిన గౌరవనీయ న్యాయమూర్తులు జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ఉన్నత స్థాయి ధర్మాసనం.. యుక్త వయస్కుల గోప్యత హక్కులు మరియు వారి రక్షణకు సంబంధించిన ఒక కేసును సుమోటోగా స్వీకరించి ఈ కీలక విచారణ చేపట్టింది. మానవ జీవితంలో 15 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు అనేది శారీరకంగా, మానసికంగా అత్యంత సున్నితమైన దశ అని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ యుక్త వయసులో యువతీ యువకులలో సహజంగానే పరస్పర ఆకర్షణలు, తీవ్రమైన భావోద్వేగాలు, ప్రేమ సంబంధాలు ఏర్పడుతుంటాయని, వీటిని నేరపూరిత కోణంలో చూస్తూ పోక్సో చట్టం కింద జైళ్లకు పంపడం వల్ల వారి జీవితాలు నాశనమవుతున్నాయని, ఈ ధోరణి మారాలని కోర్టు స్పష్టం చేసింది.

# ఇరాన్‌పై అమెరికా మరోసారి దాడులు..

- కువైట్‌లో అమెరికా స్థావరాలపై ఇరాన్ ప్రతీకారం
- వరుసగా ఎనిమిదో రాత్రి దాడులు జరిపిన అమెరికా
- ఐఆర్‌జీసీ సామర్థ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యమన్న సెంట్‌కామ్
- హర్మూజ్ జలసంధిలో ఇరాన్ ప్రభావాన్ని బలహీనపర్చే ప్రయత్నం
- ట్రంప్ ఆదేశాలతోనే ఆపరేషన్ నిర్వహించినట్లు వెల్లడి
- కువైట్‌లోని రెండు అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ డ్రోన్ దాడులు
- రాడార్ వ్యవస్థలు, మందుగుండు సామగ్రి కేంద్రాలను ధ్వంసం చేశామని ప్రకటన

**\వాషింగ్టన్/టెహ్రాన్ వెలుతురు జూలై 2026:**



ఇరాన్‌పై అమెరికా మరోసారి వైమానిక దాడులు చేపట్టింది. జోర్డాన్‌లో అమెరికా సైనికులపై జరిగిన దాడిలో ఇద్దరు సైనికులు మరణించిన నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు అమెరికా వెల్లడించింది. ఆదివారం రాత్రి నిర్వహించిన ఈ దాడులు వరుసగా ఎనిమిదో రోజు కొనసాగిన ఆపరేషన్‌లో భాగమని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) తెలిపింది.జోర్డాన్‌లో అమెరికా బలగాలపై దాడి చేసిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) అనుబంధ బలగాల సామర్థ్యాన్ని దెబ్బతీయడమే ఈ ఆపరేషన్ ప్రధాన లక్ష్యమని సెంట్‌కామ్ వెల్లడించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకే ఈ దాడులు నిర్వహించినట్లు పేర్కొంది. అలాగే హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలకు ముప్పు కలిగించే ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని మరింత బలహీనపర్చడమే తమ ఉద్దేశమని వివరించింది.మరోవైపు అమెరికా దాడులకు ప్రతీకారంగా కువైట్‌లోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడులు నిర్వహించినట్లు ఇరాన్ ప్రకటించింది. కువైట్‌లోని క్యాంప్ ఉద్దైరిలో ఉన్న మందుగుండు సామగ్రి నిల్వ కేంద్రాన్ని, అలీ అల్ సలేం ఎయిర్ బేస్‌లోని పేట్రియాట్ రాడార్ వ్యవస్థతో పాటు వైమానిక నిఘా రాడార్‌ను ధ్వంసం చేసినట్లు ఇరాన్ సైన్యం పేర్కొంది.అమెరికా చేపట్టిన వైమానిక దాడులకు ప్రతిస్పందనగానే ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు ఇరాన్ వెల్లడించింది. దీంతో అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్రరూపం దాల్చాయి. మధ్యప్రాచ్యంలో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారే అవకాశం ఉందని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# బహదూర్‌గూడలో 650 ఎకరాల భూముల స్వాధీనం వేగవంతం

- భారీ పోలీసు బందోబస్తు మధ్య ఫెన్సింగ్..
- పరిహారం కోసం రైతుల ఆందోళన కొనసాగింపు
- శంషాబాద్ సమీపంలో భూముల స్వాధీన ప్రక్రియ కొనసాగింపు
- అర్ధరాత్రి దీక్షా శిబిరాన్ని తొలగించిన అధికారులు




**రంగారెడ్డి వెలుతురు జూలై 2026:**

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని బహదూర్‌గూడ గ్రామంలో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం ప్రతిపాదించిన 650 ఎకరాల ప్రభుత్వ భూముల స్వాధీన ప్రక్రియ ఆదివారం కూడా కొనసాగింది. అధికారులు భూములను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకునే చర్యలను వేగవంతం చేయగా, హైడ్రా సిబ్బంది భూముల చుట్టూ ఫెన్సింగ్ పనులు చేపట్టారు.శనివారం అర్ధరాత్రి రైతులు ఏర్పాటు చేసిన దీక్షా శిబిరాన్ని అధికారులు తొలగించారు. అనంతరం అదే ప్రాంతంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి భూములను స్వాధీనంలోకి తీసుకునే ప్రక్రియను కొనసాగించారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారే అవకాశం ఉండటంతో బహదూర్‌గూడ గ్రామాన్ని పోలీసులు పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు.గ్రామంలో భారీగా పోలీసు బలగాలను మోహరించి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గ్రామంలోని ప్రధాన రహదారులతో పాటు భూముల పరిసర ప్రాంతాల్లో పోలీసులు పహారా కాస్తున్నారు. బయటి వ్యక్తులు గ్రామంలోకి ప్రవేశించకుండా ఆంక్షలు విధించారు.బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం 650 ఎకరాల భూమిని కేటాయించడాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తమ భూములను స్వాధీనం చేసుకోవాలంటే ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని, లేకపోతే భూమికి బదులుగా భూమిని కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తమతో చర్చించి న్యాయం చేయాలని కోరుతున్నారు.ఈ డిమాండ్లతో రైతులు గత ఎనిమిది రోజులుగా భూముల వద్ద నిరవధిక దీక్ష కొనసాగిస్తున్నారు. శనివారం భూముల వద్దకు ఫెన్సింగ్ పనుల కోసం వచ్చిన హైడ్రా సిబ్బందిని రైతులు అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకుని దీక్షా శిబిరాన్ని తొలగించారు. ప్రస్తుతం భారీ పోలీసు బందోబస్తు మధ్య అధికారులు ఫెన్సింగ్ పనులను కొనసాగిస్తున్నారు. రైతుల డిమాండ్లపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

# జపాన్ ఓపెన్‌లో పీవీ సింధు సంచలన విజయం

- అంతర్జాతీయ బ్యాడ్మింటన్ వేదికపై భారత జెండా
- జపాన్ ఓపెన్ టైటిల్‌ను ముద్దాడిన స్టార్ షట్లర్ సింధు

**టోక్యో వెలుతురు జూలై 2026:**



అంతర్జాతీయ బ్యాడ్మింటన్ రంగంలో భారత కీర్తి పతాకాన్ని ఎగురవేస్తూ మన తెలుగు తేజం, స్టార్ షట్లర్ పీవీ సింధు జపాన్ వేదికగా అద్భుత సంచలనం సృష్టించారు. ప్రతిష్టాత్మకమైన జపాన్ ఓపెన్ టోర్నమెంట్‌లో సరికొత్త శకానికి నాంది పలుకుతూ ఆమె చాంపియన్‌గా నిలిచారు. పీవీ సింధు సాధించిన ఈ చారిత్రాత్మక విజయంతో యావత్ భారతదేశం గర్వపడుతోంది. క్రీడా ప్రపంచంలో దేశ ప్రతిష్టను మరోస్థాయికి తీసుకెళ్లిన సింధుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అగ్ర నాయకత్వం, మంత్రులు ప్రశంసల వర్షం కురిపించారు.జపాన్ ఓపెన్ సూపర్ 750 టోర్నీ ఫైనల్స్ మ్యాచ్‌లో పీవీ సింధు ప్రదర్శించిన అసాధారణ ప్రతిభను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఈ తుది పోరులో జపాన్ స్టార్ క్రీడాకారిణి, బలమైన ప్రత్యర్థి అకానె యామగూచిని సింధు మట్టికరిపించారన్నారు. ఏమాత్రం తలవంచకుండా 21–17, 21–17 అనే వరుస సెట్ల తేడాతో ఘన విజయం సాధించి, క్రీడా చరిత్రలో సరికొత్త మైలురాయిని లిఖించారని సీఎం చంద్రబాబు కొనియాడారు. భారత బ్యాడ్మింటన్ రంగానికి ఇది ఒక సువర్ణ అధ్యాయమని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన సందేశంలో పీవీ సింధు భవిష్యత్తు ప్రణాళికలపై కూడా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత టోర్నమెంట్‌లో సింధు చూపించిన ఆటతీరు మరియు పట్టుదల అమోఘమని ప్రశంసించారు. ఇదే విధమైన అద్భుతమైన ఫామ్‌ను, జోరును రాబోయే అంతర్జాతీయ ఒలింపిక్స్ క్రీడల బరిలో కూడా కొనసాగించాలని ఆకాంక్షించారు. ఒలింపిక్స్ వేదికపై భారత జాతీయ గీతం మారుమోగేలా దేశానికి పసిడి (బంగారు) పతకాన్ని తీసుకురావాలని ఆకాంక్షిస్తూ పీవీ సింధుకు సీఎం చంద్రబాబు ముందస్తుగా 'ఆల్ ది బెస్ట్' చెప్పారు.జపాన్ ఓపెన్‌లో చారిత్రక విజయాన్ని నమోదు చేసిన పీవీ సింధుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన తన అధికారిక సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఒక ప్రత్యేక పోస్ట్‌ను పెట్టారు. ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారిణి యామగూచితో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సింధు ఆడిన తీరు ఎంతో అద్భుతంగా ఉందన్నారు. ఒత్తిడికి లోనవకుండా కోర్టులో ఆమె ప్రదర్శించిన నిర్భయమైన ఆటతీరు క్రీడాభిమానులను ఎంతగానో ఆకట్టుకుందని కొనియాడారు.డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పీవీ సింధు వ్యక్తిత్వాన్ని, క్రీడా స్ఫూర్తిని అభినందిస్తూ.. ఒక భారతీయ ఛాంపియన్‌కు ఉండాల్సిన అసలైన లక్షణాలు ఆమెలో పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. పీవీ సింధు చూపించిన తిరుగులేని పట్టుదల, గెలవాలనే దృఢ సంకల్పం, ఎంతటి కష్టాన్నైనా ఎదుర్కొనే అకుంఠిత స్ఫూర్తి దేశంలోని యువ క్రీడాకారులందరికీ నిజమైన నిదర్శనమని, మార్గదర్శకమని కొనియాడారు. ఈ విజయం ద్వారా యువతకు సింధు ఒక గొప్ప స్ఫూర్తి ప్రదాతగా నిలిచిందని జనసేనాని పవన్ కల్యాణ్ ప్రశంసించారు.రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ కూడా పీవీ సింధు సాధించిన అంతర్జాతీయ విజయంపై హర్షం వ్యక్తం చేశారు. భారత బ్యాడ్మింటన్ చరిత్రలో ఇంతకుముందెన్నడూ లేని విధంగా మన తెలుగు ఆడపడుచు పీవీ సింధు ప్రపంచ వేదికపై సరికొత్త రికార్డులను నెలకొల్పిందని ఆనందం వ్యక్తం చేశారు. ఫైనల్ మ్యాచ్ ప్రారంభం నుండి సింధు చూపించిన దూకుడు, పట్టుదల మరియు వ్యూహాత్మక దాడుల ముందు ప్రత్యర్థి యామగూచి ఏ దశలోనూ కనీస పోటీని కూడా ఇవ్వలేకపోయిందని, పూర్తిగా వెనుకబడిపోయిందని లోకేశ్ విశ్లేషించారు.మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. పీవీ సింధు తన సుదీర్ఘమైన క్రీడా కెరీర్‌లోనే మొట్టమొదటి సారిగా ఎంతో ప్రతిష్టాత్మకమైన జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్‌ను కైవసం చేసుకోవడం విశేషమన్నారు. ఈ టైటిల్ గెలవడం ద్వారా తన సత్తా ఏంటో అంతర్జాతీయ క్రీడా ప్రపంచానికి మరోసారి నిరూపించిందని చెప్పారు. క్రీడా రంగంలో సింధు సాధిస్తున్న ఈ అప్రతిహత విజయపరంపరపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు యావత్ దేశమంతా ఎంతో గర్విస్తోందని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు.రాష్ట్ర రవాణా, యువజన సంక్షేమ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పీవీ సింధు సాధించిన ఈ చారిత్రాత్మక విజయం పట్ల తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. జపాన్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకున్న మొట్టమొదటి భారతీయురాలిగా పీవీ సింధు సరికొత్త చరిత్ర సృష్టించిందని కొనియాడారు. సింధు తన అద్భుతమైన ఆటతీరుతో మన రాష్ట్రానికి, భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో మరోసారి అపారమైన గర్వకారణంగా నిలిచిందన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో ఆడి మరిన్ని అంతర్జాతీయ టైటిళ్లను, పతకాలను సొంతం చేసుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆకాంక్షించారు.

# ఫిఫా ఫైనల్‌ను ఆస్వాదించండి..

- ఫుట్‌బాల్ అభిమానులకు సీఎం రేవంత్ పిలుపు
- ఫుట్‌బాల్ యువతలో క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని పెంపొందించే క్రీడ
- మెస్సీని హైదరాబాద్‌కు తీసుకురావడం తెలంగాణ క్రీడా చరిత్రలో మైలురాయి
- భారత్ ఒకరోజు ఫిఫా వరల్డ్‌కప్ ఫైనల్స్‌లో ఆడుతుందన్న విశ్వాసం
- భవిష్యత్తులో ఫిఫా వరల్డ్‌కప్‌కు భారత్ ఆతిథ్యం ఇస్తుందన్న ఆశాభావం
- భారత ఫుట్‌బాల్‌లో తెలంగాణ యువత కీలక పాత్ర పోషిస్తారని వ్యాఖ్య
- క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి

**హైదరాబాద్, వెలుతురు జూలై 2026:**

ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫిఫా వరల్డ్‌కప్ ఫైనల్ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ అభిమానులకు ప్రత్యేక సందేశం ఇచ్చారు. ఫుట్‌బాల్ కేవలం ఒక ఆట మాత్రమే కాదని, యువతలో క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించే శక్తివంతమైన క్రీడ అని పేర్కొన్నారు. ప్రపంచ ఫుట్‌బాల్ మహోత్సవమైన ఫిఫా వరల్డ్‌కప్ ఫైనల్‌ను ఆస్వాదిస్తూ క్రీడాస్ఫూర్తిని గౌరవించాలని అభిమానులకు పిలుపునిచ్చారు.ఫుట్‌బాల్ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం తెలిపారు. ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీని హైదరాబాద్‌కు తీసుకురావడం తెలంగాణ క్రీడా చరిత్రలో మరపురాని ఘట్టమని గుర్తు చేశారు. అంతర్జాతీయ స్థాయి క్రీడలను రాష్ట్రానికి తీసుకురావడం ద్వారా యువతలో క్రీడలపై ఆసక్తి పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఫిఫా వరల్డ్‌కప్‌కు మద్దతు ఇవ్వడం వెనుక కేవలం క్రీడా ప్రోత్సాహమే కాకుండా, భారత ఫుట్‌బాల్ భవిష్యత్తుపై ఉన్న దూరదృష్టి కూడా ఉందని సీఎం అన్నారు. రాబోయే రోజుల్లో భారత్ ఫిఫా వరల్డ్‌కప్ ఫైనల్స్‌లో ఆడే స్థాయికి చేరుకుంటుందనే పూర్తి విశ్వాసం తనకు ఉందని చెప్పారు. అంతేకాకుండా, భవిష్యత్తులో ఫిఫా వరల్డ్‌కప్‌కు భారత్ ఆతిథ్యం కూడా ఇస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.భారత ఫుట్‌బాల్ అభివృద్ధిలో తెలంగాణ యువత కీలక పాత్ర పోషిస్తారని రేవంత్‌రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో భారత జట్టుకు తెలంగాణకు చెందిన ఆటగాళ్లు ప్రాతినిధ్యం వహిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా మౌలిక సదుపాయాలు, శిక్షణా వసతుల కల్పనకు తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. క్రీడలను కెరీర్‌గా ఎంచుకునే యువతకు అన్ని విధాలా అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.

# శ్రీ వెంకటేశ్వర కాలనీలో వైభవంగా పోచమ్మ తల్లి బోనాల జాతర

- అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు జూలై 19:**



కరీంనగర్ నగరంలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో శ్రీ వెంకటేశ్వర కాలనీ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీ పోచమ్మ తల్లి బోనాల జాతర మహోత్సవంలో నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న మేయర్‌కు ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.అనంతరం మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యంతో పాటు ఐక్యతను పెంపొందిస్తుందని అన్నారు. ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో ఈ వేడుకలను నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర కాలనీ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు.అమ్మవారి కృపాకటాక్షాలతో కరీంనగర్ నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. నగరంలోని అన్ని కాలనీల్లో ఇలాంటి సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 12వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి చొప్పలు జయశ్రీ వేణు గారు, శ్రీ వెంకటేశ్వర కాలనీ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, మహిళలు, యువకులు, భక్తులు, కాలనీ పెద్దలు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జాతీయ స్థాయిలో తెలుగు సినిమా జైత్రయాత్ర..

## 'కమిటీ కుర్రోళ్ళు'కు ఉత్తమ చిత్ర గౌరవం!




72వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో తెలుగు సినిమా తొమ్మిది అవార్డులతో సరికొత్త రికార్డు సృష్టించింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి మరింత దూకుడు ప్రదర్శించి జాతీయ స్థాయిలో తన ఖ్యాతిని చాటింది. ఈ పురస్కారాల్లో 'కమిటీ కుర్రోళ్ళు' ఉత్తమ తెలుగు చిత్రంగా నిలవడంతో పాటు, ఈ సినిమాకు గానూ పి.రవి కుమార్ ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ అవార్డును దక్కించుకున్నారు. మరోవైపు, భారీ చిత్రాలైన 'కల్కి 2898 ఏడీ', 'పుష్ప 2', '35 చిన్న కథ కాదు' సినిమాలు రెండేసి పురస్కారాలను సొంతం చేసుకున్నాయి. 'కల్కి 2898 ఏడీ' ఉత్తమ ప్రజాదరణ చిత్రంగా ఎంపికైంది. 'పుష్ప 2' చిత్రానికి గానూ సుకుమార్ ఉత్తమ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్) అవార్డు అందుకోగా, 'లక్కీ భాస్కర్' చిత్రానికి వెంకీ అట్లూరి ఉత్తమ సంభాషణల రచయితగా నిలిచారు. '35 చిన్న కథ కాదు' సినిమా ఉత్తమ బాలల చిత్రంగా ఎంపికవడమే కాకుండా, అరుణ్‌దేవ్ పోతుల ఉత్తమ బాల నటుడి అవార్డును గెలుచుకున్నాడు.
జాతీయ స్థాయిలో 'ఆర్టికల్ 370' ఉత్తమ చిత్రంగా నిలిచింది. మమ్ముట్టి (భ్రమయుగం), కార్తీక్ ఆర్యన్ (చందు ఛాంపియన్) సంయుక్తంగా ఉత్తమ నటులుగా ఎంపికవగా, యామీ గౌతమ్ (ఆర్టికల్ 370) ఉత్తమ నటిగా నిలిచారు. 'అమరన్' చిత్రానికి రాజ్ కుమార్ పెరియసామి ఉత్తమ దర్శకుడి అవార్డును సొంతం చేసుకున్నారు. తెలుగు సినిమా సాధించిన ఈ అద్భుత విజయాలపై సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, ఇది తెలుగువారందరికీ గర్వకారణమని కొనియాడారు.

# 'రూ.100 కోట్లు ఇచ్చినా సోషల్ మీడియాకు వెళ్లను': ఐశ్వర్య లక్ష్మి



'గట్టా కుస్తీ 2' విజయంతో జోరు మీదున్న నటి ఐశ్వర్య లక్ష్మి తాజాగా ఫెమినిజం, సోషల్ మీడియాపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బాక్సాఫీస్ వసూళ్ల కంటే ప్రేక్షకులు థియేటర్లలో నవ్వుతూ సినిమాను ఆస్వాదించడమే తనకు నిజమైన సంతృప్తిని ఇస్తుందని ఆమె పేర్కొన్నారు. స్త్రీ, పురుష సమానత్వాన్ని చాటిచెప్పే ఈ చిత్రంలో భార్య కలలకు అండగా నిలిచే భర్త పాత్రను ప్రియాంక చోప్రా-నిక్ జోనస్ దంపతులతో ఆమె పోల్చారు. కామెడీ చేయడం ఇష్టమని, అయితే అందులో తాను ఇంకా మెరుగుపడాల్సి ఉందన్నారు. ఇక సోషల్ మీడియాపై స్పందిస్తూ.. గతంలో మార్ఫింగ్ ఫొటోలు, ట్రోలింగ్ వల్ల తీవ్ర అసంతృప్తికి లోనయ్యానని, రోజుకు రూ.100 కోట్లు ఇచ్చినా ఇకపై సోషల్ మీడియా వైపు వెళ్లనని స్పష్టం చేశారు. ప్రస్తుతం తన పెంపుడు కుక్క (డాగ్) ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారానే కేవలం అప్‌డేట్స్ తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఆమె ఆనంద్ దర్శకత్వంలో లేడీ ఓరియెంటెడ్ పోలీస్ పాత్రలో నటిస్తూనే, 'తీవినయ్ పొట్రు', 'లవ్' అనే రెండు వెబ్ సిరీస్‌లతో పాటు బాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమవుతున్నారు.

# డ్యాన్సర్స్ అసోసియేషన్ వివాదానికి తెర.. వివరణ ఇచ్చిన జానీ మాస్టర్



డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో నెలకొన్న వివాదానికి తెరపడిందని ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ తెలిపారు. జానీ మాస్టర్ ఇచ్చిన వివరణతో ఫెడరేషన్ సంతృప్తి చెందిందని తెలిపారు. ఇకపై అంతా కలిసి కట్టుగా పనిచేయాలని నిర్ణయించుకున్నామన్నారు. ఈనెల 26న జనరల్‌బాడీ మీటింగ్‌లో తుది నిర్ణయం తీసుకుంటామని, ఆరోపణలు ఎదుర్కొంటున్న జనరల్ సెక్రటరీపై చర్యలు ఉంటాయన్నారు. అలాగే, సుమలత ఆధ్వర్యంలోనే అసోసియేషన్ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆదివారం నృత్యదర్శకుడు జానీ మాస్టర్, అసోసియేషన్ ప్రెసిడెంట్ సుమలతతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు.
ఈ సందర్భంగా జానీ మాస్టర్ మాట్లాడుతూ.. 'నా వివరణతో ఫెడరేషన్ సంతృప్తి చెందింది. ఈ వివాదం ఇంతటితో సద్దుమణిగిందని భావిస్తున్నా. వివాదాలతో డ్యాన్సర్లు చాలా ఇబ్బంది పడ్డారు. పరిశ్రమలో 24 క్రాఫ్ట్స్‌కి ఫెడరేషన్ అవసరం ఉంది. చిరంజీవిగారితో పాటు పెద్దలంతా మా బాధ అర్థం చేసుకున్నారు. నన్ను, శేఖర్ మాస్టర్‌ను కూర్చోబెట్టి చిరంజీవి మాట్లాడారు. యూనియన్ సమస్యను పరిష్కరించారు. బాలకృష్ణగారు కూడా సమస్యపై స్పందించి, అంతా సద్దుమణిగేలా చూడాలన్నారు' అని జానీ మాస్టర్ తెలిపారు. కార్మికుల కష్టం వారికే దక్కాలన్నదే తమ కోరిక అని అధ్యక్షురాలు సుమలత తెలిపారు. డ్యాన్సర్లు కట్టే రూ.100తోనే అసోసియేషన్ నడుస్తోందన్న ఆమె.. తాము కార్మికులకు అండగా నిలబడతామన్నారు.




# చరిత్ర సృష్టించిన రోహిత్-కోహ్లీ ద్వయం

## వన్డేల్లో ఆల్‌టైమ్ టాప్-2 జాబితాలోకి టీమిండియా జోడీ!

లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్‌తో జరిగిన ఉత్కంఠభరిత మూడో వన్డేలో భారత స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తమ అద్భుత భాగస్వామ్యంతో సరికొత్త మైలురాయిని అందుకున్నారు. వన్డే క్రికెట్ చరిత్రలోనే అత్యధిక వంద పరుగుల భాగస్వామ్యాలు నెలకొల్పిన జోడీల జాబితాలో వీరు రెండో స్థానానికి దూసుకెళ్లారు. ఈ మ్యాచ్‌లో వీరిద్దరూ కలిసి రెండో వికెట్‌కు కేవలం 86 బంతుల్లోనే 113 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దీనితో వన్డేల్లో వీరి 100+ భాగస్వామ్యాల సంఖ్య 21కి చేరింది. తద్వారా 20 సెంచరీ భాగస్వామ్యాలతో ఉన్న శ్రీలంక జోడీ కుమార్ సంగక్కర-తిలకరత్నె దిల్షాన్ రికార్డును వీరు అధిగమించారు. ప్రస్తుతం 26 సెంచరీ భాగస్వామ్యాలతో సచిన్ టెండూల్కర్-సౌరవ్ గంగూలీ జోడీ మాత్రమే వీరి కంటే ముందుంది.
ఈ చారిత్రక భాగస్వామ్యం వారిద్దరికీ ఒక ప్రత్యేకమైన మ్యాచ్‌లో రావడం గమనార్హం. రోహిత్, కోహ్లీ కలిసి ఆడిన 400వ అంతర్జాతీయ మ్యాచ్ ఇది. ఈ మైలురాయిని అందుకున్న మొట్టమొదటి భారతీయ జోడీగా వీరు రికార్డు సృష్టించారు. ఒకవైపు కోహ్లీ సహకారం అందించగా, మరోవైపు రోహిత్ శర్మ కేవలం 39 ఏళ్ల 80 రోజుల వయసులో 138 పరుగుల వీరోచిత ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఇన్నింగ్స్ ద్వారా లార్డ్స్ మైదానంలో వన్డే సెంచరీ చేసిన తొలి భారతీయ బ్యాటర్‌గా, అలాగే అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి సెంచరీ మార్క్‌ను అందుకున్న అత్యంత వృద్ధ భారతీయ ఆటగాడిగా రోహిత్ సరికొత్త రికార్డులు లిఖించాడు.
వ్యక్తిగతంగా కూడా అత్యధిక వన్డే సెంచరీ భాగస్వామ్యాల్లో పాలుపంచుకున్న ఆటగాళ్ల జాబితాలో కోహ్లీ 87 భాగస్వామ్యాలతో సచిన్ (99) తర్వాత రెండో స్థానంలో నిలవగా, రోహిత్ శర్మ 73 భాగస్వామ్యాలతో రికీ పాంటింగ్ (72) రికార్డును అధిగమించాడు. అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ జట్టు.. బెన్ డకెట్ (141), జాకబ్ బెథెల్ (91), జో రూట్ (నాటౌట్ 74) రాణించడంతో లార్డ్స్ వన్డే చరిత్రలోనే అత్యధిక స్కోరైన 387/3 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ ముందుంచింది. భారత వన్డే బ్యాటింగ్ చరిత్రలో ఈ జోడీ మరో సువర్ణ అధ్యాయాన్ని లిఖించింది.

# కుల్‌దీప్ యాదవ్‌ను పక్కనబెట్టడంపై అశ్విన్ తీవ్ర అసంతృప్తి

## స్పిన్నర్ ఆత్మవిశ్వాసం దెబ్బతింటుందని హెచ్చరిక



భారత చైనామన్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను జట్టు యాజమాన్యం వరుసగా పక్కనబెడుతుండటంపై టీమిండియా సీనియర్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కుల్‌దీప్ వంటి ప్రతిభావంతుడైన లెఫ్ట్ ఆర్మ్ రిస్ట్ స్పిన్నర్‌ను సుదీర్ఘ కాలం పాటు ప్లేయింగ్ ఎలెవన్ కు దూరం పెట్టడం వల్ల, అతని బౌలింగ్ లయ దెబ్బతినడమే కాకుండా ఆత్మవిశ్వాసం కూడా దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్‌తో జరుగుతున్న మూడో వన్డేలోనూ కుల్‌దీప్‌కు చోటు దక్కకపోవడంపై అశ్విన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ఈ కీలకమైన ఆఖరి వన్డేలో భారత్ ఇద్దరు ప్రధాన బౌలర్ల సేవలను కోల్పోయింది. మోకాలి గాయం కారణంగా పేస్ విలువల బల్లెం జస్ప్రీత్ బుమ్రా జట్టుకు దూరం కాగా, హ్యామ్‌స్ట్రింగ్ గాయంతో ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ అందుబాటులో లేరు. ఇద్దరు కీలక బౌలర్లు జట్టులో లేనప్పటికీ.. యాజమాన్యం నలుగురు ఫాస్ట్ బౌలర్లు, ఒకే ఒక్క స్పెషలిస్ట్ స్పిన్నర్ (అక్షర్ పటేల్)తో కూడిన పేస్-హెవీ అటాక్‌కే మొగ్గు చూపింది తప్ప, కుల్‌దీప్ యాదవ్‌ను జట్టులోకి తీసుకోలేదు.
ఈ నిర్ణయంపై స్పందిస్తూ అశ్విన్.. కుల్‌దీప్ పట్ల సానుభూతి వ్యక్తం చేశారు. సాధారణంగా జట్టులో కుల్‌దీప్‌ను ఆడించకపోవడానికి 7వ నంబర్ వరకే బ్యాటింగ్ ముగిసిపోతుందనే కారణాన్ని సమర్థనగా చెబుతుంటారని, కానీ ఈరోజు అర్ష్‌దీప్ సింగ్ 8వ నంబర్‌లో బ్యాటింగ్‌కు వస్తుండటాన్ని చూస్తే ఆశ్చర్యమేస్తోందని వ్యాఖ్యానించారు. బుమ్రా కూడా జట్టులో లేని ఇటువంటి పరిస్థితుల్లో కూడా అవకాశం ఇవ్వకపోతే కుల్‌దీప్ పరిస్థితి చూసి ఎవరికైనా బాధేస్తుందని, ఇటువంటి వరుస నిర్ణయాలు ఒక బౌలర్ రిథమ్‌ను, ఆత్మవిశ్వాసాన్ని ఖచ్చితంగా దెబ్బతీస్తాయని అశ్విన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.
ఈ ఇంగ్లాండ్ పర్యటనలో జరిగిన మూడు వన్డేల్లోనూ కుల్‌దీప్ యాదవ్‌కు నిరాశే ఎదురైంది. దీనికి ముందు జరిగిన టీ20 సిరీస్‌లోనూ అతనికి విశ్రాంతినిచ్చారు. ఇటీవల కాలంలో కుల్‌దీప్‌కు అవకాశాలు బాగా తగ్గిపోయాయి. ఆఫ్ఘనిస్తాన్‌తో స్వదేశంలో జరిగిన వన్డే సిరీస్‌లో కేవలం లక్నో వేదికగా జరిగిన ఒకే ఒక్క మ్యాచ్‌లో ఆడే అవకాశం రాగా, అందులో అతను 42 పరుగులిచ్చి వికెట్లేమీ సాధించలేకపోయాడు. జట్టుకు అదనపు బ్యాటింగ్ బలాన్ని అందిస్తారనే కారణంతోనే టీమ్ మేనేజ్‌మెంట్ అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌ల వైపు మొగ్గు చూపుతోంది. వన్డే ఫార్మాట్‌లో కుల్‌దీప్‌కు అద్భుతమైన వికెట్లు తీసే రికార్డు ఉన్నప్పటికీ, ఈ బ్యాటింగ్ లోతు అనే సమీకరణాల కారణంగా అతను వరుసగా బెంచ్‌కే పరిమితం కావలసి వస్తోంది.

# కొత్త ఆఫీస్ తెరిచిన ఏడాదికే.. ఏఐ తెచ్చిన ముప్పు

**టెక్సాస్ (అమెరికా) వెలుతురు జూలై 2026:**




ప్రపంచ టెక్ దిగ్గజం శాంసంగ్ (Samsung) కీలక నిర్ణయంతో ఒక్కసారిగా ఐటీ రంగంలో కలకలం రేగింది. మొబైల్స్, హోమ్ అప్లయెన్సెస్ మార్కెట్‌లో రారాజుగా వెలుగొందుతున్న ఈ దక్షిణ కొరియా కంపెనీ.. అమెరికాలో పనిచేస్తున్న తమ ఉద్యోగులపై లేఆఫ్స్ కత్తి దూసింది. శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ అమెరికా (SEA) తన ప్రధాన కార్యాలయాన్ని (హెడ్‌క్వార్టర్స్) న్యూజెర్సీ నుంచి టెక్సాస్‌కు మారుస్తున్న తరుణంలో ఈ భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. హెడ్‌క్వార్టర్స్ షిఫ్టింగ్ ప్రక్రియలో భాగంగా వందలాది మంది ఉద్యోగుల భవిష్యత్తు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.న్యూజెర్సీ, టెక్సాస్ ఆఫీసుల్లో లేఆఫ్స్ కలకలం అధికారిక సమాచారం ప్రకారం.. న్యూజెర్సీలోని ఎంగిల్‌వుడ్ క్లిఫ్స్ కార్యాలయంలో పనిచేస్తున్న దాదాపు 739 మంది ఉద్యోగులపై ఈ నిర్ణయం ప్రభావం చూపింది. ప్రధాన కార్యాలయాన్ని టెక్సాస్‌కు తరలిస్తున్న నేపథ్యంలో.. చాలా మందికి అక్కడికి మారిపోయే (Relocation) ఆప్షన్ ఇచ్చినప్పటికీ, నిరాకరించిన పలువురిని ఉద్యోగాల నుంచి తొలగించినట్లు తెలుస్తోంది. మరోవైపు టెక్సాస్‌లోని ప్లానో మొబైల్ డివిజన్ ఆఫీసులో కూడా దాదాపు 100 మందికి పైగా ఉద్యోగులకు కంపెనీ పింక్ స్లిప్పులు చేతికి ఇచ్చింది.ఇందులో సీనియర్ సేల్స్, మార్కెటింగ్.

# యూనివర్సిటీలు ఎందుకు పెట్టారు... వారి లక్ష్యాలు ఏమిటి..?

- **సుప్రీంకోర్టులో అఫిడవిట్ సమర్పించనున్న రాష్ట్ర ప్రభుత్వం**

**హైదరాబాద్ వెలుతురు జూలై 19:**

పెద్ద సంఖ్యలో ఏర్పాటవుతున్న ప్రైవేట్ యూనివర్సిటీల వెనుక ఉన్న అసలు ఉద్దేశాలు.. వాటిని ఏర్పాటు చేస్తున్న సంస్థలు/ వ్యక్తుల అసలు లక్ష్యాలు ఏమిటి..? ఆ యూనివర్సిటీల్లో బోధిస్తున్న వారికి ఉన్న విద్యార్హతలు ఏమిటి అనే దానిపై సర్వోన్నత న్యాయస్థానం దృష్టి సారించింది. అయేషా జైన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు విచారణలో తన దృష్టికి వచ్చిన అనేక ఫిర్యాదులను పరిశీలించిన సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా ప్రైవేట్ యూనివర్సిటీల్లో తనిఖీలకు ఆదేశించింది. ప్రైవేట్ యూనివర్సిటీలు ఏకపక్షంగా వ్యవహరిస్తుండడంతో అసలు వాటి ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశాలు మొదలు వాటిలో అందుతున్న విద్యా ప్రమాణాల స్థాయి వరకు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి పూర్తి వివరాలతో అఫిడవిట్లు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.

### సీసీఈ అధ్యక్షతన....

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ యూనివర్సిటీల్లో తనిఖీల కోసం కాలేజీయేట్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీలో కన్వీనర్‌గా తెలంగాణ ఉన్నత విద్యా మండలి (TGCHE) కార్యదర్శి, సభ్య కన్వీనర్‌గా జేఎన్‌టీయూ (JNTU) రిజిస్ట్రార్, సభ్యులుగా పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్, ఉస్మానియా యూనివర్సిటీ చీఫ్ ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్, టెక్నికల్ ఎడ్యుకేషన్ విద్యా కమిషనర్ అసిస్టెంట్ డైరెక్టర్ (అకడమిక్–సి)లను నియమించింది. అవసరమైతే ఒక సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌ను నియమించుకునే అవకాశం కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఈ కమిటీ రాష్ట్రంలోని ప్రతి ప్రైవేట్ యూనివర్సిటీని సందర్శించి క్షుణ్ణంగా తనిఖీలు చేస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశించిన 9 అంశాలపై ఈ కమిటీ తనిఖీలు చేపడుతోంది.

### 9 అంశాలపై తనిఖీ....

ప్రైవేట్ యూనివర్సిటీలకు సంబంధించి 9 అంశాలపై సమగ్ర వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

### సుప్రీంకోర్టు వివరణ కోరిన అంశాలు...



1. అసలు యూనివర్సిటీ ఎందుకు ఏర్పాటు చేశారు. దాని ఏర్పాటుకు కారణాలు, ఉద్దేశాలు ఏమిటి? యూనివర్సిటీ ఏర్పాటుకు ముందు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేశారా? స్థాపనకు ముందు ఏమైనా విధానపరమైన పరిశీలన (పాలసీ కన్సిడరేషన్) చేశారా? లేదా?

2. యూనివర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం ఏమైనా భూ కేటాయింపు చేసిందా? యూనివర్సిటీకి కల్పించిన ఇతర ప్రయోజనాలు.. అందుకు విధించిన నిబంధనలు, షరతులు ఏమిటి?

3. యూనివర్సిటీని వాస్తవంగా నిర్వహిస్తున్న సొసైటీ, సంస్థ, వ్యక్తి ధ్యేయం ఏమిటి?. యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీలో ఉన్న సభ్యులు ఎవరు? ఆ సభ్యులను ఎలా ఎంపిక చేశారు. యూనివర్సిటీని వాస్తవంగా నిర్వహిస్తున్న వ్యక్తి, మేనేజ్‌మెంట్ కమిటీలో సభ్యుల సమగ్ర వివరాలు.

4. విద్యార్థులు యూనివర్సిటీలో చేరడానికి ఏ విధానం అవలంభిస్తున్నారు. ఎంట్రన్స్‌కు సంబంధించిన ప్రమాణాలు, నిబంధనలు, ఆ నిబంధనలు చట్టానికి అనుగుణంగా ఉన్నాయా? లేదా?.. ఎంట్రన్స్‌కు సంబంధించిన విధివిధానాలను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించిందా? ధ్రువీకరించిందా?

5. బోధనా సిబ్బందిని (అకడమిక్ స్టాఫ్) యూనివర్సిటీ ఎలా నియమించింది. వారి ఎంపికను ఏ కమిటీ చేపట్టింది. సిబ్బంది నియామకం యూజీసీ (UGC) నిబంధనలకు లోబడే చేపట్టారా? ఆ నియామక ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ధ్రువీకరించిందా..?

6. రాష్ట్రంలో ఇతర విద్యా సంస్థలు, యూనివర్సిటీలకు విధించిన నిబంధనలు, షరతులను ఈ యూనివర్సిటీలు కచ్చితంగా పాటిస్తున్నాయని నిర్ధరించడానికి ప్రభుత్వం తనిఖీ బృందాన్ని ఏర్పాటు చేసిందా? చేస్తే ఆ బృందం తనిఖీలు (ఇన్‌స్పెక్షన్లు) నిర్వహిస్తుందా? తరచూ తనిఖీలు చేస్తున్నాందా? నిబంధనల అమలును తనిఖీ బృందం పర్యవేక్షిస్తుందా? ఏవైనా నిబంధనల ఉల్లంఘనలను గుర్తించారా? నిబంధనలు ఉల్లంఘిస్తే ఏమైనా చర్యలు తీసుకున్నారా? ప్రభుత్వం తరపు నుంచి ఏవైనా మినహాయింపులు ఇచ్చారా?

7. 'లాభాపేక్ష లేని, నష్టం లేని' (నో ప్రాఫిట్, నో లాస్) ప్రాతిపదికన పని చేస్తున్నామని ప్రకటించుకున్న యూనివర్సిటీలు నిజంగా అలానే పని చేస్తున్నాయా? ప్రభుత్వం దానిని ఏ అధికారంతో అనుమతించింది. యూనివర్సిటీ ఏర్పాటు చేసిన వారు, ఆయన కుటుంబ సభ్యులకు చెల్లించే వేతనాలు, ఇతర ఖర్చులు, సంపాదించిన ఆస్తులతో సహా ఇతర అంశాలకు యూనివర్సిటీల నిధులు మళ్లించలేదని ఎలా నిర్ధారించారు? ఆయా యూనివర్సిటీల ఖాతాలను ఖాతాలను ఆడిట్ చేశారా? నిధుల మళ్లింపుపై ఏవైనా పరిశీలన చేశారా? యూనివర్సిటీ ఏర్పాటు చేసిన వ్యక్తి, ఆయన కుటుంబ సభ్యులకు చేసిన చెల్లింపులను నిశితంగా పరిశీలించారా? యూనివర్సిటీ ఏర్పాటు చేసిన వారు, ఆయన కుటుంబ సభ్యులు సంపాదించిన ఆస్తులను పరిశీలించారా? ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘనలను గుర్తించారా? గుర్తిస్తే తీసుకున్న చర్యలు ఏమిటి?

8. విద్యార్థులతో పాటు బోధనా సిబ్బంది ఫిర్యాదుల పరిష్కారానికి ఏదైనా వ్యవస్థ సదరు యూనివర్సిటీలో ఉందా? ఉంటే అవి పని చేస్తున్నాయా? ఫిర్యాదుల పరిష్కార కమిటీల కూర్పు ఎలా ఉంది. అప్పీలేట్ చేసుకునే అవకాశం ఉందా? ఇప్పటి వకు ఏవైనా ఫిర్యాదులు అందాయా? అందితే వాటిని పరిష్కరించారా.?

9. యూనివర్సిటీలు చట్టప్రకారం నిర్దేశించిన కనీస వేతనాలను అకడమిక్ స్టాఫ్‌కు చెల్లిస్తున్నాయా? యూజీసీ (UGC) నిబంధనల అమలును ధ్రువీకరించారా? సిబ్బంది వేతనాల రికార్డులను పరిశీలించారా? ఈ క్రమంలో ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన గుర్తించారా? అలా గుర్తిస్తే ఏమైనా చర్య తీసుకున్నారా?

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తనిఖీ బృందం రాష్ట్రంలోని ప్రైవేట్ యూనివర్సిటీల్లో ఆయా అంశాలను తనిఖీ చేసి ఆ వివరాలతో సమగ్ర అఫిడవిట్ రూపొందిస్తోంది. ఆ అఫిడవిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించనుంది. అఫిడవిట్ సమర్పణ అనంతరం సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం తదుపరి కార్యాచరణ చేపట్టనుంది. అలాగే తనిఖీ బృందం ఈ 9 అంశాలతో పాటు సంబంధిత ఇతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక రూపొందించనుంది.

## విరిగిన ఎముకలను త్వరగా అతుక్కునేలా చేసే పురాతన వంటకం.. తాత ముత్తాతలు ఇదే తినేవాళ్లు




ఈ పచ్చడి మన పూర్వీకుల నుంచి తింటున్నారు అంతేకాదు, దీనిని తింటే విరిగిన ఎముకలను కూడా త్వరగా అతుక్కుంటాయి ఇంకా బెడ్ మీద నుంచి లేవలేనోళ్ళు కూడా ఉరుకులు పెడతారు. అంతకముందు ఈ కాడలు తెచ్చుకుని తినేవాళ్లు ఎందుకంటే, దీనిలో ఔషధ గుణాలు ఉన్నాయి. మరి, ఇంకెందుకు లేట్, దీనికి కావాల్సిన పదర్ధాలు, తయారీ విధానం గురించి ఇక్కడ తెలుసుకుందాం ఈ పచ్చడి తింటే విరిగిన ఎముకలను కూడా అతుక్కుంటాయి ఇంకా లేవలేనోళ్ళు కూడా లేచి పరుగులు పెడతారు. ;పాత రోజుల్లో ఈ కాడలు తెచ్చుకుని మరి దీనిని బాగా తినేవాళ్లు దీనిలో అన్ని ఔషధ గుణాలు ఉన్నాయి. మరి, ఇంకెందుకు లేట్, దీనికి కావాల్సిన పదర్ధాలు, తయారీ విధానం గురించి ఇక్కడ తెలుసుకుందాం.

కావాల్సిన పదార్థాలు: నల్లేరు కాడలు, 100 గ్రాములు పచ్చిమిర్చి, 10 వెల్లుల్లి రెబ్బలు, మీడియం సైజ్ ఉల్లిపాయ, చింతపండు, ఒక టేబుల్ స్పూన్ కారం, నాలుగు టేబుల్ స్పూన్స్ నూనె, రుచికి సరిపడనంత ఉప్పు, అర టేబుల్ స్పూన్ ఆవాలు , అర టేబుల్ స్పూన్ 10 ఎండు మిర్చి, కరివేపాకులు ఆకులు తీసుకోవాలి.నల్లేరు పచ్చడి తయారీ విధానం: ముందుగా నల్లేరు కాడలను తీసుకుని శుభ్రపరచుకోవాలి. అలాగే, తీగలలు లాగా ఉంటాయి వీటిని మూడు సార్లు బాగా కడిగి చిన్న చిన్న ముక్కలుగా చేసుకుని, వాటి మీద ఉన్న పీచు తీసేసి పక్కన పెట్టుకోవాలి. ఆ తరవాత మళ్ళీ ఇంకో పాన్ లో వేయించుకోవాలి. ఇలా చేస్తే మెత్తగా మగ్గుతాయి నల్లేరు పచ్చడి తయారీ విధానం స్టెప్ 1 : పచ్చి మిర్చి, టమాటాలను కూడా దీనిలో మగ్గించుకుని రోటిలో బాగా మంచిగా నూరుకోవాలి. ఇక చివర్లో గ్యాస్ వెలిగించి పాన్‌లో ఆయిల్ వేసి పచ్చిమిర్చి, నాలుగు వెల్లుల్లి వేసి బాగా వేయించాలి. ఆ తరువాత నల్లేరు కాడలను వేసి మెత్తగా అయ్యేవరకు నూరుకుని తినాలి అయితే, ఇతర సమస్యలతో బాధపడేవారు ఈ పచ్చడి తినే ముందు వైద్యున్ని సంప్రదించి తినాలి (NOTE: ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణులు అందించిన సమాచారం ప్రకారం ఇక్కడ తెలియజేయడమైనది. ఆరోగ్యరీత్యా ఎలాంటి సమస్యలు ఉన్నానేరుగా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది)

## నోటి పూతల ఉన్నవాళ్లు తినాల్సిన పల్లెటూరి సద్ది బువ్వ.. ఇలా చేస్తే మంటే ఉండదు కడుపుకు చల్లగా..



నోటి పూతల ఉన్నవాళ్లు ఇలా పల్లెటూరి సద్ది బువ్వ తింటే కడుపులో చల్లగా ఉంటుంది. కాబట్టి మీరు కూడా మీ ఇంట్లో తప్పక ట్రై చేయండి. మరి ఇంకా అసలు లేట్ చేయకుండా దీనికి కావాల్సిన పదార్థాలు, ఎలా తయారు చేయాలో ఇక్కడ చదివి తెలుసుకుందాం..సాంప్రదాయ సద్దన్నం రెసిపీకి కావలసిన పదార్థాలు: రెండు కప్పుల సద్ది అన్నం, ఒక కప్పు పెరుగు, రుచికి సరిపడా ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ అల్లం తురుము, నాలుగు పచ్చిమిర్చి , కనీసం 5 కరివేపాకు ఆకులు, అర కట్ట కొత్తిమీర, ఒక కప్పు దానిమ్మ గింజలు, ఇంకా ఒక కప్పు ద్రాక్షను తీసుకోవాలి సాంప్రదాయ సద్దన్నం రెసిపీ తాలింపు కోసం కావలసిన పదార్థాలు : రెండు టేబుల్ స్పూన్స్ నూనె , ఒక టేబుల్ స్పూన్ ఆవాలు, ఒక టేబుల్ స్పూన్ మినప్పప్పు , ఒక టేబుల్ స్పూన్ శనగపప్పు, అర టేబుల్ స్పూన్ జీలకర్ర , నాలుగు ఎండుమిర్చి , కొద్దిగా ఇంగువను తీసుకోవాలి. దీనిని సరిగ్గా చేస్తే మంటే ఉండదు. సాంప్రదాయ సద్దన్నం రెసిపీ తయారీ విధానం : మీరు ముందుగా సద్దన్నం తీసుకుని ఆ అన్నాన్ని పూర్తిగా చల్లారనివ్వండి. ఆ తరువాత దీనిలో కొద్దిగా కొద్దిగా పెరుగు, ఇంకా రుచికి సరిపడా ఉప్పు కూడా వేసి దీనిని మంచిగా కలుపుకోవాలి. ఇంకా ఒక పాన్‌లో కొద్దిగా ఆయిల్, ఇంకా కొద్దిగా నెయ్యి వేసి వేడి చెయ్యాలి.సాంప్రదాయ సద్దన్నం రెసిపీ తయారీ విధానం స్టెప్ 1 : కొద్దిగా ఆవాలు, అర టేబుల్ స్పూన్ మినప్పప్పు, అర టేబుల్ స్పూన్ శనగపప్పు, కొద్దిగా జీలకర్రను వేయించండి. ఆ తర్వాత ఎండుమిర్చి, నాలుగు పచ్చిమిర్చి, ఇంకా కొద్దిగా అల్లం, ఇంకా కొద్దిగా కరివేపాకు, ఇంకా కొద్దిగా ఇంగువ వేసి పోపు పెట్టుకోవాలి.ఈ పోపును పెరుగు అన్నంలో వేసి మంచిగా కలుపుకోవాలి. అరకట్ట కొత్తిమీర, దానిమ్మ గింజలు, ద్రాక్షతో 10 నిమిషాల పాటు ఉంచితే రుచులు బాగా కలిసిపోతాయి చల్లగా వడ్డించుకోవాలి. సాంప్రదాయ రుచికి ఇది ఏ మాత్రం తీసిపోదు. ఇంకా రాత్రి మిగిలిన అన్నాన్ని ఉదయం పూట పెరుగుతో కలిపి, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చితో తింటే టేస్టీగా ఉంటుంది.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com